


బుద్ధవరపు నాగరాజామాత్యుని రచనలు

(సంకలనము)

వివిధ పత్రికలలో ప్రచురితమైన కవితలు, నాటికలు

పురాణ గాయకుడు (కవిత)	భారతి (ఏప్రియల్, 1931)	2
వాన పడిన రాత్రి (నాటిక)	తెలుగు స్వతంత్ర (6 ఆగష్ట్, 1948)	3
సీతాకోక చిలుక (నాటిక)	తెలుగు స్వతంత్ర (22 అక్టోబర్, 1948)	9
క్రొత్త సంవత్సరం దినచర్య (నాటిక)	తెలుగు స్వతంత్ర (7 జనవరి, 1949)	16
మీసాల పక్షులు (నాటిక)	కిన్నెర (మార్చ్, 1949)	21
నావలో(నాటిక)	తెలుగు స్వతంత్ర (13 మే, 1949)	40
పుష్పబాణ విలాసము (నాటిక)	కిన్నెర (మే. 1950)	43
ప్రార్ధనము (కవిత)	ఆంధ్రప్రభ	62
యాత్రికత్రయము (కవిత)	ఆంధ్రప్రభ	63
కుతుకులూరు	బుద్ధవరపు (కుతుకులూరు) వంశావళి (1991)	64
'నాగరాజుగారి' నవకవి - ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి	భారతి (ఆగష్ట్ 1938)	65
నాగరాజామాత్యుడు	- బుద్ధవరపు శివరామకృష్ణ - వంశావళి (2011)	70

౩౩. రాష్ట్రీయములలోని రైలుదారి యవసరమైనచో వారాష్ట్రీయములతో ఏర్పాటుచేసికొని దానిని వశము చేసికొనుట.

౩౪. ఆయా రాష్ట్రీయముల యంగీకారముతో రైలుదారిని వృద్ధిచేయుట.

౩౫. రాష్ట్రీయముల సరిహద్దు దాటి వ్యాపారములను చేయువారి తగవులను తీర్మానించుట, రాజీలకు మధ్యస్థులను నియమించుట.

౩౬. పార్లిమెంటువారు మార్పుచేయునవరకు రాజ్యాంగచట్టము నిర్ణయించిన అన్ని విషయములందును సమితి పార్లిమెంటు కధికారము కలదు.

౩౭. రాష్ట్రీయముల పార్లిమెంటు సమితి పార్లిమెంటువారికి తీర్మానించుటకొరకు పంపు విషయములు. అట్టి తీర్మాన మారాష్ట్రీయములకు వర్తించును.

౩౮. ఈ రాజ్యాంగ నిర్మాణ సమయమునాటికి బ్రిటీషు పార్లిమెంటువారు గాని, ఆస్ట్రేలియా కవున్సిలు మాత్రమె గాని చలాయించుట కధికారము కలిగిన విషయములను గూర్చి రాష్ట్రీయములకొరకైన గాని, అంగీకారముతో గాని సమితి దేశమున చలాయించుట.

౩౯. ఈ రాజ్యాంగమువలన పార్లిమెంటుకు సమితి ప్రభుత్వమునకు నొసగబడిన అధికారములు అమలు జరిగించుటకు వలసిన అధికారములు.

౪౦ వ శెక్షను:—సమితిలో నిశాంతికి క్రమ పరిపాలనమునకు, సత్ప్రభుత్వమునకు నీక్రింది విషయములను గూర్చిన శాసనములను చేయుటకు పార్లిమెంటునకు మాత్రమె సంపూర్ణాధికారము కలదు:

(౧) సమితి ప్రభుత్వముయొక్క కేంద్రస్థానము నిర్ణయించుట, సమితి ప్రభుత్వమువారు వశముచేసికొనిన ప్రదేశములు.

(౨) ఈ రాజ్యాంగమువలన సమితి ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గమువారి యధికారము క్రింద నుంచబడిన పరిపాలన శాఖలోని ఉద్యోగులను గూర్చిన విషయములు.

(౩) ఈరాజ్యాంగమువలనపార్లిమెంటుకు ప్రత్యేకాధికారము కలదని నిర్ణయింపబడిన ఇతరవిషయములు.

పురాణగాయకుఁడు

బుద్ధవరపు నాగరాజుగారు

యౌవనోజ్జ్వలశుభవసంతాగమముల
నెంతిపాడిన నతని గొంతెండలేదు
జీరవోలేదు; బడలిక చెందలేదు
వాడలేదు మాధుర్యమ్ము వీడలేదు.
చివురులను మెక్కి యెలగొంతు చేవదేర్చి
పికము లపుడె వసంతగీతికలు పాడె
తెటివిరిదేనెఁ దనగొంతు తీపిజేసె
వెల్లివిరిసెను సెలయేటి విరులపాట.
అతనిపాటలఁ బారవశ్యమ్మునంది
తరులు గిరులును జడగళత్వమ్ము విడిచి
స్తోత్ర మొనరింప, చిరునవ్వుతో నతండు
ప్రాఁతపాటలె పెక్కేండ్లు పాడినాఁడు.
ఇప్పు డామని తెలిపోయినది, నాఁటి [గ
యభిల ఝంకారములు మాయమయ్యె మూఁ
వడెనో; కోయిలగొంతు సవ్వడియె లేదు
నిదురవోయెనో; సెలయేరు రొదలు మరచె.
నేఁ డతఁడు చాల ముసలియైనాఁడు, పూర్వ
కాలములయందు, నుత్సాహ కలన మీర
పాడి మించిన కంఠ మీ నాఁడదేమొ
విడనె విడదాయె శాపమ్ము వెట్టినట్లు.
గొనుగువడి గొంతుపస యడంగిన కొలంది
పాటపై నాతనికి కోర్కె ప్రబలిపోయె
వడకినను గొంతు బీటలు వాఱుచున్న
పాడ నుంకించుఁ దుదిపూర్వపర కతండు.
అతఁడు తిలకించి దిద్దిన యట్టివారె
యతని త్రోవలఁ బోరిపు, హైనవాని
నాలకించి మహాహ్లాద మంది యతఁడు
ప్రాఁత క్రొత్తకుఁ జోటీయవలయు ననును.

వానపడిన రాత్రి

నాగరాజామాత్యుడు

[ఊరి వెలుపల ఒక శిథిలమైన గుడిసెలో—చీకటి పడుతూవుంటుంది. కూలి తల్లి గవరమ్మ ఒక మూల కుక్కిమంచంలో జ్వరంతో మూలుగుతున్న తన పిల్లవాణ్ణి సముదాయిస్తూ, కళ్ల నీళ్లు పెట్టుకుంటోంది. ఇంకో మూల ఒక బుడ్డి దీపం కొడిగట్టి కునుకుతూ, దోమో, ఏదో పడినప్పుడల్లా పెద్దగా మండుతూ వుంటుంది. గుడిసెలో ఏవేవో వికృతాకారాలతో నీడలు అటూ, ఇటూ మసలుతున్నాయి. బయట ఆకాశంలో కారుమేఘం పట్టి కళ్లు జిగేలుమనేలాగ మెరుస్తోంది. సాయంకాలంనించి ఒకటే ఈదురుగాలి]

గవరమ్మ: బాబా, పిలిచావా?-ఏంకావాలి?

పిల్లవాడు: అమ్మా చలే, కప్పు—ఉహూ హూ హూ.

గవ: ఏం చెయ్యనురా, బాబా-నీ కిప్పుడు కప్పడానికి దుప్పటెక్కడనించితేను? నా దగ్గరగా జరుగు—అదీ, నాకొంగు కప్పుకో. ఏదో తినడానికి తిండీ, దొరికినా దొరక్కపోయినా ఎలాగో రోజులు వెళ్లపుచ్చుతున్నామనుకుంటూంటే నీకు పూష్టంకూడా ఇప్పుడేరావాలా, నా తండ్రీ? అబ్బ, ఏమిటిఖాళ్, నాకే ఇంత చలేసుకొస్తోంది!

పిల్ల: అమ్మా!

గవ: బాబు?

పిల్ల: బాబొచ్చాడా?

గవ: వస్తారు, బాబూ, కళ్లు మూసుకు పడుకో.

పిల్ల: ఎక్కడికెళ్లాడు?

గవ: పొరుగూళ్ళో ఏదో పని దొరుకుతుందని వెళ్లాడు.

పిల్ల: ఇంకా రాడేం మరి?

గవ: వస్తారు మరి...

పిల్ల: అమ్మా...!

గవ: ఆఁ?

పిల్ల: అదేమిటి, అంత వెలుతురొచ్చింది?

గవ: ఆకాశం మెరుస్తోంది, బాబూ, మేఘం పట్టింది.

పిల్ల: వానొస్తుందా?

గవ: మన కొంపకిసాయం ఇప్పుడు వానకూడా వస్తే అడగక్కర్లేదు. అసలే సూర్యుడూ చంద్రుడూ మన కెప్పుడూ ఇంట్లో సాయం. అదుగో, నే భయపడినంతా అయింది. చినుకులూ, గాలీ మొదలెట్టాయి. ఓరిదేముడా. మబ్బు దట్టంగా పట్టేసింది.

పిల్ల: ఈ వానలో బాబెలా వస్తాడే అమ్మా? తడిసిపోతాడేమోనే?

గవ: భయంలేదు, బాబూ నువ్వు పడుకో.

పిల్ల: అమ్మా, బాబు నాకు మందు తెస్తాడు కాదూ?

గవ: తెస్తారు, బాబూ.

పిల్ల: నాకీ జ్వరం ఎప్పుడు తగ్గుతుంది?

గవ: తెల్లవారేసరికి తగ్గిపోదూ?

పిల్ల: అమ్మా, నీ కెప్పుడైనా యిలా జ్వరం వచ్చిందా?

గవ: ఈ జ్వరం నా కొచ్చినా తీరిపోనుగా, బాబూ?

పిల్ల: బాబుకో?

గవ: కళ్లు మూసుకు పడుకోవు, తండ్రీ?

పిల్ల: అబ్బ, ఆ తలుపేసెయ్యవే, చలిగా తేస్తోంది.

గవ: తలుపువేసే వుంది. వెలిసెల్లోంచొస్తోంది గాలి. ఏం, చలెక్కువగా వుందా? (పిల్లవాడి వొంటిమీద చెయ్యివేసి చూసి) అబ్బ, వీడి వొళ్లు చుర్రుమని ఎలా కాగుతోందో.

పిల్ల: దీపం!...దీపం!

[దీపం రెపరెపకొట్టుకుని ఆరిపోతుంది]

గవ: సరి, అది కాస్తా కొండెక్కిందా?

పిల్ల: అమ్మా, అమ్మా, ఎక్కడున్నావు?

గవ : నీ పక్కనే వున్నానుకాదు బాబూ.

పిల్ల : నాకు భయం వేస్తోందెందుకు ?

గవ : అబ్బే, భయంలేదు, నేనుండగానే నీ దగ్గర ?

పిల్ల : ఉహుహుహూ–నామీద అలా నీళ్ళు చల్లుతున్నావెందుకు ? అబ్బ చలే కప్పు, కప్పు మరీ...

గవ : అయ్యయ్యో ఇంకేం చెయ్యను, ఇల్లు కురుస్తోంది కూడాను. ఉండుబాబూ, నీ మంచం కాస్త ఇలా జరపనీ (మంచం ఈడుస్తుంది) ఏం చలి ఇది ! ఎలాగ ?

[ఒక పెద్ద మెరుపు మెరిసి పిడుగు పడుతుంది]

పిల్ల : అమ్మా... అమ్మా !

గవ : బాబు ?

పిల్ల : దేముడొచ్చినట్టున్నాడు చూడు. అడుగో ఏం వెల్తురు !

గవ : అయ్యో, నా తండ్రీ ! వీడికి తెలివి తప్పినట్టుంది. గుణంకూడా కామాల్ను. ఆ భగవంతుడెక్కడున్నాడో ? ఏ డబ్బున్న మహారాజుల ఇంట్లోనో పుట్టక వీడు...

[పిడుగులతో వర్షం, గాలీ హెచ్చిపోతాయి గుడిసె కూలిపోతూవుంటుంది]

గవ : (బిగ్గరగా) అయ్యో, అయ్యో ! ఇంకేముంది. ఈ కొంప కాస్తా కూలిపోతోంది. బాబా. నా బాబా !

పిల్ల : అమ్మా, అమ్మా ! ఏమిటూ చప్పుడు ? ఎక్కడున్నావు ?

గవ : ఇక్కడరా బాబా ! అయ్యో, ఈ వాసాలు విరిగి నెత్తిమీద పడిపోతున్నాయి. ఎవరైనా పుణ్యాత్ములు కాపాడండి. బాబూ, రక్షించండి. ఎలాగ బయట పడటం ? నా బాబునెత్తుకుని...

పిల్ల : అమ్మా ! అమ్మా !

గవ : (స్తంభం విరుగుతుంది.) అయ్యయ్యో; చచ్చాను !

[విరిగిన స్తంభం తూలిపడి కాలు విరిగిన గవరమ్మ, స్పృహతప్పిన తన పిల్లగాణ్ణి భుజంమీద వేసుకొని, ఎలాగో ఈడ్చుకుంటూ ఆహోరుగాలిలో, వానలో పడి తడిసి ముద్దఅయి ఊళ్ళోకివచ్చి శర్మ అనే ఒకగృహస్థు అరుగుమీదచేరి ఒక నిట్టూర్పు విడుస్తుంది. పిల్లవాడు మూలుగుతూ వుంటాడు]

శర్మ : (కిటికీతెరిచి) ఎవరక్కడో పీనుగులా అరుగుమీద ?

గవరమ్మ : నేనండిబాబు

శర్మ : నేనంటే?

గవ : నా పేరు గవరమ్మండి.

శర్మ : గవరమ్మంటే?

గవ : కూలిచేసుకుందేదాన్నండి బాబు.

శర్మ : కూలిచేసుకునేదానవా? పెద్ద గవర్నరులాగవచ్చి తలుపుకొట్టావు అర్ధరాత్రివేళ, ఏం కావాలి నీకు?

గవ : తమరు రక్షిస్తేనేగాని వీల్లేదండి.

శర్మ : వీల్లేదూ? ఇంత వర్షంలో ఇంట్లో పడి వుండక ఇలా ఎందుకు వచ్చావసలు?

గవ : బాబుగారు, ఈ గాలివానకి నా యిల్లు కూలిపోయిందండి.

శర్మ : అయితే అందుకు నన్నేం చెయ్యమంటావు? భగవంతుణ్ణను; ఇదోవంక యీ రోజుల్లో కాస్త వర్షంకురిస్తేసరి, మీకేమో ఇళ్లు కూలిపోతాయి. మేమేమో రక్షిస్తేనేగాని వీల్లేదు - వెళ్లు వెళ్లు.

గవ : నిజమేనండి, బాబుగారు.

శర్మ : ఇదుగో, రేపు మీ యిళ్లు కూలిపోయిన వాళ్ళకోసం చందాలు వేయిస్తారు. వాళ్ళదగ్గరకె వెళ్లు. ఛీ నిద్దరంతా పాడైయిపోయింది.

గవ : నేనడుక్కోడానికి రాలేదండి. కాస్త తెల్లవారినదాకా ఇక్కడ తలదాచుకోనిస్తే చాలునండి, తమరింకేమీ యివ్వక్కర్లేదు.

శర్మ : అయ్యో, మీ తలలు దాచుకోడానికే మరి మేము ఇంత డబ్బుపోసి యిళ్లు కట్టించుకునుట. ఇంకా ఆ తడిగుడ్డలతో, చక్కగా ముగ్గుపెట్టిన అరుగంతా తొక్కి తగలేసిందేకాకుండా–నడు, నడు.

గవ : కొంచెం కనికరించండి, బాబుగారు–వీడు నా కొడుకండి.

శర్మ : ఇంకావెళ్ళలేదూ? నీ కెంతమంది సం

తాపం అని నిన్నిప్పుడేం కొత్తగా ప్రశ్న వెయ్యలేదు. నీకొక్కడూ చెప్పమన్నాంట?

గవ : బాబూ, నా మనవి ఆలకించండి. ఈ కుర్రాడికి జ్వరమండి. కొంపకూలిపోయిందండి, స్తంభంపడి నా కాలు విరిగిపోయిందండి. పిల్లి లాగా యీడ్చుకొచ్చి యిక్కడపడ్డానండి, ఈ పాతోటున్నాకలో, యీ చలిబాధలో ఇంకెక్కడికీ కదలలేను బాబుగారూ, అబ్బ... చలి... పక్కలిరిగిపోతున్నాయి. కాలు .. పిల్లాడు...... జ్వరం...

శర్మ: నీకుసాయం ఒక జబ్బుకుర్రాడుకూడానా? చూడు, ఇక్కడికి దగ్గరగానే ఆసుపత్రివుంటుంది. అక్కడికెళ్లు- మా అరుగుమీదలే.

గవ : కదలలేనండి, బాబూ ఇంక... చలి.

శర్మ : ఏమిటి, కదలలేవూ? మంచి మొండి ఎత్తే! నువ్వుముందు మా అరుగుమీదనించి లేస్తావా, లేదా?

గవ : లోపలికి రానండి, బాబు- దొంగదాన్ని కాదు, కాస్త కాపాడండి. తెల్లారేదాకా యిక్కడే పడుకోనివ్వండి.

శర్మ : లేకపోతే, లోపలికికూడా ప్రవేశిద్దామనుకున్నావు కాబోలు—దొంగదికాదుట! లే, లేచి,పోనీ ఆప్రక్కయింటిఅరుగుమీద పడుకో-పో.

గవ : ఆరూ తమరిలాగే... పిల్లగాడు తడిసి పోతాడు, బాబుగారూ.

శర్మ : అంత జాలీ, భయమూ వున్నదానవు, ఇప్పటిదాకా ఎందుకు తడిపావు వాణ్ణి? ఇదో వేషం, ముందు నువ్వక్కణ్ణించిలేస్తావా, లేదా? ఇదేం గోల ఇవాళరాత్రి మాకు! ఇలాగకాదు-ఓ రే వెంకన్నా... వెంకన్నా... ఇదెవరో దీన్ని మన అరుగుమీదనించి లేవగొట్టు.

గవ : అయ్యోబాబూ!...పోతానండి, పోతాను. మీరు సుఖంగావుండండి—బాబా... అబ్బా... చలి...

[ఉసూరుమంటూ గవరమ్మ మళ్ళీ తన పిల్లవాణ్ణి బుజంమీద వేసుకుని వర్షంలో తడుస్తూ, బురదలో పడుతూ లేస్తూ దగ్గరగానేవున్న ఒక డాక్టరుగారి యిల్లు చేరి తలుపుకొట్టి మెట్లమీద చతికిలబడుతుంది.]

డాక్టరు: (తలుపు తీసి) ఎవరునువ్వు?

గవ : నీరసంగా బాబూ, నేను కూలిదాన్నండి, తమకు వైద్యులు...

డాక్టరు : అదేమిటి, ఆ రెండు వృత్తులకి ఏమి సంబంధముంది?

గవ : వీడు నా కొడుకండి.

డాక్టరు : అయితే ?

పిల్ల : అమ్మా...(నీరసంగా) మంచినీళ్లు.

గవ : అయ్యో నాయనా, ఇంత వాన కురుస్తూంటే నీకు గుక్కెడు మంచినీళ్లివ్వలేక పోయాను రా తండ్రీ.

డాక్టరు : ఇంతవర్షంలో ఆ కుర్రాణ్ణెందుకు అలా తడుపుతున్నావు?

గవ : బాబూ, యీ గాలివానకి మా ఇల్లు కూలి పోయిందండి... అబ్బా... చలి.

డాక్టరు : నీకేకాదు, అందరికీ చలివేస్తోంది. త్వరగాచెప్పు.

గవ : వీడికి ఒళ్లు మండిపోతోంది బాబుగారు; స్తంభం విరిగిపడి నాకాలువిరిగిపోయిందండి. కాస్త ఏదైనా మందిప్పించి పుణ్యంకట్టుకోండి బాబు...

డాక్టరు : నువ్వు కూలి పని కాదూ, చేస్తానన్నావు?

గవ : చిత్తం.

పిల్ల : అమ్మా. (మూలుగుతాడు)

గవ : నా బాబు!

డాక్టరు : చూడు, నాదగ్గర మందు లేవీ లేవిప్పుడు. కాంపౌండరుకూడా లేడు.

గవ : అయ్యోబాబు, నాకు ప్రాణాలుపోతున్నాయండి, బాబు యీ చలితోటి... అబ్బా... తమకి తరవాత నాకు చేతనయింది పుట్టచెప్పుకుంటానండి బాబయ్యగారు. నాపిల్లగాణ్ణెలాగైనా బ్రతికించి...

డాక్టరు: నువ్వెక్కడ ఇచ్చుకోగలవులే, నాకు ఫీజు.

గవ : రక్షించండి, బాబు, దిక్కుమాలినదాన్ని. వీడికి కప్పడానికి కాస్త గుడ్డముక్క అయినా లేని చేతదాన్ని—ఉన్న బట్టముక్క ఒక్కటీ తడిసి పోయింది. చలి. చలి... తమ పేరు చెప్పుకుని బతుకుతామండి...

డాక్టరు : వాట్లన్నింటికీ ఏంలే...

గవ : అయ్యో, వీడి వొళ్ళంతా చల్లపడిపోతోందండి బాబయ్యా.

డాక్టరు: అందుకనే, ఎలాగో అలాగ వీణ్ణింక ఆలస్యం చెయ్యకుండా, చూడు, పెద్ద ఆసుపత్రి వుంది, అక్కడికి తీసుకెళ్లు. అక్కడ చూస్తారువీణ్ణి-వెళ్లు.

గవ: నేను కదిలే స్థితిలోలేను, బాబయ్యగారు. చలికి వొళ్లు కొయ్యబారి పోయింది. ఈ కాలు.

డాక్టరు: ఇంకనీయిష్టం, నువ్వీ అరుగుమీద మాత్రం పడుకోకూడదు. నలుగురు పెద్దమనుషులూ వచ్చేపోయే యిల్లు.

గవ: తెల్లారిదాకా నేనండి, బాబు, ఆ తర వాత...

డాక్టరు: ఓహోహో, నీకు నెమ్మదిగా చెపితే నచ్చటంలేదు. ఇక్కడ పడుకోకూడదని చెప్పాను కాదూ? ఇంక వెళ్లుమరి.

గవ: మీ పాదాలమీదపడి మొక్కుకుంటు న్నాను, బాబూ.

డాక్టరు: నువ్వింకా ఆలస్యంచేస్తే ఇంకా మించిపోతుంది. వెంటనే వెళ్లు పెద్ద ఆసుపత్రికి.

గవ: పోనీ, ఒక పాతగుడ్డ ముక్కైనా దయ చేయించండి. నేనిదివరకెప్పుడూ అడుక్కున్న దాన్ని కాదండి. ఏదో కష్టపడి కూలిచేసుకుని బ్రతుకుతున్నాను. ఇవాళ నాగతి యిలాగ...

డాక్టరు: పాతగుడ్డముక్క లెక్కణ్ణించి తెమ్మ న్నావు? కొత్తగుడ్డలకే కరువైపోతే పాతగుడ్డ లెలా వస్తాయి? ఉంటే, ఇందాకనే ఇచ్చేవాణ్ణి. ఇంక పద.

గవ: అయ్యో బాబయ్యా...బాబా...అయ్యో భగవంతుడా: ఏంరాత రాసిపెట్టావురానాకు?... చలేస్తోందా, బాబా?......(పిల్లవాణ్ణి తీసికుని నెమ్మదిగా బయలుదేరుతుంది)

డాక్టరు: (తలుపువేసి) వొదిలింది శని, అమ్మ య్య...ఇంత ప్రళయంలోనూవచ్చి తలుపు కొడితే ఏదో పురిటికేసేదో అనుకున్నాను. ఛా, ఇలాంటి వాళ్లకి వుచితంగా మందులివ్వడానికే కాబోలు మేము ఇంత డబ్బూ, తగలేసి, బోర్డులు కట్టుకుంట!

[మనుష్య మాత్రులెవరూ తనికి ఆశ్ర యమివ్వరని గ్రహించుకున్న గవరమ్మ కొయ్యబారిన పిల్లగాణ్ణి ఎత్తుకొని హృద య భారంతో, కాలు నొప్పితో ఆ గాఢాంధకారంలో, బురదసందులలో పడి ఎలాగైతేనేం తిన్నగా గ్రామం చివరవున్న ఈశ్వరాలయం చేరుతుంది. అక్కడనించి దేవుడు తమని బయటికి పొమ్మనడు గదా అని ధైర్యం తెచ్చుకుంటుంది. పిల్లగాణ్ణి మండపంలో పడుకోబెట్టి, తడిసిపోయిన తన చింకికొంగు పిడిచి మంచుగడ్డలాగ వున్న వాడివొళ్ళు తుడుస్తూవుంటుంది. కాపీర్ణం కొద్దీని, తుదకు తనకే నీరసం వచ్చి మూలగడం మొదలు పెడుతుంది.

అర్చన పూర్తిచేసుకొని పూజారి గుడి తలుపు తాళంవేసి ఆదారినే ఇంటికిపోతూ అనుమానంవచ్చి ఒకసారి ఆగుతాడు]

గవ: అబ్బ చలి, చలి...ఏమిచలి...ఊహు హుహూ...నా బాబు కప్పుడే వొళ్లు చల్లబడి పోతోంది. బాబా...బాబా...నిద్దరో; హాయిగా నిద్దరో...దిక్కులేనివాళ్లకి దేముడే దిక్కంటారు. ఈ దేముడు గుళ్లో అయినా మమ్మల్నెవరూ కదప కుండా తెల్లారీకాదా తలదాచుకోనిస్తే—ఊహు హుహూ.

[ఒక పెద్దమెరుపు మెరుస్తుంది]

పూజారి: అమ్మయ్య, అర్చన పూర్తిఅయిం దెలాగైతేనేం—అబ్బ, ఏంచలి. ఏంవర్షం... ఏయ్. ఎవరా మండపంలో పడుకుని మూలుగు తున్నారు?...ఏం, మాట్లాడవు? ఎవరునువ్వు?

గవ: నేనొక దిక్కుమాలిన పక్షిని, స్వామీ?

పూజారి: ఏం, ఇక్కడ పడుకున్నావేం? ఇక్కడి కెలావచ్చావు నువ్వసలు?

గవ: తమరు పూజారులనుకుంటాను?

పూజారి: అయితే?...నువ్వెవరు?

గవ: బాబూ, ఈ వర్షంలో నా కొంప కూలి పోయింది. పేదదాన్ని, జ్వరంతోవున్న నా కొడు కుని చంకపెట్టుకుని ఎవరి అరుగుమీదఅయినా కాస్త తలదాచుకుందామని బయలుదేరాను.

పూజారి: ఇక్కడకెందుకొచ్చావు?

గవ: ఎవరి అరుగుమీదకి వెళ్లినా అందరు మారాజులు నన్ను దొంగదాన్ని తరిమినట్టు తరిమే శారు. స్వామీ, నా కొడుకుకి స్పృహలేదు. జ్వరంతో యీ వానలో తడిసిపోయాడు. కప్పుకో డానికి గుడ్డ ముక్కైనాలేదు. నేనూ, చచ్చిపోడా

నీకి సిద్ధంగావున్నాను. యీ చలిలో...రామా... రామా:... ఆఖరికీ స్వామిదగ్గర యింత నీడ దొరుకుతుందని వచ్చి యిక్కడ వొరిగాను...అబ్బా!

పూజారి: ఏయ్. అలా పడుకోకు మళ్లీని. ఇదేం సత్తరువనుకున్నావేమిటి? ఇక్కడ ఎవరూ పడుకోకూడదు, తెలసిందా? అందులోనూ పవిత్రంగా వుండవలసిన స్వామి కోవెలలో ఇలా రోగిష్టివాళ్లెవరూ వుండకూడదు. పెందరాళే లే; ఎక్కడికైనా వెళ్లు, నీ కొడుకుని తీసుకుని.

గవ: దేముడికీ యీ ఎక్కువ తక్కువలూ అవి వుంటాయా, స్వామీ? మావంటి దిక్కులేని వాళ్లకి ఆయనే కాదూ దిక్కు?

పూజారి: అబ్బో, యీ వేదాంతానికేంలే, లే ముందక్కడనించి.

గవ: నన్నిప్పుడు చంపినా నేను లేచేస్థితిలో లేను, స్వామీ—అబ్బా! బాధ...చలి...బాబా! ఏడీ నా బాబు?

పూజారి: ఏమిటి నీ మొండితనం? చెపుతోంటే వినపడటంలేదూ నీకు?

గవ: క్రిందటి జన్మంలో ఏం పాపం చేసుకున్నానో? ఏమిటీ వెలుగు! అదుగో స్వామి! దర్శనం ఇస్తున్నాడు!

పూజారి: తలుపులు తాళాలువేసినా దర్శనం ఇస్తున్నాడు కాబోలు స్వామి నీకు? ఈ పిచ్చి కూతలకేంలే... లే

గవ: అయ్యా, మొన్న నీ గుడి ప్రహరీ గోడ పడిపోయినప్పుడు నేను కష్టపడి ఇటికలు మోసి స్వామివారికోసం ఆ గోడ కట్టాను. మండపానికి వెల్ల వేశాను. అది మరచిపోయాడంటారా అప్పుడే ఆయన?

పూజారి: ఓస్సీ, నువ్వు శ్రమపడి కట్టేవేం ఈ గోడ? దానికి కూలి పుచ్చుకోలేదూ, పాపం? అందరి కూలీలలాగే నువ్వూను.

గవ: కూలి యిచ్చినా, యివ్వకపోయినా ఆయనేకాదూ మనల్ని అందర్నీ కాచి రక్షించేది? ఆ స్వామీ అవతలకి పొమ్మంటే ఇంక మనకి గతి ఏముంటుంది?

పూజారి: బాగుంది. నువ్వు కూలి పుచ్చుకొని గోడలో రెండు ఇటికరాళ్లు వేశావుకదా అని యీ కోవెలలో నీకు హక్కు వుందంటావేమిటి? నువ్వు కూలికివెళ్లి కట్టిన భవంతులన్నింటిలోనూ, నీకంత హక్కువుంటే నువ్విప్పుడు యీ గుళ్లోకి ఎందుకు వస్తావు? ఇంకీ కబుర్లు కట్టిపెట్టి ముందక్కణ్ణించి లేచి వెళ్లు త్వరగా...

గవ: అయ్యో, రామచంద్రా!

పూజారి: లేవవేం...ఊఁ...

గవ: ఇక్కడకూడా లేడూ ఆ భగవంతుడు? ...స్వామీ...

పూజారి: దేవుడు లోపల వున్నాడులే-నువ్వు ముందు...

గవ: స్వామీ, కనికరించండి...చచ్చిపోతున్నాను...బాబా...

పూజారి: నువ్విలా కదిలీలాగ లేవు.—రామదాసూ...రామదాసూ!

గవ: ఓరి, భగవంతుడా! అయ్యో...బాధ...చలి....

పూజారి: మీరిప్పుడిక్కడేదైనా అవుతే రేపుపొద్దున్న గుడిఅంతా బాగుచేయించలేక మధ్యని మేము ఇదవడానికా? ఇదేం దేముడుగుడి అనుకున్నావా మరొకటి అనుకున్నావా? మరీ వస్తోంది...రామదాసూ!...రావేం ఇలాగ?

గవ: ఉహుహుహుహూ...పోసిండి..బాబూ వెడతాను...బాబా!

పూజారి: వెళ్లు వెళ్లు త్వరగా...

గవ: గుమ్మం, గుమ్మం ఎక్కాను, ఒక్క మారాజూ కొంత చోటివ్వలేదు. పురుగును దులిపినట్టు తరిమేశారు...మావంటివాళ్లం చస్తే ఎవరికొక్కవాలి?

పూజారి: ఇంకా ఏమిటలా గొణుగుతున్నావు? లే...

గవ: బాబూ, కష్టాలందరికీ ఒకటేనండి... రేపు మీకొస్తే, వున్నవాళ్లు చూడొద్దండీ?...

పూజారి: ఏమంటున్నావు? ఏమిటి మాటలు ముదురుతున్నావు? శాపనార్థాలుకూడానా నీ బ్రతుక్కిసాయం? నాక్కూడా రోగంరావాలా? మాట్లాడావంటే, చూడుమరి...

గవ: అందరి మనస్సులూ రాళ్లే!...పేదవాళ్ల బ్రతుకింతే...దేవుడి సంతానంట: మనుషులంతా ఒకటే అంటారు మళ్లీని...

పూజారి: ఏమిటమ్మా, అక్కడికి నీవుద్దేశం?— ఈ రామదాసుగాడేమైపోయాడు సమయానికి?- ఏమిరా?...

గవ : దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వ లేదుట... వెడుతున్నాను బాబయ్యగారు... శోక లెయ్యకండి... ఓపికున్నంత సేపూ యీ కుర్రవాణ్ణెత్తుకుని... ఈ వానలో... ఈ చలిలో అయ్యో!...

(కుర్రవాణ్ణి బుజంమీద వేసుకుని మళ్ళీ బయలుదేరుతుంది.)

పూజారి : అమ్మయ్య, శని విరగడయిందిప్పటికి! దిక్కుమాలిన పత్తులు! ఎక్కడినించో వచ్చి ఇక్కడ దాపురించారు. నయమే నడిచింది. అందులో మళ్ళీ ధర్మపన్నాలెన్ని? జాలీ, అంతఃకరణ, అబ్బో! ఒరేయ్, ఆ తలుపులు తాళాలేసెయ్యి, ఈసారి... అబ్బ, ఏం చలి. ఏం చలి.

[చీకటిలో, మెరుపులలో, వానలో, బురదలో, హోరుగాలిలో, చలిలో ఊరి వెలుపల ఒక చెట్టు క్రింద]

ముష్టివాడు : ఓహోహో, ఏం వాన, ఏం చలి! ఇవాళ తెల్లవారేలాగ లేదు. ఎముకలు నుస్సైపోతున్నాయి. ఊహుహుహూ! ఈ చలిలో ఇలా చుట్టపీక దొరకడం నా అదృష్టం, నిన్నటినించి తిండిలేకపోతేనేం... వాన వెలిసినట్టుంది. కాస్త యీ చెట్టుక్రిందచేరితే మంచిది.

(ఏదో పనివున్నట్టు ఒక మోటారుకారు పెద్ద లాంతరు దీపాలతో ఆ దారినే జోరుగా వెళ్ళిపోతుంది.) ఎవరో అదృష్టవంతుడు. ఈ చలిలో వెచ్చగా కారులో షికారుచేస్తున్నాడు.—అరే, ఆ చెట్టుక్రింద ఎవరో పడివున్నారు! ప్రక్కనో పిల్లాడు కూడా వున్నాడే. పాపం యింత చలిలో ఎవరో గాలాగే అడుక్కునే వాళ్ళై వుంటారు.—ఎవరు వారు ఆ చెట్టుక్రింద?... మాట్లాడరేం? అరెరే. కొయ్యయి పోయారు కాబోలు పాపం...ఎక్కడా ఊపిరి వున్నట్టు లేదే!...ఎవరమ్మా నువ్వు?

గవ : ఎవరువారు?...భగవంతుడవా? ఈ కష్టాలు నాకొద్దు...నీదగ్గరకే వస్తున్నాడు. రక్షించు!...బాబా!

ముష్టి : భయంలేదమ్మా, ఇలా మాడు.—అయ్యో ఇంకేముంది. కళ్ళు మూసేసిందా? ఇంత ప్రపంచకంలో ఈవిడ కెక్కడా నీడదొరకలేదు కాబోలు. మావంటి బీదవాళ్ళు బ్రతుకలేమరి...వీళ్ళకిప్పుడీ చలీ, ఆకలీ, అవీ బాధ పెట్టలేవింక. నాకంటె అదృష్టవంతులు. ఆ పుట్టించిన వాడిదగ్గరకెళ్ళిపోయారు హాయిగా!...పాడులోకం!...అబ్బ, చలి, ఏం చలి...ఏం చలి!



సీతాకోక చిలుక

నాగరాజామాత్యుడు



౧

[సూరి గృహం—సాయంకాలం—వీధి సావడిలో సూరి అటూ, యిటూ హడావిడిగా పచారుచేస్తూ వుంటాడు.]

సూరి: కల్యాణీ! కల్యాణీ!

కల్యాణి: (లోపలనించి) ఆఁ.

సూరి: త్వరగా రావాలి.

కల్యాణి: (వచ్చి) వచ్చాను. ఎందుకు?

సూరి: నీ తపస్సు ఫలించింది.

కల్యాణి: అంటే?

సూరి: రంగవల్లికలు శృంగారించి నీ రంగురంగు రెక్కలనుఇంక స్వేచ్ఛగా విప్పుకుని విహరించవచ్చు.

కల్యాణి: ఏమిటి? నాకేం అర్థం అవటంలేదు మీ కవిత్వం.

సూరి: అవసరంలేదు, నా వ్రతంకూడా పూర్తి కావచ్చింది.

కల్యాణి: అసలు సంగతేమిటో చెపుదురూ?

సూరి: అమ్మతో చెప్పు—

కల్యాణి: అబ్బ, ఏమని?

సూరి: ఇవాళ గోపాలంగారు వస్తాడుట, మన యింటికి.

కల్యాణి: గోపాలంగారెవరు?

సూరి: ఒక శ్రీమంతుడు; యువకుడు.

కల్యాణి: అయితే మనింటి కెందుకు రావడం?

సూరి: నీ పరిచయభాగ్యం కలుగచేసుకోడానికిట.

కల్యాణి: నా పరిచయమా? ఎందుకు?

సూరి: నీ సుందర రూపం, నీ వాక్చాతుర్యం, నీ నటనా కౌశల్యం - ఇవన్నీ చూసి ముగ్ధుడై వుంటాడు.

కల్యాణి: ఆయన ఎప్పుడు చూశారు ఇవన్నీని?

సూరి: నిన్నుగురించి ఎంతప్రచారం చేయించానంటావు మరి? పది మందిలోనూ, పత్రికల్లోనూ—సరే, రంగస్థలంమీద—

కల్యాణి: మొన్న నాటకంలో నా వేషం చూసి వుంటారీయన.

సూరి: చూశాడుట. అంతేకాదు, ఇవేళ రాత్రి నువ్వు చెయ్యబోయే బిచ్చకత్తె పాత్రాభినయానికి మెచ్చుకుని నీకో ఉగ్గుగిన్నో, ఉద్ధరిణో బహుమతీ చేస్తాట్టకూడాను.

కల్యాణి: అదేమిటి? ఉగ్గుగిన్నెలూ—

సూరి: వెండిదిలే. ఈరోజుల్లో పెద్ద పెద్ద పాత్రలు బహుమతిచేసే అలవాటు తప్పిపోయింది, చూడు.

కల్యాణి: నే నివాళ నటించకుండానే యెలా మెచ్చుకుంటారు?

సూరి: శ్రీమంతుడని చెప్పానుగా?

కల్యాణి: అంచేత?

సూరి: అంచేత, నువ్వు లోపలికి వెళ్లి చక్కగా తయారై సిద్ధంగా వుండు, అతను వచ్చేటప్పటికి.

కల్యాణి: తయారవడానికి ఏముంది? నేను ఎప్పుడూ చక్కగానేవుంటానుగా?

సూరి: ఆ నిలువుటద్దం దగ్గర కోతిచేష్టలు చేస్తూ అలా కూర్చుండిపోవద్దని.

కల్యాణి : నాది ఎప్పుడూ ఎగతాళి బ్రతుకే.

సూరి : కాదు, సాలెపురుగు బ్రతుకు.

కల్యాణి : మరి ఇదివరకు గొంగళీపురుగు దనే వారు ?

సూరి : అది ఇవాళ ప్రదర్శించకు, నీపుణ్యముంటుంది- ఇవాళ నువ్వో ఆగర్భ శ్రీమంతురాలి వన్నమాట. నవనాగరక యువతీమణివి!

కల్యాణి : అభినయించడమేగా ?

సూరి : నువ్వు తల్చుకుంటే నిజంగానే అవుతావు. నువ్వు నేర్చుకున్న ప్రసన్నమైన భాష, నీ నాజూకు పద్ధతులు, నీ మంచి బుద్ధులూ, అన్నింటికీ పదును పెట్టు. ఇంక పద.

కల్యాణి : నాకీ విద్యాబుద్ధులు చెప్పి పాపం మీరు——

సూరి : ఏం, ఇదంతా వృథా అంటావా ?

కల్యాణి : ఎక్కడో అంధకూపంలో వుండే నన్ను పైకి తీసి గొప్పదాన్ని చేశారు. ఇంకా చేస్తున్నారు- ఈ శ్రమకి——

సూరి : ఇది నాకు శ్రమ కాదు- వినోదం- నువ్వు లోపలికి వెళ్లమరి. అతనువొచ్చే వేళయింది

కల్యాణి : నిమిషంలో తయారౌతాను. (లోపలికి వెడుతుంది)

ముష్టివాడు : (వీధిలోంచి) బాబుగారూ!

సూరి : ఎవరు ?

ముష్టివాడు : బాబయ్యా !

సూరి : (వీధితలుపుతీసి) ఎవరునువ్వు ?

ముష్టి : నావోలకం తెలియటం లేదుండి ?

సూరి : ఏం పని చేస్తావునువ్వు ?

ముష్టి : అడుక్కు తింటానండి.

సూరి : ఓరి,నీ తస్సాగొయ్యా, ఏదో పెద్ద పని వున్నట్టు పిలిచావు?

ముష్టి · ఉన్నాదుండి.

సూరి : ఏమి టున్నాది?

ముష్టి : పనుండి.

సూరి : మంచిపనే, ఇప్పుడు చెయ్యారుకో లేదు. పో. (తలుపు వెయ్యబోతాడు)

ముష్టి : అలా తలుపు మూసెయ్యమోకండి. తమరితో కూంత వున్నుంది.

సూరి : నీ మొహం. చెపితే నీ క్కాదూ? పొమ్మంటే పోవేం?

ముష్టి : బాబయ్యగారు!

సూరి : దున్నపోతులా వున్నావుమళ్లీ మాస్తేను. ఎక్కడేనా పని చేసుకుని బతక్కూడదూ ముష్టెత్తుకోకపోతేను?

ముష్టి : అయ్యొ నాయనా, నాసిన్నప్పుడేల మట్టి యింటున్నానండీ మాటలు. పని సేసుకో, పని సేసుకో అని గదమాయించే మారాజులేగాని, పని సెప్పే దరమరాజు వొవరూ ఆపడడండి.

సూరి : అట్టే వాగక ఇంక పో. చేసుకుందామనే బుద్ధుంటూ వుంటే పని ఎందుకు దొరకదు?

ముష్టి : ఏందోనండి. ఇంకిప్పుడు బిచ్చమెత్తుకుంటేనేబాగావున్నాదండి. అవిదిలేని బతుకు.

సూరి : సాగుతోంటే సరి— పో.

ముష్టి : తమకి మాత్తరవుండి.

సూరి : ఏమిటి, 'తమ' కేమిటి?

ముష్టి : కట్టవుండి.

సూరి : ఏమిటీ కష్టం?

ముష్టి : రెండు జీవాల్ని పోసించటం— నాకూ తెలుసుండి, ఆ కట్టం.

సూరి : ఏమిట్రా నువ్వనేదీ? రెండు జీవాలెవరు?

ముష్టి : నామాటకేం గానుండి, నాకూతుర్ని పెంచడం చెడ్డ కట్టమేనండి. నాకు బాగా అనబమేనుండి, బాబుగారు.

సూరి : నీ కూతు రెవరు? ఏమిటీ గొడవంతాను?

ముష్టి : ఇక్కడికి నాలుగేళ్లమట్టి యెతుక్కుంటున్నానుండి. మా 'గన్ని' యిక్కడున్నాదని తెలిసొచ్చానుండి.

సూరి : ఏమిటి! గన్ని నీ కూతురా?

ముష్టి : సిత్తం.

సూరి : అయితే దాన్ని ఎందుకువొదిలిపెట్టేశావు అల్లాగ ?

ముష్టి : అదే నన్నొదిలేసి లెగిసిపోయిందుండి. మా 'దనివి' గా డరగా——

సూరి : ధనివిఁ గాడెవరు ?

ముష్టి : మా 'గన్ని' కోసం మా గుంపులో సేరిన కుర్రోడుండి. ఆళ్లిద్దరూ వుంటే మాకు బాగా గడిసిపోయాదుండి. అదెల్లిపోయిందని ఆడూ యిరక్తితో సెప్పకుండా యేడకో పోయినాడుండి. ఇప్పుడు నాకీ పెద్దకాలంలో——

సూరి : గన్నికీ ధనివిఁగాడికి పెళ్లయిందా ?

ముష్టి : మా వరణానికి వెళ్లేంటుండి ? కలిసున్న న్నాళ్లు కలిసుండటం, ఇడిపోతే యేరేపోవటం— అంతేగానుండి ?

సూరి : మరి దీనికోసీతిఅంటూవుండక్కర్లేదూ?

ముష్టి : నీతి ! వవ్వా ! నీతెట్టుకుక్కుంటే మాకెలా గడుస్తుందుండి, అయన్నీ డబ్బున్నా మారాజులిగ్గాని ?

సూరి : గన్ని ఇక్కడుందని నీకెలా తెలిసింది ?

ముష్టి : మా దనివిగాడు మా సురుకైనవోడుండి. దాన్ని మొన్న నాటకంలో ఆనవాలు పట్టాడంటుండి, మొహం మీద మచ్చ సూసి. కూడా యెంటాడి యీ లోగిల్లో వుంటున్నాదని కనుక్కుని నాతో సొప్పాడుండి.

సూరి : ఆ పడుచుదాన్ని గుడ్డలు లేకుండాగోచీ పెట్టించి వీధుల్లోకి ముష్టికి పంపించేవాడివి. నీకు సిగ్గూ, శరమూ వున్నాయా ? మళ్లీ దాని తండ్రి నంటున్నావు ?

ముష్టి : చిగైతేయెలాగుండిమాకు? దాన్నితమరు పూర్తిగా పాడుసేసేరని సొప్పాడుండి దనివిగాడు.

సూరి : మాటలు తిన్నగా రానీ మరి; ఏమిటూ వాగుడు ?

ముష్టి : తప్పులేదుండి బాబయ్యా. దాని మిడిసిపాటు కలా అవ్వలిసిందే.

సూరి . ఏమిట్రా, తిండిపెట్టి, కట్టుకోడానికి మంచి బట్టలిచ్చి జాగ్రత్తగా చూస్తోంటే పాడు చెయ్యడమంటావా ?

ముష్టి : అదికాదుండి. ఈ గొప్పగొప్ప అలవాట్లన్నీ నేసుకుని దాని అసలు బతుకుదెరువు మరిసిపోద్దని.

సూరి : అంటే ముష్టెత్తుకోవడమా ?

ముష్టి : మరేనుండి.

సూరి : నీకా భయం అక్కర్లేదు. దాని కింకా గతి మళ్లీ కలుగనివ్వను.

ముష్టి: చంతోసమేనుండి. కాని——

సూరి : కాని ఏమిటి ?

ముష్టి : దాన్ని కట్టపడి కన్నానుండి.

సూరి : గొప్పపని చేశావు. కని కట్టగుడ్డేనా లేకుండా వీధుల్లో వొదిలేశావు, అంతేనా ?

ముష్టి : ఏం సెయ్యనుండి ?

సూరి : అందు కిప్పు డేమంటావు?

ముష్టి : ఏంలేదుండి. నేను దాని తండ్రిని గనక ఆ యిలవకి——

సూరి : ఓరి నీ దుర్నయం మండ! దానివంక పెట్టుకుని నాదగ్గర డబ్బు లాగడానికా వచ్చావు ?

ముష్టి : కోపం సెయ్యకుండి, నాయం ఆలోసించండి.

సూరి : చూడు నీకు ఒక్క దమ్మిడీ అయినా ఇవ్వను. కావలిస్తే నీకూతుర్ని వెంట తీసుకుపో.

ముష్టి : అయ్యబాబో, ఈశ్వయారీలతో పాడవిపోయిందాన్ని తీసికెల్లి నేనెక్క డెట్టుకోనుండి బాబయ్యా? దాన్ని నానెలాగా బరించలేను, కనికారించండి. నాకేదో కూంత——

సూరి : నువ్వొక్కడో అసాధ్యుడులాగున్నావు-సరే, ఇది తీసుకునిపో. (అయిదురూపాయిల కాగితం స్తాయిడు)

ముష్టి : అయిదు రూపాయిలాండి, ఇంతా నేత్తేను?

సూరి : మరింకెంత కావాలి?

ముష్టి : ఉంకొక్క అయిదేనా యిప్పిత్తేగాని-

సూరి : ఊఁ పట్టుకుపో, వొదిలీలాగ లేవు——(మరొక అయిదు రూపాయలు యిచ్చి) చూడు, మళ్ళీ 'గన్ని,' 'గన్ని' అంటూ గుమ్మం తొక్కావంటే చావతన్నించి పోలీసుల కప్పచెపుతాను. తెలిసిందా? జ్ఞాపకం వుంచుకో, జాగ్రత్త.

ముష్టి : తమకా శమక్కర్లేదుండి.

కల్యాణి : (లోపలనించి) మిస్టర్ సూరీ!

సూరి : ఎవరు? గన్ని ఇలా వస్తోంది- నువ్వింకిక్కడుండకూడదు, త్వరగా వెళ్లిపో.

ముష్టి : ఆ గొంతుక——

కల్యాణి : (నవ్వుతూప్రవేశించి)ఎలావుంది, నా పిలుపు? (తండ్రిని చూసి నిర్ఘాంతపోయి) ఎవరు! వీడెందుకువచ్చాడు, ఇలాగ?

ముష్టి : కల్లాణి. వవ్వా, గన్ని కల్లానవిందే ! (నవ్వుతాడు)

కల్యాణి : ఎందుకా ఇకిలింపు? నేను బాగుండలేదా?

ముష్టి : బావుండకేం? కల్లు సీకట్లు కమ్ముతున్నాయి, నీ మెరిసే అందం చూసి. పేరుకి నవ్వొచ్చింది.

కల్యాణి : (తండ్రిచేతిలో రూపాయల నోట్లు

చూసి) అదేమిటి? వాడికిడబ్బిచ్చారేమిటి? ఎందుకిచ్చారు?

సూరి : ఏదో పాపం.

కల్యాణి : కనికరించక్కర్లేదు. పీడాపదిరూపాయిలూ పెట్టి నాలుగు రోజుల్లో తప్పతాగేసి పాడుచేస్తాడు.

ముష్టి : తప్పతాగటమేంది ఎర్రిపిల్లా? సీకూ సింతా లేని ఆనందం అది!

సూరి : ఊఁ. నువ్వింక పోరా అబ్బి.

ముష్టి : గన్నీ! నీకు తగిన శాస్తి అవింది. నాకు చంతోసం!

కల్యాణి : ఛీ, గన్నెవరు? నా పేరది కాదు-కల్యాణి.

ముష్టి: నాకూ దనివిగాడికి నువ్వు గన్నివే.

కల్యాణి:ధనివిఁగాడు—

సూరి: ఒరే, అబ్బి, నువ్వింక వెళ్లిపోవాలి. పదకల్యాణీ, నువ్వు లోపలికివెళ్లు.గోపాలంగారొచ్చే వేళయింది.

ముష్టి : నేనెల్లొత్తాను, బాబూ; పిల్లదాన్ని కూతంత బద్రంగా సూసుకోండి. తండిపేగు. (వెడతాడు)

సూరి : చాల్లే. వెళ్లు. మళ్లీ రాకింక.

కల్యాణి : (దిగులుగా) నాపాత జీవితం జ్ఞాపకం చెయ్యడానికి మళ్లీ దాపురించాడు వీడు, తండ్రినంటూ. చిన్నప్పుడు తనుచెప్పినట్టువినలేదని చితకకొట్టేసేవాడు.

సూరి : తండ్రినంటూ అంటే, వీడు నీ తండ్రి కాడేమిటి అయితే?



కల్యాణి : ఏమో, నాకేలా తెలుస్తుంది? అంతా మా బాబు అంటే నేనూ అలాగే పిలిచే దాన్ని.

సూరి : ధనివిఁ గాడుట ఎవరు?

కల్యాణి : వాడూ— అదుగో సూటు వేసుకుని ఇట్లాగే వొస్తున్నారు. ఆయనేనా గోపాలం గారు?

సూరి : అవును. నువ్వింక లోపలికెళ్లు. నేను పిలిచినప్పుడు వొద్దువుగాని. చాలా జాగ్రత్తగా మాట్లాడాలి సుమా. లేకపోతే మనంఇన్నాళ్లనించీ చేసిన కృషి వృథా అయిపోతుంది.

కల్యాణి : చూస్తారుగా. (లోపలికి వెళ్లిపోతుంది)

గోపాలం : (ప్రవేశించి) సూరిగారి ఇల్లు ఇదేనాండి?

సూరి : అవును, నేనే సూరిగారుఅంటే.

గోపా : అలాగా, నమస్కారం. మీపరిచయం చేసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది.

సూరి : లోపలికి రండి. కల్యాణి పరిచయం కాదూ చేసుకుందామనుకున్నారు?

గోపా : అబ్బే, అంటే అదికూడా లెండి.

(ఇద్దరూ లోపలికి వెడతారు)

సూరి : అలా కుర్చీలో కూర్చోండి.

గోపా : చిత్తం. మీ పేరు వినడమేగాని ఎప్పుడూ చూడటం పడిందికాదు.

సూరి : అయ్యా.

గోపా : మీరు నాటకాలూ అవీ బాగా రాసి, ఆడిస్తారుట.

సూరి : ఏదో.

గోపా : నాకూ నాటక కళన్నా, అభినయమన్నా చాలా ఇష్టమండి.

సూరి : ఓహో. చాలా సంతోషం.

గోపా : ఇవాళ రాత్రి ఆడే నాటికలు మీరు రాసినవే అనుకుంటాను?

సూరి : అవును నేను రాసినవే.

గోపా : కల్యాణిగారు కూడా—

సూరి : కల్యాణిగారు రాయదు, నటిస్తుంది.

గోపా : అదేనండి, బాగా అభినయిస్తారు.

సూరి : ఆ విషయం ఆవిడతోటే చెబుదురు గాని, సంతోషిస్తుంది.

గోపా : ఇదంతా మీకృషి ఫలితమే కాదండి?

సూరి : అయినా ఆ మాట ఆవిడదగ్గర మాత్రం అనకండి.

గోపా : కల్యాణిగారు లోపల వున్నారాండి?

సూరి : అన్నట్టు ఉన్నారు. పిలుస్తాను-కల్యాణీ!

కల్యాణి : (లోపలనించి) ఆఁ.

సూరి : ఇదుగో గోపాలంగారుట, నీ దర్శనం కోసం—(ఇంతలో కల్యాణి అక్కడికి వస్తుంది) ఆ వచ్చావా? ఈయన గోపాలంగారు, నీవేషంఅంటే ఈయనకి చాలా అభిమానం.

గోపా : (లేచి) నమస్కారమండి.

కల్యాణి : నమస్కారమండి-కూర్చోండి.

సూరి : కల్యాణీ, కాఫీ యేర్పాటు చేశావా?

కల్యాణి : అమ్మగారు పంపిస్తానన్నారు. మీరు సిగరెట్టు—

గోపా : నాదగ్గర వున్నాయండి,

సూరి : మీరు సిగరెట్లు కొనుక్కోలేరనా?

గోపా : [నవ్వి] అయితే యివ్వండి. [కాల్చి పొగ వదలి] చాలా బాగున్నాయండి.

కల్యాణి : ఒక్కటి తీసుకుని చాలావున్నట్టు బాగున్నాయంటున్నారే?

సూరి . ఇవి చాలా ఖరీదైనవి.

గోపా : అవునండి.

కల్యాణి : అబ్బ, ఇవాళ ఇంత ఉక్కగా వుందేమిటి!

గోపా : అవును చాలా ఉక్కగా వుందండి!

సూరి : నవంబరు నెలసమీపిస్తోంది కాదూ మరి!

గోపా : ఎన్నాళ్లనించో మిమ్మల్ని కలుసుకుందామనుకుంటున్నానండి, కల్యాణిగారూ! మీరు రంగస్థలంమీద అభినయిస్తోంటే నేనునిజంగా వొళ్లు మరచిపోతాను.

కల్యాణి : ఏదీ, ఇంకా కృషిచెయ్యాలండి.

గోపా : అయినా, అన్ని రసాలూ చక్కగా వొప్పించగలరుమీరు. మీకన్నివిషయాలూ, బాగా తెలుసును.

సూరి : అబద్ధం!

గోపా : ఏమంటారు?

సూరి: అన్నివిషయాలూఆభగవంతుడికొక్కడికే తెలుసు. మన కెవరికీ ఏవిషయమూ సరిగ్గా తెలియదని నా వుద్దేశం. ఆవిణ్ణాట్టే పొగడకండి, గర్వ పడుతుంది.

గోపా : ఏం, ఇలాంటి అభినేత్రి మనలో ఒక ఆమె వుందని నేను చాలా గర్వపడతాను.

సూరి : మీరు పడొచ్చు—చూడండీ—

కల్యాణి : ఆ గోడమీద కుడిచేతి ప్రక్క—అంటే తూర్పుగా—

గోపా : తూర్పా !

సూరి : మ్యాప్ మీద అంతేలెండి.

కల్యాణి : అదే—ఆ ఫోటో—

గోపా : చాలా బాగుందండి. నాకు మీ ఫోటో ఒకటి ఇప్పించాలి.

కల్యాణి : అలాగేనండి. నేను సరీగ్గా మా అమ్మ లాగే వుంటానుట.

గోపా : ఆమెకూడా గొప్ప తార అనుకుంటాను?

సూరి : మంద్రం.

కల్యాణి : అంటే?

సూరి : నాటకాల్లో వేషాలువేసేదా మీఅమ్మ అని అడుగుతున్నారు?

కల్యాణి : అదా. లేదండి. నేనామె నెప్పుడూ చూడనేలే దసలు.

గోపా : అదేమిటి!

కల్యాణి : ఆమె నా చిన్నప్పుడే— ఎక్కువగా త్రాగేసి—

గోపా : ఏమిటి?

సూరి : విషం.

గోపా : విషమా? అయ్యో పాపం!

కల్యాణి : పరమపదించింది.

గోపా : పాపం.

కల్యాణి : నేను—

గో : మీ రివాళ రాత్రి బిచ్చకత్తెపాత్ర వేస్తారు కాదండీ?

కల్యాణి : అవునండీ.

గోపా : ఇంత అందంగావుండే మీరుబిచ్చకత్తె వేషం వేస్తే ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాను.

సూరి : ఫరవాలేదు. స్వభావసిద్ధంగానే వుంటుంది.

గోపా : సందేహం ఏమిటండీ?

కల్యాణి : కాఫీ ఇంకా రాలేదేం చెప్మా?

సూరి : నువ్వు లోపలికి వెళ్లి చూసిరా. ఈయన్ని అట్టేసేపు కూర్చోబెడితే బావుండదు.

గోపా : అఁ, ఫరవాలేదండి.

కల్యాణి : క్షమించండి: వస్తాను; (లోపలికి వెడుతుంది)

సూరి : రాత్రి నాటకానికి వస్తారు కాదు

గోపా : విధిగా వస్తానండి. రావడంమానడం; మరి వస్తానండి.

సూరి : మంచిది వెళ్లి రండి.

౨

[ఆ నాటిరాత్రి నాటకం పూర్తి అయాక సూరి, కల్యాణి ఇంటికి తిరిగివస్తారు—వీధి సావడిలో-]

సూరి : (విసుపుగా) ఊఫ్-అబ్బ మొత్తంమీద గట్టెక్కాం.

కల్యాణి : (టకటకా వచ్చి) నేనెలా అభినయించాను?

సూరి : బాగానే వుంది.

కల్యాణి : అంతేనా?

సూరి : మరింకే మన మంటావు? ఎత్తుకుని వూరేగమంటావా ఏమిటి?

కల్యాణి : జనం అంతా అన్నిసార్లు చప్పట్లు కొట్టి మళ్ళీ అనమని ఆందోళన చేశారే?

సూరి : వీ అపస్వరాల కయివుంటుంది.

కల్యాణి : మీరు చెప్పినవి 'తుచ' తప్పకుండా సరీగ్గా చేసినందుకు ఇదా మెప్పు.

సూరి : చెప్పినది చెయ్యకేం చేస్తావు ? దానికో మెప్పా ?- ఇదిగో ఈ చేతికర్ర అలా పెట్టు.

కల్యాణి : (చేతికర్ర తీసుకుని దూరంగా విసురుతుంది)

సూరి : ఏమిటా కర్ర అలా విసిరిపారేశావేం ? నీకేం మతిపోయిందా ?

కల్యాణి : (కోపంతో) నేను మీకు దాసీదాన్ననుకుంటున్నారా ?

సూరి : ఎవరన్నారు ?

కల్యాణి : మీకు కృతజ్ఞత అనేది ఏ కోశానైనా వుందీ ?

సూరి : నాకెందుకు కృతజ్ఞత ? ఎవరిమైని?

కల్యాణి : నామైని- మీరు చెప్పినవన్నీ చేసి మీకు పేరు తెప్పిస్తోన్నందుకు -

సూరి : దానికా ? కృతజ్ఞత ఎందుకు ? నేను చెప్పినది నువ్వేకాదు, ఎవరుసరీగ్గా చెప్పినా పేరు వస్తుంది.

కల్యాణి : చెప్పింది చెయ్యడం మాత్రం అందరికీ చేతనవవొద్దూ ?

సూరి : అవాలి. అసలు నిన్ను బురదగుంట లోంచి పైకి తీసుకువచ్చినందుకు నువ్వే నాకు చూపాలి కృతజ్ఞత.

కల్యాణి : ఎన్నిసార్లు ఎత్తిపొడుస్తారు నన్ను, బురదగుంటలోంచి ఉద్ధరించానని ? నాకూ ఒక హృదయం, మనస్సూ వుంటాయని మీకెప్పుడైనా తోచిందా అసలు ?

సూరి : ఓహో నా పాఠం నాకే అప్పచెప్తున్నావే ? నీ హృదయంతో నాకేం పని ?

కల్యాణి : నాకుమాత్రం ఆత్మగౌరవం లేదూ ?

సూరి : అబ్బో—

కల్యాణి : ఆగోపాలంగారు నన్ను 'ఏమండీ' అని చక్కగా నోరారా పలకరిస్తారే—

సూరి : అయితే నన్నుకూడా 'ఏమండీ అమ్మా' అనమంటావా ? ఎలా అనను చూసి చూసి ?

కల్యాణి : నన్ను మీరొక ఆటవస్తువులాగ ఉపయోగించుకుంటున్నారు. నాకూ్కడా గౌరవంగా, స్వతంత్రంగా వుండడం తెలుసును.

సూరి : అందుకేమంటావిప్పుడు? ఏమిటీరొస్టు?

కల్యాణి : నన్ను గౌరవించకపోతే ఒక్కక్షణమైనా ఇక్కడింకవుండను.

సూరి : ఎక్కడికి పోతావు ?

కల్యాణి : ఎక్కడికైనా పోయి స్వేచ్ఛగా, గౌరవంగా బ్రతకగలను. నాకు మీరు చెప్పినవిద్య యీసారి నిజంగా ఉపకరిస్తుంది.

సూరి : నన్ను ప్రతిఘటించి బ్రతకడానికికూడా నేను నేర్పిన విద్యే నీకాధారం అవుతోంది కదా.

కల్యాణి : తప్పులేదు. ఇప్పుడేమంటారు?

సూరి : ఇవాళ నా తో పోట్లాడ దల్చుకున్నావా? నిన్ను గౌరవించడం అనేది వట్టి అబద్ధం. నీకు వెళ్లాలని బుద్ధిపుడితే నిక్షేపంలాగ వెళ్ళొచ్చు. నా అభ్యంతరం ఏమీలేదు.

కల్యాణి : అదే ఆఖరుమాటా ? ఆలోచించుకోండి?

సూరి : ఇంక నన్నాట్టే రెచ్చగొట్టకు, పోతేపో.

కల్యాణి : సరే మరి, సూరిగారూ సెలవు.

సూరి : ఎక్కడికి పోతావు ?

కల్యాణి : త ర వా త ఆలోచిస్తాను—సెలవు (రివ్వున బయటికి వెళ్లిపోతుంది)

సూరి : (నిట్టూర్చి) వెళ్ళిపోయింది. ఎక్కడికి పోతుంది? ఆగోపాలందగ్గరకి పోతుంది. గొంగళీ పురుగు సీతాకోక చిలకయి రెక్కల కెన్నిరంగులు వేసుకున్నా దాని సహజగుణం ఎక్కడికి పోతుంది?

[బెర్నార్డ్ షా రచించిన "పిగ్మేలియన్" చదివినవారికి రచయిత క్షమార్పణ.]

ఆవిడ కొత్తగా కాపరానికి వచ్చిన మొదటిరోజు. సాయంత్రం భర్తతో కలిసి బజారుకి వెళ్లింది. షాపులన్నీ గాలించి వెతికి చివరకి ఒక జోళ్లజత కొనుక్కుంది నీలంబోళ్లు. జరీ అదీ బాగుంది

మర్నాడే అవి తీసికెళ్లి షాపువాడికి ఇచ్చేస్తూ, "ఇవి నాకు సరిపడ లేదు. అవి తొడుక్కుని నడవలేకుండా ఉన్నాను" అంది.

షాపు గుమస్తా ఆమెవేపు గంభీరంగా చూస్తూ, "అమ్మా, నడ వడం అవసరం అయినవాళ్లు యీ షాపుకి రారు" అన్నాడు

క్రొత్త సంవత్సర దినచర్య



నాగరాజామాత్యుడు

[రూపకం]

(శయనాగారం — రాత్రి పది గంటలవేళ. సీత పక్క దులిపి, దిండ్లుసద్ది నిలబడింది. రఘు కుర్చీలో కూర్చుని, దీక్షగా ఆలోచిస్తూ ఏదో వ్రాసే ప్రయత్నంలో వుంటాడు.)

సీత :-[డ్రాయరుమీద కూర్చుంటూ] అబ్బ, ఆ దీపం ఆర్పేసి ఈపాటికి పడుకుందురు. అర్ధరాత్రయినా యింకా ఏమిటీ రాత ?

రఘు :-చూడు, సీతా, నీకు నిద్దరొస్తే నువ్వు పడుకో, నన్నాట్టే వేధించక. నాకు పనుంది.

సీత :-ఆ దీపం అలా అఖండంగా వెలుగుతోంటే నిద్దరేమిటి, నా మొహం ?

రఘు :-దీపముంటే భయం వెయ్యదు, పడుకో.

సీత :-మీరున్నారుగా. ఇంకా దీపమెందుకు ?

రఘు :-అబ్బ, నన్ను కాస్సేపు మాట్లాడించకుండా వుండడానికి వీలవుతుందా ?

సీత :-పోని ఎందుకా విసుపు? మీ కోసమనే చెపుతున్నాను.

రఘు :-నా సంగతి నేను చూసుకోగలనులే.

సీత :-బాగానే చూసుకుంటున్నారు. పాపం, అలాంటప్పుడు తెల్లారగట్టలేపమని నాతో చెప్పడం కూడా ఎందుకు ?

రఘు :-అన్నట్టు, నీకు పుణ్యముంటుంది. రేపు తెల్లారు జామున లేపావు గనక.

సీత :-అయిందీ అక్కడికి, తెల్లారు గట్టలేచి కసరత్తు చెయ్యడమూ, వస్తాదులాగ తయారవడమూను. అదంతా కొత్త సంవత్సరపు ఆరంభశూరత్వం కాబోలు. అయితేను మూడు రోజులకే మొహం మొత్తిందా ? నిన్నా, మొన్నా ఎలాగా మానేశారాయె.

రఘు :-మొహం మొత్తడం కాదు, మొద్దులూ కాదు. చూడు: ఒకటో తారీకున మొదలు పెట్టి మూడు రోజులుచేశానా, దాంతోటి ఒళ్ళంతా పచ్చి పుండై పోయింది. ఈ పిక్కలూ, తొడలూ, జబ్బలూ అన్నీ పడి పోయాయనుకో. సరిగ్గా నడవడానికికూడా వీలులేకుండా అయి పోయిందిప్పుడు.

సీత :-మొదట్లో రెండురోజులలాగ నొప్పులెట్టి తరవాత వొళ్ళంతా రాయిలాగో, ఇనుములాగో అయిపోతుందని మీరే కదూ, చెప్పారు.

రఘు :-ఇనుంలాగ అవలేదు సరి కదా, ప్రస్తుతం బరువెక్కిపోయి వూరుకుంది.

సీత :-ఇదుగో మీ స్నేహితుడు ఆ బలరాంగారు చూడండి: ఆయన దండేలు అవీ బాగా తీస్తారుటగా ?

రఘు :-వాడు నేర్పిన విద్యే నాకిది ; పట్టిచ్చింది కాదు కాని.

సీత :-ఆయన చూడండి చక్కగా ఎలా తయారయారోను.

రఘు :-ఇదుగో, పరాయి మొగాళ్ళని చూసి అలా ఇదవడం పతివ్రతా ధర్మంకాదు గనక—

సీత :-ఇదేమయ్యా యిప్పుడు? మీరు కూడా అలా వుంటే బాగుండునని మనసు పడ్డానుగాని.

రఘు :-అబ్బ, ఇందాకటినించి చూస్తున్నాను, నన్ను కాస్త రాసుకోనిస్తావేమోనని.

సీత :-నేనేమి అడ్డువొచ్చానిప్పుడు మధ్యా? ఈసారి మీ యిష్టం వొచ్చినంతసేపు కూర్చుని రాసుకోండి. తెల్లారుజామున నన్ను లేపొద్దన్నారుగా ?

రఘు :-అవును: ఇన్నాళ్ళనించీ లేపినందుకు కృతజ్ఞుణ్ణే కాని, యివాళమాత్రం లేపకు, నేను లేచే స్థితిలోలేను.

సీ త :-మీరంత వొద్దు మొర్రో అంటే ఎందుకు లేపుతాను నేనుమాత్రం? వెచ్చగా పడుకోలేనేమిటి ? అవుతేనూ, మీరిప్పుడు అంత దీక్షగా కూర్చుని రాసే ఆ గ్రంథం ఏమిటి?

రఘు :-నీతో తప్పకుండా చెప్పాలేమిటి ?

సీ త :-ఓస్! నాకు తెలియదనుకున్నారు కాబోలు· నేను చెప్పనా ?

రఘు :-చెప్పూ—

సీ త :-మీ దినచర్య, అవునా ?

రఘు :-మరి తెలిసి అడగడమెందుకు, ఆ చొప్ప దంటు ప్రశ్న ?

సీ త :-[కొంచెం పూరుకుని] నాదో కోరిక పుందండీ—తీరుస్తారా.

రఘు :-నీకుకూడా కలుగుతున్నాయీ కోరికలు, సీతామ్మవారిలాగ ? నే నిప్పుడు తీర్చే మూడ్ లో లేను.

సీ త :-మూడులో పుండడమేమిటి ?

రఘు :-మూడుకాదు, మూడూ నాలూగూను : మూడ్ అంటే మనస్థితి.

సీ త :-అయితే మీ మనస్థితి ఎప్పుడు మారుతుంది?

రఘు :-మళ్ళీ మొదలెట్టేవా ?—ఏమిటి నీకోరిక ?

సీ త :-మీ దినచర్య ఓసారి చదవాలని వుంది నాకు.

రఘు :-ఇన్నాళ్ళనించీ నువ్వు దీన్ని చదవకుండా పూరుకున్నట్టు.

సీ త :-అదేమిటండీ అలాగంటారు ?' మీకొచ్చిన వుత్తరాలు నేనెప్పుడైనా చింపి చదువుతున్నా నా ?

రఘు :-పోనీ చదువు. నా వుత్తరాల్లో ఏం రహస్యాలుంటాయి ?

సీ త :-ఉంటాయి, ఉండకపోతాయి; అది వేరే సంగతి. మీరు చదవమని అంటేనేగాని నేనలా చదవను సుమండీ.

రఘు :-పోనీ చదవకు.

సీ త :-కానీ యీ దినచర్య అంటే అందులో ఏం రాస్తారో చదవాలని కుతూహలంగా వుంది. నేనుకూడా ఒకటి రాద్దామని.

రఘు :-ఇంకేం మొగాళ్లు శ్రద్ధగా రాద్దామనుకున్నవి ఇంతసవ్యంగా అఘోరిస్తున్నాయి; ఇంక ఆడాళ్లుకూడా రాయడం తరవాయొచ్చింది.

సీ త :-ఏం ఆడవాళ్లు దినచర్య ఎందుకు రాయకూడదు ?

రఘు :-ఆడవాళ్ళ దినచర్య రాయడం కూడా ఎందుకు, కాగితాల దండగ ? ఏం ఘనకార్యాలుంటాయి రాయడానికి? అయినా ఇది నువ్వు చదవడం మంచిది కాదు.

సీ త :-ఏం ?

రఘు :-ఇందులో నా ఆంతరంగిక విషయాలుంటాయి, అందుచేత.

సీ త :-అయితే నా ఆంతరంగిక విషయాలు నేనూ రాస్తాను.

రఘు :-ఏమిటి, నే నెరగకూడని విషయాలు నీకేమున్నాయి ?

సీ త :-మీ కున్నలాంటివే—సహధర్మచారిణినైన నాకు తెలియకూడని రహస్యాలు మీకున్నప్పుడు, నాకెందుకుండకూడదు !

రఘు :-వెర్రిదానా, నువ్వెరగని రహస్యాలు నాకేమున్నాయి; ఇది చదవడం నీకు అనవసరమూ, కాలం వృథా చెయ్యడమూ అని అన్నాగాని !—నేను రోజూ చేసే పనులే ఇందులో రాస్తాను.

సీ త :-నాకు మాత్రం ఏం రహస్యాలుంటాయి, ఊరికే అన్నాగాని ? ఏదీ ఒకసారి నన్ను కూడా చూడనివ్వండి.

రఘు :-అయ్యో అనుమానమా! ఇదిగో అయితే చూడు, నీ చాదస్తంగాని.

సీ త :-[చదువుతుంది] 'దినచర్య:—1949 వ సంవత్సరం జనవరి 1వ తేదీ శనివారం— ఆశయాలు: ఒకటి, ఈ సంవత్సరం జనవరి ఒకటవ తారీకునుంచి ఉదయమూ, సాయంకాలమూ అర్థమపక్షం ఎండలు ముదిరీదాకా అయినా వస్తాదునవడానికి కాళ

పోయినా-ఉన్న శరీరారోగ్యాన్ని కాపాడు కోడానికి కసరత్తు చేయవలెను'—మొదటి ఆశయానికే మోసమా? మరి యీ మూడు రోజులనించి మానేశారేం కసరత్తు?

రఘు :-కారణం చెప్పానుకదూ? అదీ కాక పోయినా నేను ఆరోగ్యంగా ఉన్నా నంటావా? లేనంటావా?

సీత :-ఏం ఆరోగ్యమో, తీరికూర్చొని వొళ్ళంతా హూనం చేసుకున్నారు. అసలు మొదలెట్టకపోయినా తీరిపోను.

రఘు :-ఇంక మానేస్తానుగా.

సీత :-బాగానేవుంది. [మళ్లీ పైకి చదువుతుంది] 'రెండు: సిగరెట్లుకాల్చడంపూర్తిగ మానేసి, ఆ కూడబెట్టిన సొమ్ముతో భార్యకొక పట్టు చీరకొని బహూకరించవలయును.'—భేష్! ఇంకేం మరి, మీరిప్పుడు చేస్తూన్న ఆ మంచి పనేమిటి?

రఘు :-ఏమిటి? ఓ, సిగరెట్టు కాలుస్తున్నాననా? మొన్న ఒకటి రెండు తేదీలు పూర్తిగా సిగరెట్ల వుపోషంవుండి, మాడాను. నీకు తెలుసును గదా. ఇంక మూడో రోజు జరిగిన ఒక సందర్భాన్ని అనుసరించి యీ సిగరెట్లు మళ్ళా కాల్చగల్గుతున్నాను.

సీత :-ఏమిటూ సందర్భం? రెండు రోజులు సిగరెట్లు పీల్చడం మానేసినంత మాత్రాన నాకు సిల్కు చీర వొస్తుందా? పాపం, ఆ రెండునాళ్లూ కూడా ఎందుకూ కష్ట పడ్డారు, యీ మాత్రం దానికి?

రఘు :-వినుమరి. మూడో తారీఖుని కుంటుకుంటూ కాఫీ హోటలుకి ఎలాగో నడచి వెళ్ళాను.

సీత :-సరి, మళ్ళీకాఫీహోటలుకి వెళ్ళడం ప్రారంభించారూ? ఇంకేం సనిపడుతుందీ సంసారం? నేను యింటి దగ్గర కాఫీ కాచి యిస్తున్నాను కాదూ, మళ్ళీ హోటలు కెందుకు వెళ్ళడం?

రఘు :-అబ్బే, అక్కడ కాఫీ త్రాగడానికి కాదు. అలవాటు. ఆలా రోజూ ఒకసారి అలావెళ్లి ఆ అయ్యారు బోర్డుచూసి వస్తేనేగాని ఆత్మ సంతృప్తివుండదు.

సీత :-కుంటుకుంటూ ఎందుకు వెళ్ళవలసివచ్చింది? ఈ వారం రోజుల యీ మధ్య మీ కాళ్ళ మీద ఏమీ కురుపు వేసినట్టు లేదే.

రఘు :-కుంటడం ఎందుకా? నిత్యం ఉభయసంధ్యల యందూ చేసిన వ్యాయామ ఫలితం అది.

సీత :-బాగానేవుంది. అయితే అంతబాధతోనూ ఆఫీసుకైనా సెలవు పెట్టారు కానీ కాఫీ హోటలు మానలేదన్నమాట.

రఘు :-విను, ఆ వేళ—

సీత :-ఊఁ, చెప్పండి, ఆ కాఫీ హోటలు దగ్గ జరిగిన సందర్భం ఏమిటోను—

రఘు :-చదువు; అందులోనే రాశాను, పైకి చదువు.

సీత :-[పైకి చదువుతుంది]

"రఘు :-ఏం రోయ్ శేషూ! హేపీ న్యూ ఇయర్!

శేషు :-ఎవరు, రఘూ! బాగుంది. దొంగలడ్డ ఆరునెల్లకి కుక్క మొరిగిందట. నీ క్యాలండర్‌లో ఇవాళ ఒకటో తారీకా ఏమిటి?

రఘు :-ఈ మూడు రోజులనించీ మనం కలుసుకోందే మరి. సంవత్సరంలో ఎప్పుడు మొదటిసారి చూస్తే అప్పుడే హేపీ న్యూ ఇయర్! ఏమంటావు?

శేషు :-అవునులే, అయితే నీకూ అదే — ముందు కాస్త కాఫీ పుచ్చుకుందాం, రా.

రఘు :-అబ్బే, థ్యాంక్స్! నే నంతా ఇప్పుడే మా ఆవిడ ఇచ్చిన మధురమైన కాఫీ సేవించి—

శేషు :-పంచదార ఎక్కువయిందేమిటి? పోసి కిళ్ళీ వేసుకుంటావా? అది కూడా- మీ ఆవిడకట్టి యిచ్చిన మజా అయిన కారాకిళ్ళీ బుగ్గని వుందా?

రఘు :-అబ్బే, కారాకిళ్ళీ,సిగరెట్లూ అన్నీ మానేశానోయ్.

శేషు :-ఈ దుర్బుద్ధు లెప్పటినించి అలవాటయాయి ?

రఘు :-మొన్న ఒకటో తారీకునించీని—

శేషు :-ఓహో. ఈ సంవత్సరాది సదాశయాలకేంగాని, ఇదుగో ఒక్క సిగరెట్టు తీసుకుని నాతో సహపంక్తిగా అంటించుమరి.

రఘు :-అబ్బ, వొద్దోయ్.

శేషు :-మొహమాటపడకు, అలాగ. నే నిస్తున్నానుగా, తీసుకుందూ.

రఘు :-చంపుతావురా. సరే–పద, కాస్త అలా తిరిగి వద్దాం—''

సీత :-[చదవడం ఆపి] ఇంతకీ సిగరెట్లకోసం మీరేమీ ఖర్చుపెట్టలేదంటారు, అంతేనా?

రఘు :-అదే, ఆవొక్క సిగరెట్టుతోటీ కాలక్షేపం చేశాను.

సీత :-అంటే, ఆదే మళ్ళీమళ్ళీ ఆర్పుకుని కాలుస్తూ వచ్చారేమిటి, దరిద్రం?

రఘు :-ఛ. ఆ వేళకి మళ్ళీ వుపోషం వున్నాను. ఆమర్నాడుకూడా కటికిలంఖణంవున్నాను.

సీత :-భోజనం మామూలుగా చేస్తూనా ?

రఘు :-భోజనం మామూలుగా చేస్తే మాత్రం అది వంటపట్టొద్దూ.–సరే, మొన్న మళ్లీ శేషు సిగరెట్ల దుకాణం దగ్గర కనపడ్డాడు.

సీత :-ఆయన సిగరెట్లు కొనుక్కునే వేళకి అక్కడికి వెళ్ళారు కాబోలు మీరు.

రఘు :-అవేం మాటలు సీతా మరి ? నా అవస్థ నీకేం అర్థమవుతుంది.

సీత :-నేను కూడా సిగరెట్లు కాల్చడం నేర్చుకుంటేగాని అవదుమరి.

రఘు :-మన శేషు డబ్బా సిగరెట్లు కాలుస్తాడు కాదూ ? దేనికదే చెప్పుకోవాలి. వాడు చాలా ఉదారమైన వాడులే. 'ఏదిరా, ఒక సిగరెట్టు' అని ఇంకా నేనన్నానో లేదో, నా జేబులో ఒక గుప్పెడు సిగరెట్లు, ఒక అగ్గిపెట్టి పారేశాడు. అవే యిప్పటిదాకా రోజుకి ఒకటిన్నర, రెండూ చొప్పున కాలక్షేపం చేసుకొస్తున్నాను. ఇందువిషయమై నేను ఖర్చుపెట్టినదొక దమ్మిడీ అయినా వుందేమో చూశావా మరి.

సీత :-ఎందుకు మీకంత కష్టాక్తి, అవస్థానే: పాపం, స్వయంగా కొనుక్కొని కాలక్షేపం చెయ్యండి మళ్ళీని. నాకు పండగకి పట్టుచీర మావాళ్లు పెడతారులెండి. మీ కా బాధ అక్కర్లేదు.

రఘు :-అమ్మయ్య, బ్రతికాను.

సీత :-సరి, ఇంక రెండో తారీకు చూస్తాను.

రఘు :-కానీ—

సీత :-[చదువుతుంది] "జనవరి ? వ తేదీ ఆదివారం:—

రఘు :-నమస్కారమండీ, శర్మగారూ!

శర్మ :-నమస్కారమండి, రండి. ఏం పొద్దున్నే ఇలా పనిమీద దయ చేశారు ?

రఘు :-అబ్బే, ఏంలేదండి. నిన్న ఒకటో తారీఖుకాదూ? మా ఆఫీసుకిసెలవు.

శర్మ :-అవును, నిన్న అన్ని ఆఫీసులకీ సెలవే.

రఘు :-అందుచేత నాదగ్గర ఒక్క కానీ అయినా లేకుండా ఖర్చయిపోయింది. ఇవాళ ఆదివారం : మా ఇల్లిప్పుడు అయ్యవార్లంగారి నట్టిల్లు లాగ వుంది.

శర్మ :-అయ్యో, పాపం—

రఘు :-ఇప్పుడు నేను వెళ్ళి శేషను సామాన్లూ అవీకొని తెస్తేనేగాని యీ పూట మాకు భోజనంలేదు.

శర్మ :-ప్రస్తుతం మీకేమైనా సొమ్ము కావాలేమిటి ? మొహమాట పడతారేం ?

రఘు :-అబ్బే, మొహమాటం ఏంలేదండి. దయచేసి ఒక్క పాతికరూపాయలిప్పించండి.

శర్మ :-పాతికేమిటి, ముప్ఫైపట్టికెళ్ళండి. మళ్ళీ రేపు సాయంత్రం ఇచ్చేసేవే కాదూ ?

రఘు :-అన్నట్టు, రేపు సాయంత్రం కాదండి. ఎల్లుండి సాయంత్రం ఇచ్చుకుంటానండి.

శర్మ :-ఏం, రేపుకూడా మీకు సెలవేనేమిటి ?

రఘు :-లేదండి. దరిద్రానికి అన్నీ అలాగే సమకూడతాయి: మా కేషియర్‌కి జబ్బుగావుందట. ఎల్లుండిగాని జీతాలు బట్వాడా చెయ్యరట.

శర్మ :-పోనీ దానికేం, ఎల్లుండే యివ్వండి. ఇప్పుడేమీ మునిగిపోయింది లేదు- ఇదిగో...[పాతిక రూపాయలు లెక్కపెట్టి యిచ్చాడు]

రఘు :-థ్యాంక్స్, సెలవు వొస్తానండి-".

సీత :-[చదవడం ఆపి] ఏమండీ, ఈ యేడు ఎవరి దగ్గరా ఒక్క కానీ అయినా అప్పు చెయ్యకూడదని తీర్మానించుకున్నారు కాదూ మరి?

రఘు :-కారణం చూశావు కాదూ.

సీత :-నాకేం తెలుసు, మీదగ్గర డబ్బు వుందనుకున్నాను. పోనీ ఆ శర్మగారికి కా పాతికా ఇచ్చేరా మొన్న?

రఘు :-ఇంకా లేదు.

సీత :-అయ్యో—

రఘు :-అయ్యో ఏమిటి? అంతా ఖర్చయిపోయింది మరి. నువ్వు చూస్తూనే అలా అంటావేం?

సీత :-మన ఖర్చుకి అర్థంఏమిటీ? పాపం ఆయన ఆపద్బాంధవుడిలాగ మన అవసరం గడిపితే ఆయన అప్పు ముందు ఇచ్చెయ్యొద్దుటండీ?

రఘు :-ఇప్పుడు మునిగిపోయిందేముందీ పెద్ద? మళ్ళీ నెలజీతంలో ఇచ్చేస్తానులే. ఏం చెయ్యమంటావ్ మరి.

సీత :-సరే, మూడో తారీఖున వ్రతభంగం అలా అయింది కదా? ఇంక-[పేజీలుతిప్పి] "జనవరి 4 వ తేదీ, మంగళవారం"-ఖాళీ!

రఘు:-ఆ పేజీయే కాదు,ఇంక తక్కినవన్నీ ఖాళీయే.

సీత :-ఏం?

రఘు :-జ్ఞాపకం లేదు. ఆ వేళే యీ డైరీ ఎలాగ మాయమై పోయిందో మాయమైపోయింది.

సీత :-అవును, నేను దాచేశానని నన్ను తిట్టిపోశారుకూడాను. మళ్ళీ ఎలాగ దొరికింది?

రఘు :-నేనే ఎడమచేతితో పెట్టివుంటాను: మొన్న చాకలికి బట్టలు వేస్తూంటే దొరికింది. ఆ పాత బటలబుట్టలోవుంది.

సీత :-మాశారా మరి. అయితే, అయిదో తేదీనించి ఎందుకు రాయలేదు?

రఘు: -ఎలా రాయను? నాలుగో తారీకుని ఏం జరిగిందో రాయడానికి జ్ఞాపకం రావటం లేదు. ఎంతో ప్రయత్నించాను,అక్కడకీను.

సీత :-పోనీ డయరీ మాయమయిందని రాసి వూరుకుంటేనో?

రఘు :-బాగా చెప్పావు. పోనీ యీ వుపాయం నువ్వు మొన్నను చెపితే ఎంత బాగుండును. మళ్ళీ రాయడం మొదలుపెడుదును. ఇప్పుడింక రాద్దామంటే అయిదో తారీకునీ, నిన్న ఆరో తారీకునీ ఏం జరిగిందో జ్ఞాపకం రావటంలేదు; అదే నేనూ ఊరికే ఆలోచిస్తున్నాను.

సీత :-బాగానేవుంది. ఇదా దినచర్య రాయడమంటేను. ఇంకేమిటో అనుకున్నాను. దీనికో ఖరీదైన పుస్తకంకొని ఇలాంటివన్నీ రాయడంకూడా ఎందుకు దండగ-

రఘు :-అలా రాస్తే జ్ఞాపక శక్తి ఎక్కువౌతుంది.

సీత :-మీ జ్ఞాపకశక్తి ప్రస్తుతం బాగానేవుంది. అయితే ఇవాళనించి మళ్ళీ రాస్తారేమిటి?

రఘు :-అబ్బేలేదు. నాలుగు రోజులు ఎలాగా నాగా వచ్చిందా: ఈసారి జాగ్రత్తగా ఫిబ్రవరి ఒకటో తేదీనుంచి రాస్తాను, ఏమంటావు?

సీత :-మీ యిష్టం - అయితేనూ, మొన్న మన మహాలక్ష్మి పేటలో చూశాను ఇలాంటి పుస్తకమే, అదేమిటి?


రఘు :-అదే, ఇదే! మళ్ళీ మాయమైపోకుండా దీన్ని అక్కడవుంచి జాగ్రత్తగా, పవిత్రంగా చూస్తున్నాను.

సీత :-అది యీ పుస్తకమేనా? ఇంకా నేనే భగవద్గీతో, సుందరకాండో అనుకుంటూ వచ్చాను. నాకు తెలిస్తే అప్పుడే అవతల పారేద్దును!

రఘు :-సీతా, కోప్పడకు. ఈ పుస్తకం సంగతి నీకు సరిగ్గా బోధపడలేదు. ప్రపంచకంలో గొప్పగొప్పవాళ్ళంతా ఇది రాస్తారు.

సీత :-చాల్లెండి. మీ గొప్పతనం-[పుస్తకం గిరవాటేసి] ఈపాటికి ఆ దీపం ఆర్పేసి పడుకోండి.

(తెర జాలిగా దిగును!)



మొదటి రంగం

సీతయ్య: (తలుపు కొట్టి) నారాయణా!.... నారాయణా!

నారాయణ: (లోపలనించి) 'ఎవరోహో, ఎవరోహో, ఇపుడా నను పలుకరింతురు?' (కిటికీ తలుపు తెరచి) ఎవరా పాంథుడు?

సీతయ్య: కిటికీ తలుపుతీస్తే యీ ఇనప వూచలలోవించి లోపలికెలా వస్తా ననుకున్నావురా? వీధి తలుపు తియ్యి; త్వరగా—

నారాయణ: ఎవరది? ఎవరు కావాలండీ మీకు?

సీతయ్య: ఏడిశావ్, తలుపు తీద్దూ, వేగిరం—

నారా: ఏమిటి, సీతయ్యా! నువ్వే!?

సీతయ్య: అవును, నేనే—

నారా: అంటే, సాక్షాత్తూ, రక్తమాంసాలలో? లాలా మూత్రపురీష—

సీతయ్య: అబ్బ, తలుపుతియ్యరా, నారాయణా! నీ బసకోసం వెతుక్కుంటూ తిరిగి తిరిగి వచ్చాను.

నారా: (తలుపుతెరచి) ఒట్టురా, సీతయ్యా! నిన్ను ఆనవాలు పట్టలేక పోయానంటే నమ్ము— కంఠస్వరం చూస్తే విన్నట్టు సుపరిచితంగా వుంది; నిన్ను చూస్తే—

సీతయ్య: ఏం నన్ను చూస్తే? నాలో మార్పేముంది? నేను మామూలుగానే వున్నానే—

నారా: అదే చూస్తున్నాను-అయితేనూ, ఎన్నాళ్ళకెన్నాళ్ళకి! బహు-కాలదర్శనం; ఏమిటి? చిలుక్ ములుక్! సుప్రభాతమూ, సుస్వాగతమూ, ఇదమిదమాసనం, అవీని! అలా సేదదేరు ముందు—ఆఁ ఆఁ, ఆకుర్చీలో కూర్చోకు—

సీతయ్య: ఏం?

నారా: అబ్బే, దాని కో కాలు జారిపోయింది కాదూ మరి? ఊరికే అలా బొట్ట మోపుగా గోడ కుర్చీ వేసిపెట్టాను, అతిథిశాలకి అలంకారప్రాయంగాను. తెలియలేదూ? ఈ మంచంమీద కూర్చో....ఇలారా, ఏదీ—

సీతయ్య: ఉండు, అలా కుదిపెయ్యకు మరి, ఏమిట్రా, ఈ కౌగిలింతలూ, ఈ అప్యాయమూను, అసహ్యంగాను?

నారా: అదేమిట్రా, కలుసుకోక కలుసుకోక ఇన్నాళ్ళకి మళ్ళీ కలుసుకుంటే అలా విసుక్కుంటావు, సీతయ్యా? తిన్నగామాట్లాడవు?

సీతయ్య: ఉస్స్! (నిట్టూర్చి) అమ్మయ్య! (కూర్చుంటాడు)

నారా: నువ్వెప్పుడూ ఇంతేరా, మట్టి తిన్న పాములాగ, ఏమిటి?—ఊఁ, అంతాబాగున్నారా?

సీతయ్య: పాములు మట్టి తినవురా, నారాయణ; తినకపోయినా మాట్లాడవు.

నారా: నేనూరికే వాపోదమేగాని, నీకు కవితాత్మ అనేది లేదురా, సీతయ్యా. వట్టి ముక్కన్న ముక్కర్థంగాదివి.—ఆఁ, ఇప్పుడు తెలిసింది—

సీతయ్య: ఏమిటి?

నారా : హారిసీ, మీసం పెంచుతున్నా వేమిట్రా యీ మధ్యని?

సీతయ్య : (నవ్వి) హుం, ఇదా? "మీసము వస మొగమూతికి" అన్నారు కాదుట్రా మరి? అందుకు.

నారా : ఈ మధ్య మళ్ళీ ఎవరన్నా అన్నా రేమిటి? వీరక్షాత్రతేజం విందులు చేస్తోందిరా, యీ సారి నీ మీసాలమొహం! రెండు భాషలలో కవిత్వం చెప్పగలిగిన వాళ్ళకి రెండు మీసాలు పెట్టుకోడాని కధికారం వుందని వాదించాడొక మహాకవి. మరి నువ్వు మూడో భాషలోకూడా రాస్తావేమో? ఇంకో మీసం—

సీతయ్య : ఛ, వూరుకో—ఏదీ అగ్గిపెట్టె?

నారా : నువ్వేవన్ని చెప్పు, మీసాలకీ చుట్టలకీ పొత్తు కుదరదురా, సీతయ్యా—అగ్గి పెట్టెలు దొరకడంలేదు. ఇదుగో పెట్రోల్ సిగరెట్ లైటర్!— నిజంగా నీ ముఖారవిందాన్ని గురించి నా అభిప్రాయం చెప్పమన్నావా?

సీతయ్య : ఒద్దులే.

నారా : అయితే, ఇన్నాళ్ళనించీ ఏయే దేశములం జరించావు? ఏయే తోయధుల్ దాటావు? మరి ఏయే తీర్థములందు గ్రుంకిడితివి?—అంటే—

సీతయ్య : ఒరేయ్, నువ్వు మామూలుగా మాట్లాడడానికి వీలవుతుందా?

నారా : నా ఉత్సాహం యావత్తూ ఖూనీ చేసేశావురా. నిన్ను చూడగానే మొగ్గలు వేస్తుంది, అసలు

సీతయ్య : అదేమిటి? ఎవరు?

నారా : నా ఉత్సాహలతికరా, సీతయ్యా!

సీతయ్య : ఊఁ, ఏమిటి కథ? మహా ఉత్సాహంగా వున్నట్టున్నావు? మరి నీ వుత్తరంచూస్తే నీ కిక్కడే ప్రాణంమీదకి వచ్చిందనుకుని పనులన్నీ మానుకుని పరిగెత్తుకొచ్చాను.

నారా : (ఆశ్చర్యంగా) నా ఉత్తరమా?

సీతయ్య : నన్ను ఉన్నావాణ్ణి ఉన్న పళంగా రమ్మనీ, ఇప్పుడు రాకపోతే మళ్ళీమనకింక చూపులు వుండవనీ రాశావు కాదూ?

నారా : అవును సుమా—అలాంటి విషయమేదో ఆ మధ్య నీకు రాద్దామని అనుకున్నట్టు జ్ఞాపకం. అయితే నీకు రాశానన్న మాటా?

సీతయ్య : (జేబులోనుంచి ఉత్తరంతీసి) మరి యీ వుత్తరం ఎవరు రాశారు? దీని అర్థం ఏమిటి?

నారా : అదీ. నిన్ను అర్జంటుగా రమ్మని రాశాను. అవును, ఇప్పుడు గుర్తుకి వస్తోంది. ఎందుకు రాశాను చెప్మా?

సీతయ్య : అదే నిన్ను నేను అడిగేదీని.

నారా : అసలు సంగతేమిటంటే, నా గుండె చితికి పోయిందిరా, సీతయ్యా!

సీతయ్య : ఏమిటి?

నారా : నా హృదయకోశం వుంది చూశావూ? అది శిథిలమై పోయింది. నూనెగానుగలో తెలకపిండిలాగ పిప్పయి పోయిందటే నమ్ము.

సీతయ్య : మళ్ళీనా?

నారా : కథంతా పూర్తిగా వినాలిరా ముందు నువ్వు.

సీతయ్య : ఒద్దురోయ్ బాబు!

నారా : "వినదగు నెవ్వరు చెప్పిన"—మొన్న శుక్రవారంనాడు నేనూ స్టేషన్‌లో రైలు దిగాను. జనంతో కిటకిటలాడి పోతోందిలే: ఇసుకవేశాను రాలలేదు. సామాను కూలివాడి నెత్తినిపెట్టి బయలుదేరాను ఆ జనసందోహం మధ్యపడి.

సీతయ్య : ఒరే, ఈ రోజుల్లో రైలు అగగానే స్టేషన్ ఎలా వుంటుందో అంత శ్రమపడి నువ్వు నాకు వర్ణించి బోధపరచడం అవసరమే అంటావా?

నారా : నీ భావనాబలం గొప్పదే అనుకో. ఐనా ఇదే మరి రంగస్థలం.

సీతయ్య : ఏది?

నారా : ఆ రైలు స్టేషను—అంటే నేనా తొడతొక్కిడిలో ఊరికే అలాగా అంటే యాదాలాపంగా తలవని తలంపుగా తెలిసింది కాదూ? వెనక్కి తిరిగి చూశాను. సరిగ్గా నా వెనకాలే.

సీతయ్య : ఒక సుందరాంగి.

నారా: చాలదు. ఒరే. ఆమెను నేను సరిగ్గా వర్ణించలేక పోతున్నానురా।

సీతయ్య: ఫరవాలేదులే. నాకు అర్థం అవుతోంది. తరవాత చెప్పు—

నారా: ఆమె భర్త ఎవరైనప్పటికీ ఆమెను చూసుకుని గర్వపడొచ్చు.

సీతయ్య: ఎవరి భార్య ఏమిటి ఆవిడ అయితే?

నారా: ఇంకా ఎవరి భార్యా అయివట్టులేదు. వివాహదూషితంకాని కన్యకామణీ. వాసనచూడనట్టి ప్రసవంబూ వగైరా అదీ తెలిసింది కాదూ? "కమల" ఆవిడ పేరు ఎంత ముద్దైన పేరురా

సీతయ్య: ఏమిటి ఆ గేటులోనుంచి ఇవతలకి వచ్చేలోపల ఆవిడ పేరూ అవీకూడా కనుక్కున్నావేమిటి?

నారా: నేను కనుక్కోలేదు. వాళ్ళ నాన్నో, మామయ్యో, ఎవరో—అయన మొహానికి ఒక బుల్లి గడ్డిమోపు చాటు చేసుకున్నాడు మీసా లనుకుంటా నవి—అయన "కమలా జాగర్త।" అని మా వెనకవించి కేకవేస్తున్నాడు. మరి నాలు గడుగులు ముందుకు వేశానో లేదో నా ఎడమ జబ్బల పూరులో ఏదో చెప్పలేనంత విపరీతమైన పోటు పెట్టింది తేలుకుట్టినట్టు. ఏది మంత్రగట్ఫో ఏదో అంటారు చూడు. మన కండరాన్ని ఒక పట్టకారుతో నొక్కి మెలిపెడితే వుంటుందీ అలాగ.

సీతయ్య: చోటులేక రైల్లో రాత్రి తెల్లవార్లూ మేకులాగ కదలకుండా కూర్చుకుంటేను.

నారా: ఒరేయ్ వాస్తోంది నా ధోరణిలో చెప్పనీను వ్వలా మాటకి అడ్డం వచ్చి చొప్పదంటు ప్రశ్నలు వేస్తోంటే నేను కంగారుపడి అంతా మరిచిపోయి మళ్ళీ మొదటినించీ మొదలెట్టవలసివస్తుంది,

సీతయ్య: అయితే నే వింక మాట్లాడను, నీ ధోరణిలోనే చెప్పు.

నారా: ఎందాకా వచ్చాను?

సీతయ్య: మన కండరాన్ని పట్టకారుతో పట్టి మెలిపెట్టడమో ఏదో అన్నావు.

నారా: ఊఁ, ఆ జబ్బలో చెప్పలేనంత బాధతో నేను మళ్ళీ వెనక్కితిరిగి చూశాను. ఆవిడ పువ్వులు విరిసినట్టు నా బాధ అంతా వూరికే అలా మటుమాయమైపోయేట్టు ఒక చిన్న మందహాసంచేసి తన సహజ కోకిల కంఠం తెరిచి మృదువుగా పాపం నెప్పెట్టిందా? క్షమించాలి" అంది.

సీతయ్య: ఏమిటి! అయితే ఆ అమ్మాయే కరిచిందంటా వేమిటి ఆ జనసమ్మర్దంలో నిన్ను జబ్బ పట్టుకుని?

నారా: నేనూ అదే అడిగాను. వెనక్కి తిరగడంలో ముందున్న అసామీ మడమమీద మట్టి-కాలు పచ్చడయినందు కనుకుంటాను వాడు కెవ్వుమని అరిచి నాకు కళ్ళు లేవనీ, వున్నా కనపడవనీ తీర్మానించా డనుకో అది వేరే విషయం-ఆఁ, "ఎందుకండీ న న్నలా జబ్బలో కరిచారు?" అని ఆ అమ్మాయి నడిగాను. ఆవిడ ఏమందో తెలుసా?

సీతయ్య: క్షమించమందీ పశ్చాత్తాప పడింది కద తన దురుసుతనానికి?

నారా: "ఈ గోలా. ఇంతమంది జనాన్ని చూసి బెదిరి" అంది.

సీతయ్య: ఎంత బెదిరితేమాత్రం అంతమందిలో అమాంతంగా నిన్ను పట్టుకుని కరుస్తుందిట్రా? మళ్ళీ చదువుకున్న అమ్మాయి అంటున్నావు?

నారా: "ఇది మూడోసారి ఇలా ముందున్న వాళ్ళని ఇవాళ ఇది కరవడం।" అంది ఆ అమ్మాయి మళ్ళీ క్షమించమని ప్రార్థించింది అదేమో గుర్రుమంది.

సీతయ్య: అదేమిటి?

నారా: మొదట నాకూ అర్థం అవలేదు. తీరా పరిశీలనగా చూస్తునుగదా.

ఆ అమ్మాయి చంకలో ఏముందో తెలుసా?

సీతయ్య: ఏమో?

నారా: ఆమె బాహువల్లరులలోని రంగురంగుల దుప్పటీని ఛేదించుకుని ఒక చక్కని సీమ కుక్కపిల్ల నావైపు కొరకొర చూస్తూ గుర్రుమంటూ ముం

దుకి ఉరకబోతోంది! ఆమె దాన్ని సముదాయించి ముద్దుపెట్టుకుంది.

సీతయ్య: (నవ్వి) అయితే నిన్ను కుక్క ముట్టుకుందన్నమాట! ఏంరా నారాయణ?

నారా: అంతే. వెంటనే నా హృదయం ఎత్తున వున్న నీరము పల్లానికి లాగ ఆమెవైపు జలజలా ప్రవహించింది. నే నొక చక్కని సీమ కుక్కపిల్ల నెందుకయాను కాదా అని నా మనస్సు ఏడ్చింది. అంటే నేను ఆమెను ప్రేమించా ననుట—

సీతయ్య: ఈ ప్రేమ తొలి చూపులోదే కాదు, తొలి కాటులోది కూడానురా నారాయణ!

నారా: కాని, నా దురదృష్టం నే నామెను పారేసుకున్నానురా, సీతయ్యా పోగొట్టుకున్నాను.

సీతయ్య: అంటే?

నారా: ఇంతలోకి ఒక రాక్షసుడు-జనులు టిక్కెట్టు కలెక్టరో ఏదో అని పిలుస్తారనుకుంటాను. వచ్చి నా టిక్కెట్టంటూ సామానుకి పాస్ అంటూ ఒక పావుగంటసేపు నన్ను పట్టుకుని హింసించేశాడు. ఆమె అదృశ్యమయిపోయింది. ఇప్పుడు నాకేం గతి చెప్పరా సీతయ్యా?

సీతయ్య: పోనీ బయటికివొచ్చాక వెతకలేక పోయావా?

నారా: వచ్చిన చిక్కేమిటంటే, ఒరే సీతయ్యా, నేనామెపేరు మరిచిపోయానురా.

సీతయ్య: విమలో, ఏదో అని చెప్పినట్టున్నా విప్పుడు?

నారా: కమల—అయితే యీ మహాపట్టణంలో 'కమలా, కమలా!' అంటూ అరుస్తూ ఎక్కడకని వెళ్ళను? ఆమె చిరునామా, తండ్రీ లేక భర్త పేరూ అవీనో, వెర్రాడా?

సీతయ్య: ఆమాటా నిజమే మరి—

నారా: ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు? నాకు మతిపోవడం నీకిష్టమా, చెప్పు?

సీతయ్య: నేనివేళ వీరభద్రపురం వెడుతున్నాను. నాతోకూడా రా, పోనీ.

నారా: ఏమిటి, కమల నిక్కడ విడిచిపెట్టా? అసంభవంరా, సీతయ్యా!

సీతయ్య: ఇంకా ఆ కమల యీ వూళ్ళోనే వుందని నీకెలా తెలుసు?

నారా: ఆ మాటా నిజమే మరి—

సీతయ్య: మొన్న శుక్రవారంనాడు కాదూ కమల రైలు దిగింది అన్నావు?

నారా: సరీగ్గాను—

సీతయ్య: కమల చంకలోవున్న కుక్కపిల్ల నల్లగా వుంటుంది కాదూ?

నారా: చీకటిలాగ—ఎక్కడా ఒక్క తెల్ల వెంట్రుకైనా కనపడలేదు జబ్బలదాకాను; యజ్ఞానికి పనికొస్తుంది.

సీతయ్య: కమల ఎలావుంటుందీ అన్నావు?

నారా: మణి దీపంరా, సీతయ్యా! అప్సరస, రంభా, ఊర్వశీ, మేనకా, తిలోత్తమా, అదీని—

సీతయ్య: అది సరేలే—చామన చాయగా, బొద్దుగా వుంటుంది, అవునా? విశాలంగా అమాయికమైన కళ్ళూ—?

నారా: అక్షరాలా; నువ్వెప్పుడైనా చూశావేమిట్రా కమలని?

సీతయ్య: నువ్విందాకటినించీ వర్ణిస్తున్న కమల మా వేలువిడిచిన మేనమామ కూతురని నాకు తోస్తోంది. వాళ్ళది వీరభద్రపురమేలే; మొన్న శుక్రవారంనాడే యీవూరుమీదుగా వెళ్ళారు—

నారా: ఏమిటి! క్షమించరా, సీతయ్యా! ఆవిడని గురించి ఏవో చాలా వాగేను నీ దగ్గర—!

సీతయ్య: ఫరవాలేదులే—కమల బాగా చదువుకుంది—చిన్నప్పుడే తల్లితండ్రులు పోతేను వాళ్ళ పెద్దతండ్రి రామభద్రయ్యగారు పెంచుతున్నారు ఆమెను.

నారా: పాపం!

సీతయ్య: ఇంకా పెళ్ళికాలేదు—ఇస్తానని రామభద్రయ్యగారు వొప్పుకుంటే నువ్వు కమలని పెళ్ళి చేసుకుంటావు కాదూ? లేకపోతే బాగుండదు—

నారా : విధిగా—కమలని చేసుకోడానికి వీలు లేకపోతే నేనింక ఆ జన్మాంతం బ్రహ్మచారిగా వుండిపోడానికి నిశ్చయించుకుంటేనే?

సీతయ్య : రేపు మా కమల పుట్టినరోజులే: అందుకే నేను వీరభద్రపురం వెడుతూవుంట—

నారా : మన కమల కేమైనా మంచి పుట్టినరోజు బహుమతులూ, అవీ కొని పట్టుకు వెళ్ళొద్దుట్రా మరి, సీతయ్యా?

సీతయ్య : కొందాంలే—అన్నట్టు, వాళ్ళ పెద్ద తండ్రి రామభద్రయ్యగారు వున్నాడే, ఆయన అసాధ్యుడు. ఆయనతో నువ్వు జాగ్రత్తగా మాట్లాడవలసి వుంటుంది.

నారా : ఓ, దానికేం? సరస సంభాషణ విషయంలో చావగొట్టేస్తాను: నీకు ఆ భయం వొద్దు.

సీతయ్య : ఆయన తన బావమరిదిమీద పోటీకి పెద్దపెద్ద మీసాలు పెంచుతున్నాడు—నువ్వింక ఏమి మాట్లాడినా సరేగాని, రామభద్రయ్యగారి మీసాలు అందంగాలేవని మాత్రం ఆయనదగ్గర అనకూడదు సుమా ! కొంపలు అంటుకుపోతాయి.

నారా : రామభద్రయ్యగారి మీసాలను స్తోత్రం చేస్తూ 'మీస పంచకం' అని ఆసువుగా పద్యాలు చెప్పనుట్రా ?

సీతయ్య : వీరభద్రపురంలో వాళ్ళకొక మంచి బంగాళ, తోటా, అవీ వున్నాయిలే—నవికి సౌఖ్యంగానే వుంటుందక్కడ—

నారా : ఇంకేం మరి?

సీతయ్య : అక్కడికి వెళ్ళాక కమలని నీకిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందని రామభద్రయ్యగారితో చెపుతాను; ఆయనకి నామాట అంటే కొంచెం గురి వుందిలే—ఆ పైని నీ అదృష్టం !

నారా : నీమాట ఆయన తప్పకుండా వింటాడులే; నువ్వుకూడా మీసాలు పెంచుతున్నావుగా?

సీతయ్య : సరే చూద్దాం—ఇవాళ సాయంత్రమే మరి మన వీరభద్రపురం ప్రయాణం—

రెండవరంగం

(వీరభద్రపురంలో రామభద్రయ్యగారి ఇల్లు)

[బండివచ్చి ఆగుతుంది]

సీతయ్య : సామాను లోపల పెట్టవోయ్, బండి అబ్బి !

నారా : ఒరే, సీతయ్యా, రామభద్రయ్యగారి లోగిలి చాలా బాగుందిరా !

సీతయ్య : నేను చెప్పలేదూ?—నువ్వు కొంచెం సేపు యీ సోఫామీద కూర్చోరా, నారాయణా; నేనొక్కసారి లోపలికివెళ్ళి అంతా ఏంచేస్తున్నారో చూసివస్తాను.

నారా : మంచిది, పోయిరమ్మ.

(కొంచెంసేపు నిశ్శబ్దం)

నారా : (గొంతుక సవరించుకుని) నమస్కారమండీ, రామభద్రయ్యగారూ ! నా పేరేనండి నారాయణ అంటేను.

వెంకటకృష్ణయ్య : (కొంచెం కోపంగా) ఆఁ, ఏమన్నావు ? నీ వుద్దేశం ఏమిటి? నన్ను రామభద్రయ్యగారని ఎందుకనుకున్నావు?

నారా : (వెకిలిగా) అబ్బే, ఊరికే అలా అనుకున్నానండి; అంతే—

వెం-కృష్ణయ్య : నేను రామభద్రయ్యగారిని కాను !

నారా : ఓ, మీరుకాదూ? అలాగా అండి? అవును, అవును,-కాదు; కాదు.

వెం-కృష్ణయ్య : నన్నుచూసి రామభద్రయ్యగారని పిలవాలని నీకెందుకు బుద్ధిపుట్టిందో నాకు బోధపడటంలేదు.

నారా : మీ మీసాలు చూసి అలా అనుమానించాను; రామభద్రయ్యగారికి ఒక మంచి అందమైన మీసాలజత వుందని చెప్పారులెండి—

వెం-కృష్ణయ్య : ఎవరు చెప్పారు నీకు ?

నారా : ఆయన వేలువిడిచిన చెల్లెలి కొడుకు, మా సీతయ్య.

వెంకట కృష్ణయ్య : ఇదుగో, చూడు అబ్బాయీ, ఎవరి మంచి చెడ్డలను గురించి అయినా నీకు సరియయిన భోగట్టా కావాలంటే, సదరు ఆసామీ వేలు విడిచిన చెల్లెలి కొడుకూ, వాళ్ళ నాయనమ్మా చెప్పే మాటలు నువ్వెప్పుడూ నమ్మకూడదు. వాళ్ళ అభిప్రాయాలు బంధుప్రేమతో పక్షపాత భూయిష్ఠాలై వుంటాయి. ఒకవ్యక్తి తాలూకు మీసాల చక్కదనం విషయమై నిజానిజాలు తెలుసుకోవాలనే కుతూహలం నాకు వుంటేనేను అతని వేలువిడిచిన చెల్లెలి కొడుకు నెప్పుడూ అడగకూడదు. మీసకట్టు అందచందాలని గురించీ, నాణ్యాన్ని గురించీ చక్కగా తెలిసిన పెద్దమనిషిని అడిగి తెలుసుకుంటాను. తెలిసిందా? (వెటకారంగా) హుఁ. రామభద్రయ్యగారి మీసాలు అందంగా వుండ వలిసిందే! భేష్, రామభద్రయ్యగారికి కూడా ఒక మోస్తరు మీసాలు వున్నమాట వాస్తవమే. ఆయన గారిది పేడి మూతి మట్టుకు కాదు. అంతవరకు అంగీకరిస్తాను-అంతే కాని, ఆయన మీసాలు చూడ సుందరమైన వంటే! అసందర్భం! హాస్యాస్పదం! ఘోరం! ఛీ, ఛీ, రామ భద్రయ్యవీ వొక మీసాలే? ఈ సంగతి నా దగ్గర అంటే అన్నావుగాని ఇంకెక్కడా అనబోకు. నవ్విపోతారు! (వికటంగా నవ్వుతూ) ఆహాహా. ఇలాంటి విడ్డూరం నా జీవితకాలంలో ఎన్నడూ వినలేదు. రామభద్రయ్యగారి మీసాలూ-ఊహ్!— కూర్చో: ఆయన వస్తాడు. నీకళ్ళతో నువ్వే చూద్దువుగాని—(నిష్క్రమిస్తాడు.)

నారా : ఇదుగో, చూడండీ మీ పేరెవరోను.... హరి, వెళ్ళిపోయాడు! మీసాలమీద ఎంత దీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు, కుర్రాడు!

సీతయ్య : ఏమిరా నారాయణ, అలా దిగాలుపడి కూర్చున్నావు? కొత్తగా వుంది కాబోలు నీకిక్కడ.

నారా : అంతా ఇప్పుడే వొక మీసాల పక్షి పరిచయభాగ్యం కలిగిందిరా, నాకు, సీతయ్యా!

సీతయ్య : ఏమిటి! ఏది?

నారా : శ్మశ్రుసౌందర్యం మీద నా కొక బుల్లి ఉపన్యాసం దంచి, అంతా ఇప్పుడే ఇలా జారిపోయాడు.

సీతయ్య : ఏమంటావు?

నారా : ఆయనలో స్నేహభావం, కలిసికట్టుతనం అలాంటివి కొంచెం రద్దుగా వున్నట్టు తోచింది నాకు—

సీతయ్య : ఏం?

నారా : ఆయన మీససంచయం చూసి మీ మామయ్య అనుకుని, "నమస్కారమండీ, రామభద్రయ్యగారూ!" అన్నాను. సగౌరవంగాను. రామభద్రయ్యగారి మీసాలు చాలా అందంగా వుంటాయని నాకెవరో చెప్పడం ఆ అబ్బికి నచ్చినట్టులేదు. నేనలా అన్నందుకు ఆయన చిత్తం సంక్షోభించింది. ఈర్ష్యా, అసూయా అవీ గట్లు తెంపుకుని పారాయి.

సీతయ్య : (నవ్వి) నేననుకుంటూనే వున్నాను. అదీమచ్చు. నువ్విప్పుడు చూసిన ఆయన మా రామభద్రయ్య మామయ్యగారి భావమరిది వెంకట కృష్ణయ్యగారు. మా మామయ్య మీసాలని చూస్తే యీ వెంకట కృష్ణయ్యగారికి ఎక్కడలేని ఓర్వలేని తనమూను; రామభద్రయ్యగారి మీసాలు బాగా వుంటాయని ఎవరైనా అంటే ఈయన భరించలేడు. ఈ వెంకటకృష్ణయ్యగారు చుట్టంచూపుగా వచ్చి ప్రస్తుతం ఇకడవుంటున్నాడులే—ఇదుగో కమలా!- కమలా, ఇతనే నాస్నేహితుడు నారాయణ అంటేను—ఇది మా మామయ్యగారి అమ్మాయి కమలరా, నారాయణా!

కమల : వీరి నెక్కడో చూసినట్టు జ్ఞాపకం?

నారా : బౌవౌ! బౌవౌ! మీసీమకుక్క పిల్ల బాగా వుందాండి, కమలగారూ?

కమల : మా "లిల్లీ" యేనా? బాగుందండి—మీకెలా తెలుసు దాని సంగతి? మా సీతయ్య బావ చెప్పాడను కుంటాను?

నారా : లేదు; మొన్న రైలుస్టేషన్‌లో చూశాను. మీరు?

కమల : మొన్న, అయితే మీరా—?

నారా : మరే నండి—

సీతయ్య : వీణ్ణే నమ్మా. మొన్న శుక్రవారం వాడు నీ కుక్క ముట్టుకుంట.

కమల : క్షమించాలండీ, నారాయణగారు!

నారా : ఫరవాలేదండి—ఇవాళ నాకు చాలా సుదినమండీ, కమలగారు!

కమల : నాకూ చాలా ఆనందంగా వుందండీ మీ పరిచయం కలిగినందుకు!

సీతయ్య : ఇవాళ మా కమల పుట్టిన రోజు!

కమల : నాకేం తెచ్చిపెట్టావు, సీతయ్య బావా?

నారా : పెట్టి తియ్యరా, సీతయ్య!

సీతయ్య : ఇప్పుడు కాదు, భోజనాలయాక.

కమల : అరుగో, పెద్ద నాన్నగారు వస్తున్నారు. నేను వెళ్ళి భోజనాల ఏర్పాట్లు చేయిస్తాను. (నిష్క్రమిస్తుంది.)

రామభద్రయ్య : ఇదుగో, ఎప్పుడొచ్చావురా, సీతయ్యా?

సీతయ్య : ఇప్పుడే, మామయ్యా—ఇతను మా స్నేహితుడు నారాయణ; చాలా తెలివైనవాడూ, మంచివాడూనూ?

నారా : కవిత్వం రాస్తానని కూడా చెప్పరా, సీతయ్యా.

సీతయ్య : అన్నట్టు కవిత్వం కూడా రాస్తాడు.

రామ : అలాగా? బాగుంది, బాబూ, సంతోషం!

నారా : ఆహా!

రామ : ఏమిటి?

నారా : మీ మీసాలు చూస్తోన్న కొద్దీ నా వొళ్ళు నేను మరిచిపోతున్నానండీ-అచ్చంగా వాటమైన "కెయిజరు" మీసాలు లాగ బహు అందంగా, ఆకర్షణీయంగా వున్నాయండి!

రామ : ఇవా? (నవ్వుకుని) అవును. ఈ మీసాలవి చాలా జాగ్రత్తగా పోషించుకుంటూ వొస్తున్నామలే. ఇదొక కళ.

సీతయ్య : మా మామయ్యకున్నంత అందమైన మీసాలు ఈ చుట్టుపట్ల జిల్లాలలో ఎవరికీ లేవురా నారాయణా!

నారా : సందేహ మేమిటి? "ఆంధ్రుల మీసాలు-అంతర్జాతీయ మీసాలు" అనే విషయాన్నిగురించి ప్రత్యేక పరిశోధనచేస్తూ ఆసేతుహిమాచలపర్యంతం పర్యటనం చేసివచ్చి నాకే ఇలాంటి మీసకోశం ఎక్కడా తారసిల్ల లేదంటే—

రామ : నిజమే? ఈ కాలంలో మీసాల ఔన్నత్యం వాటి పోషణ సంగతీ ఎవరికి తెలుసునోయ్? ఈ కాలపువాళ్ళంతా మీసాలు సగం సగం కత్తిరించుకునీ అసలు తీసేసి నున్నగానూ అఘోరిస్తున్నారు. ఆ శ్రద్ధా, ఆ వోపికా, ఆ పట్టుదలా, అన్నీ పోయాయి! నా మీసా లున్నాయి చూశావూ?

నారా : చూస్తున్నానండి, తనివి తీరటంలేదు.

రామ : వాసన నూనె రాసి, వీట్లని వడుపుగా మెలివేసి లేడికొమ్ములలాగ తిరిగిన వీటి మొనల మీద గజనిమ్మపండ్లు నిలబెట్టగలను పడిపోకుండాను తెలిసిందా?

నారా : మీ మీసాలమీద గజనిమ్మ పండ్లేమండీ చిన్న చెన్నంగి కొబ్బరి బొండాలనుకూడా నిలబెట్టి భరతనాట్యం చెయ్యవొచ్చునండి!

రామ : చెప్పలేం. ఎప్పుడూ ప్రయత్నించ లేదు.

నారా : మీరు తల్చుకుంటే అదెంత పనండి!

సీతయ్య : భేష్, మెహబాస్!

రామ : ఇదుగో, వెంకటకృష్ణయ్య బావగారు వొస్తున్నారు స్నానం అయినట్టుంది.

వెంకట కృష్ణయ్య : ఏమిటి, రామభద్రయ్య బావగారు మీ మీసం ఇవాళ కొంచెం కత్తిరింపించినట్టున్నారే?

రామ : ఛ, ఛ! నేను మీసం కత్తిరించుకోవలసినంత ఖర్మం ఏమొచ్చింది? నా మీసాలు నిండుగా పుష్కలంగా యథాప్రకారంగా చెక్కుచెదర

కుండా వున్నాయి. అవి కత్తిరించాలని మీ కెందుకు తోచిం దసలు ?

వెంకట కృష్ణయ్య : అబ్బే. ఆ చిగురిసీ యీ చిగురిసీ కొంచెం ఏదో బొర్రి బొర్రిగా వున్నట్టు కనపడితేనూ-ఎందుకో కొంచెం పొట్టిగాను బొద్దు తక్కువైనట్టూ అనింది. బహుశా పేను కొరికి వుండొచ్చు!

రామ : ఛీ, అసహ్యంగా అలా అవాచ్యం మాట లనకండి! ఇంకా అయిదు నిమిషాలైనా కాలేదు నేను అద్దంలో చూసుకుని. నా మీసాలు నిక్షేపంలా వున్నాయి. మీ మీసాలే ఇంకా ఏదో కొంచెం—

వెంకట కృష్ణయ్య : ఆఁ ఆఁ, ఏమంటున్నారు? సరిగ్గా ఆలోచించుకుని మరీ—

సీతయ్య : ఒరే నారాయణా, ముందు నువ్వు స్నానానికి లే. మళ్ళీ ఆలస్యమైపోతుంది భోజనాలకి.

రామ : అవును వెళ్ళరా బాబూ.

వెంకట కృష్ణయ్య : ఇదుగో సీతయ్యా! నువ్వెప్పుడు వొచ్చావయ్యా ?

సీతయ్య : ఇప్పుడే వచ్చానండి బాబుగారు.

వెంకట కృష్ణయ్య: ఈ కొత్త అబ్బాయి ఎవరు?

సీతయ్య: నా స్నేహితుడు లెండి; నారాయణ. మీ రెప్పుడు వచ్చారు అయితేను ?

వెంకట కృష్ణయ్య : నిన్ననే వచ్చానయ్యా.మా అబ్బాయికి కమలనిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించుకున్నాం బావగారూ నేనూను. ఆ విషయాలు ముఖాముఖీ మాట్లాడుకుని తాంబూలాలు పుచ్చుకు వెడదామని వచ్చాను.

నారా : హా సీతయ్యా! పులుసులో—

సీతయ్య : నువ్వు పదరా, నారాయణ-ఏమిటి బాబుగారూ కమలను మీ ప్రకాశిగాడికిచ్చి వివాహం చేస్తున్నారా?

వెంకట కృష్ణయ్య : మా చిరంజీవి ప్రకాశరావు కిచ్చి—

సీతయ్య: ఏం మామయ్యా?

రామ: అవునురా. దాని చదువుకూడా పూర్తి అయిందా ? ఇంక ఆ మూడు ముళ్ళుకూడా వేయించేస్తే మన బాధ్యత తీరిపోతుంది.

వెంకట కృష్ణయ్య : నీ ఉద్దేశం ఏమిటోయ్ సీతయ్యా ?

సీతయ్య : బాగానే వుందండి. కాని వరహీనం అవుతుందేమో అని నాకు కొంచెం—

వెంకట కృష్ణయ్య : అబ్బే ఆడపిల్లలు అలా వుంటారుగాని మావాడు మంచి పొడుగైనవాడూ, దారుఢ్యమైనవాడూ అదీని. నువ్వు వాణ్ణి యీమధ్య ఎప్పుడూ చూడలేదనుకుంటాను.

రామ : మనం లోపలికి వెడదామా ఇంక! వడ్డన అయివుంటుంది యీపాటికి.

మూడవ రంగం

(తోటలో — సాయంకాలం)

[కుక్క మొరుగుతుంది]

నారాయణ : బౌవౌ! బౌవౌ! హేయ్! హోయ్! ....చు చ్చు చ్చు చ్చు! (కుక్కని పిలుస్తాడు - ఈలవేస్తాడు)

కమల : లిల్లీ, లిల్లీ! దా, దా, ఆఁయ్ఁ, తప్పు ఎవరు ?

నారా ! నేనండీ కమలగారూ నారాయణని!

కమల : ఎక్కడున్నారు ?

నారా : ఇక్కడ ఈ మాలతీ నికుంజం మాటున! మీరా "లిల్లీ"యో ఏదో దాన్ని కాస్త సముదాయించి పట్టుకుంటే బయటికి వస్తాను.

కమల : ఫరవాలేదు. రండి, ఇది కరవదు. ఊరికే అప్యాయంగా నాకుతుంది అంతే—మొరిగే కుక్క కరవదని సామెత వుంది మీకు తెలియదూ?

నారా : నాకు తెలుసులెండి.ఆ సామెత వున్నట్టు మీ కుక్కకు కూడా తెలుసునో లేదో మరి అని! అయితే రమ్మంటారా ధైర్యంచేసి ?

(కుక్క మొరుగుతుంది)

కమల : దా, దా!— రండి భయంలేదు, కంగారుపడి దాన్ని ఏమీ అనకండి, నాకనివ్వండి.

నారా : అయ్యో, అయ్యో! చ చ్చు చ్చు చ్చు !- ఏమీ లేదు. దీన్ని చూడగానే నాకు జబ్బులోపోటు మొదలెట్టింది.

కమల: పాపం! మొన్న స్టేషన్‌లో ఇది నిష్కారణంగా మిమ్మల్ని కరిచింది, క్షమించాలండీ నారాయణగారూ!

నారా : ఫరవాలేదండి; మళ్ళీ కరవకపోతే సరి!

కమల : చూశారా, ఏమీ చెయ్యదు--అదుగో దూరంగా పోయి హాయిగా ఎలా ఆడుకుంటోందో, పిచ్చిలిల్లీ!

నారా: ఇది పిచ్చిదికూడా నేమిటండి?

కమల : (నవ్వి) అబ్బే, ముద్దుకి అలా అన్నాను—

నారా : అంతే కద—కమలగారూ!

కమల : చెప్పండి—

నారా: ఈ సుందర సంధ్యారాగాలలో, ఈ మంద మారుత పరిమళ నిశ్వాసాలలో, పక్షికులకలకలా రావాలతో కూడిన యీ ఉద్యానవనంలో—

కమల : ఏమిటది?

నారా: ఈ జంబూనింబ వృక్షంబులమధ్య అమర్చిన యీ తూగుటుయ్యేలమీద బాగుగా వూగుతూ మీరలా సోగకనురెప్పల నవ్వళించి పుస్తకం చదువుకుంటూ కూర్చోడం చూస్తూవుంటే—

కమల : నందనవనంలో అప్సరస్సుందరిలాగ వున్నానా?

నారా : సరిగ్గాను!

కమల : మీరు కవిత్వంకూడా చెపుతారేమిటి?

నారా : చెపుతానండి—నిరుపహతి స్థలంబూ అలాంటివి దొరికినప్పుడూ, ఊయెల మంచం వగైరా కనపడినప్పుడూను.

కమల : నాకు కవులంటే చాలా అభిమానమండీ, నారాయణగారూ!

నారా : చంపేశారు! చెప్పేరుకాదు—

కమల : అయితేమాత్రం, ఏం లాభం?

నారా : లాభం లేకేమండీ?

కమల : స్కూలుఫైనలు మూడుసార్లు తప్పాడు—

నారా : లేకపోతే, ఆ త్వాష్ట్రం, ఉష్ట్రపక్షిలాగ మొహం వాడూను. వాడు పేసవుతాడని ఎందుకనుకున్నారు?

కమల : మీ రెరుగుదురేమిటి, అతన్ని?

నారా : ఎవర్ని?

కమల : మా పెద్దనాన్నగారి బావమరిది, వెంకటకృష్ణయ్యగారి కొడుకు—ప్రకాశరావుని?

నారా : ఎరుగుండే దేమి టండి?

కమల: సరిగ్గా చూసినట్టు వర్ణించారతన్ని మరి? అతను అచ్చంగా ఉష్ట్రపక్షి ఆకారంగానే వుంటాడు—

నారా : అదేనండి మరి, కవీశ్వరుడి భావనా బలం అంటేను—

కమల: త్వాష్ట్రమందన్న కాదూ అన్నారు? ఆ ప్రకాశరావుకిచ్చి పెళ్లి చేస్తారుట నన్ను—

నారా : అసంభవం!

కమల : తప్పదని గట్టిగా చెప్పారు పెద్దనాన్నగారు; వాళ్ళకి బోలెడు ఆస్థివుందిట—ఆస్థి ఎవరికి కావాలండీ?

నారా : అవసరం లేదండి— పెళ్ళికి ప్రేమ ప్రధానం.

కమల : ప్రేమ అంటే మా పెద్దనాన్నగారికెలా తెలుస్తుంది?

నారా : చెప్పినా తెలియదండి—వాళ్ళ కాలంలో ప్రేమకి బదులుగా ఆస్థిచూసుకునేవారు.

కమల : ఇవాళ నా పుట్టినరోజు. పొద్దున్నే లేచేసరికి యీ ఘోరవార్త నా చెవిని వేశారు పెద్దనాన్నగారు.

నారా : నాకు నడినెత్తిమీద పిడుగుపడ్డట్టయింది!

కమల : మీకు కూడానా?

నారా : మీరు చెపితే నమ్మరుగాని.

క. నమ్ముతాను చెప్పండి. నా కీపెళ్ళి అన్యాయమని ఎవరు చెప్పినా నమ్ముతాను.

నారా: అర్ధం మించిపోయినట్టు మిమ్మల్నిప్పుడు అర్ధంటుగా ఆ దద్దమ్మకి—

కమల: త్వాష్టాని వికి

నారా: త్వాష్టాని మందన్న కిచ్చి పెళ్ళిచెయ్య బోతున్నారని వినేటప్పటికి నిజంగా, కోపదారి అయిన గాడిదవొకటి వెనుక కాళ్ళతో నాపొత్తి కడుపుమీద తన్నినట్టయింది!

కమల: కోపదారి అయిన గాడిదా?

నారా: అవును; గాడిద సాధుజంతువు; కోపం వస్తేనేగాని తన్నదు.

కమల: ఏ గాడిద అండీ?

నారా: ఏ గాడిద ఏమిటండీ? ఏదైనాసరే-చాకలి వాడి గాడిద; జిరాఫీ; జీబ్రా!

కమల: మా పెద్ద నాన్నగారిని వర్ణిస్తున్నారేమో అనుకున్నాను: అందుకు.

నారా: ఓ, అదా? ఆయన్నికూడా ఒక గాడిదతో పోల్చవచ్చు. ఒక విధంగా.

కమల: ఏ విధంగా?

నారా: మొక్కజొన్న పీచులాగ, బుల్లి గడ్డి మేటిలాగ ఆ మొహం నిండా మీసాలు పెంచడంలో చూపే ఆయన వోపిక, శ్రద్ధచూస్తే-ఆఁ, వొస్తోంది.

కమల: రానివ్వండి; సంశయించకండి.

నారా: చింపాంజీ, ఒరాంగొటాంగ్, గోరిల్లా-!

కమల: అదేమిటి?

నారా: కోతులు, కొండముచ్చుల్లో రకాలు.

కమల: నారాయణగారు!

నారా: ఏమండీ, కమలగారు?

కమల: మీ ఉపమానాలు మా పెద్దనాన్నగారికి సరిగ్గా సరిపోతాయి!

నారా: "ఉపమా కాళిదాసస్య" అన్నారు-ఎంత చక్కగా ఆలోచించానంటారు సరి?—అసలు యీ ఘోషా కావాలని గోలపెట్టే స్త్రీలంతా—

కమల: స్త్రీ లెవరూ ఘోషా కావాలని కోరు కోరండీ, నారాయణగారూ—వాళ్ళకి ప్రదర్శనేచ్ఛ ఎక్కువ. వాళ్ళ అలంకారాలూ, అతిశయాలూ, వొయ్యారాలూ, తిప్పుకోడాలూ-మీకు నేను చెప్పాలా? స్త్రీలకి ఘోషా మొగవాళ్ళు విధిస్తారు.

నారా: పోనీ, అలాగే—పురుషులచేత ఘోషా విధించబడ్డ స్త్రీలందరూ మీ పెద్దనాన్నగారిలాగ మీసాలూ, గడ్డాలూ పెంచేసుకుంటే, వాళ్లింక ఈ గుడ్డకరువు రోజుల్లో ముసుగులతోటీ, తెరలతోటీ బాధపడక్కర్లేదు. మొహం తాలూకు రూపురేఖా విలాసాలేమైనా వుంటే రంపుకాగడా వేసి వెతికినా మచ్చుకైనా కనపడవు—

కమల: (నవ్వి) ఆడవాళ్ళకి మీసాలూ, గడ్డాలూ రావండీ!

నారా: అదేలెండి వాళ్ళ అదృష్టమూ, గర్వ కారణమూను—

కమల: ఏమయితేనేం, నా పరిస్థితి ఇప్పుడు పెనంమీద వేడి తప్పించుకోవాలని పొయ్యిలో పడి నట్టుంది!

నారా: ఈ విషయం వినడానికి నాకు చాలా విచారంగా వుందండీ! కమలగారూ; నా హృదయం తరుక్కు పోతోంది.

కమల: ఏడాది అయింది, నేను హాస్టలులో వుంటున్నాను చదువుకోడానికి వెళ్లి. ఏడాదిక్రితం వరకూ మా పెద్దనాన్నగారు విశేషంలాగ వుండే వారు—అంతే, మొన్న నేను పరీక్షలై శలవల కింటికి వచ్చాను; మా పెద్దనాన్నగారిలో విపరీతమైన మార్పు ఏర్పడింది—

నారా: మిమ్మల్ని ఇదివరకులాగ సరిగ్గా చూడటం మానేశారులాగుంది, తెలుస్తోనే వుంది.

కమల: నేనంటే ఆయనకెప్పుడూ అమితమైన ప్రేమే; దేనికదే చెప్పుకోవాలి-అదికాదు, మొహం నిండా అలా అసహ్యంగా మీసాలు పెంచుకున్న వాళ్లని చూస్తే నాకు కంపరం పుట్టుకొస్తుంది; ఆ ఘోరదృశ్యం చూసి నేను భరించలేను—మీసాలు

పెంచటం అనాగరిక లక్షణం అని నా దృఢ నమ్మకం——

నారా ; ఇంకా సందేహం ఏమిటండి,

కమల : పోనీ, పెళ్లి చేస్తున్నారుకదా, ఇంక మా పెద్దనాన్నగారి ముఖం అట్టే చూడక్కర్లేదని ఆశపడ్డాను——

నారా : అమ్మా, మీమీద అంత ప్రేమ వున్న వాడు మీ అత్తవారి యింటికి వచ్చి అక్కడే తిష్ట వేస్తాడుగాని మానాడంటారా ?

కమల : ఎప్పుడైనా వొకసారి వచ్చినా ఏదో భరించవచ్చు ననుకోండి. కాని, ఇప్పుడు నాకు కాబోయే మామగారుకూడా ఈయనమీద పోటీగా మీసాలు పెంచుతున్నాడు 'స్వర్గానికి వెళ్లినా' అన్నట్టు, అత్తవారింటికి వెళ్లినా యీ దౌర్భాగ్యం నాకు తప్పేటట్టులేదు——ఇంక నాకేం గతి?

నారా ; మీరంత అలా ఇదవుతోవుంటే నేను చూడలేను మరి; దీని కేదైనా ఉపాయాంతరం లేకుండా వుండదు

కమల ; ఏ వుపాయం కనపడదు——పోనీ, మా సీతయ్యబావ ఆ దిక్కుమాలిన చుట్టలు కాల్చకుండా వుంటే అతన్నయినా పెళ్లిచేసుకునేదాన్ని।

నారా : అబ్బే, లాభం లేదండి; వాడుకూడా యీ మధ్య మీసాలు పెంచుతున్నాడు।

కమల : లోకానికంతకీ యీ మీసాల పిచ్చి ఏమిటో। నామీద ఎవరికీ జాలిలేదు; ఇప్పుడు నేనేం చెయ్యను? నారాయణా।(కంటనీరు పెట్టుకుంటుంది)

నారా : కమలా।

కమల : ఛట్ ! అదేమిటి ? 'కమలగారూ' అనండి——

నారా : కమలగారూ।

(కుక్క మొరుగుతుంది)

కమల ; దా, దా, చు చ్చు చ్చు చ్చు। కొంచెం దూరంగావుండి మాట్లాడండి. నాకు దగ్గరగా ఎవరైనా వస్తే "లిల్లీ" సహించలేదు.

నారా : ఓహో అదా ? [illegible]రూ। నేను మీకు ఇంత దూరంవరకు [illegible]చ్చు ననుకుంటాను ?

కమల: ఆఁ, యీసారి చెప్పండి.

నారా: కమలగారూ మీరు——

కమల: మీ భాగ్యదేవతని——అవునా ?

నారా: నా నోట్లో వున్నది సరిగ్గా చెప్పారు ।

కమల: లాభంలేదు అనకండి.

నారా: ఏం, అలా అంటున్నారు? నాకు మీసాలు లేవు. ఇంక ముందెప్పుడూ పెంచనని ప్రతిజ్ఞ చేస్తున్నాను।

కమల: చాలదు. మీ నాన్నగారికో?

నారా: మా నాయనమ్మ పోయినప్పటినించీ ఇంతవరకూ లేవు ఇంక ముందు విషయం తగు జాగ్రత్త తీసుకుంటాను।

కమల: మిమ్మల్ని గురించి మా సీతయ్య బావ అన్నీ చెప్పాడు.

నారా: ఏమిటి।

కమల: మీ కేమాత్రం ఆస్తి వుంది?

నారా: ఏదో సంసారపక్షంగా వుంటుంది. అది కూడా చెప్పలేదూ వాడు?

కమల: మెడ్రాసులో ఒక మేడా, ఒక కారూ కొనుక్కుని మనం దర్జాగా జీవించడానికి సరిపోతుందా?

నారా: ఏదైనా సినిమా కంపెనీలో ప్రవేశిస్తాను ఏమంటారు నా కమలగారూ? అబ్బ, యీ లిల్లీని కొంచెం దూరంగా వెళ్లమంటారా? నేను చెప్పదల్చుకున్న మంచి విషయాలన్నీ—

కమల: క్షమించండి. ప్రయోజనం లేదు. నా కర్మ నేను అనుభవించవలసిందే. నా పెళ్ళి నిశ్చయం చేశారు పెద్ద నాన్నగారు. దాని కింక తిరుగులేదు సీతయ్య బావా।

నారా: ఎందుకు? నే నున్నాను కాదండీ? లిల్లీ వుంది——ఓ, వొస్తున్నాడా?

సీతయ్య: కుక్క మొరుగుతూ వుంటే మళ్ళీ మన నారాయణ ఐబోస్. పికోక్స్ పట్టుకుం దనుకుని పరిగెత్తుకొచ్చాను. ఏమిటి కమలా ఏమంటున్నాడు మా నారాయణ?

నారా: ఒరేయ్ సీతయ్యా సమయానికి వచ్చావురా. పరిస్థితి అంతా కుండలో పులుసులాగ కుత కుత ఉడుకుతోంది తెలిసింది కాదూ? మన కమల గారిని ఆ ప్రకాశరావనే త్వాష్ట్రానికి.

కమల: త్వాష్ట్రమందన్న—

నారా: అదీ, త్వాష్ట్రమందన్న కిచ్చి కట్టబెడతానని పెద్ద నాన్న బలవంతపెడుతున్నాడు. పోనీ నిన్ను చేసుకుందామంటే—

కమల: నారాయణగారూ! (వారిస్తుంది)

నారా: నేతి నేతి అనుకుంటూ వెడితే ఇంక నేను మిగిలాను. అంటే, మెడ్రాసులో ఒక బుల్లి మేడా, కారూ కొని మామూలుగా దర్జాగా సుఖజీవనం చేయించే పూచీ యిప్పుడు నేను వహిస్తా నన్నాను.

కమల: అసలు సంగతి చెప్పరేం?

నారా: అసలు సంగ తేమిటంటే సీతయ్యా మీ మామయ్య రామభద్రయ్యగా రున్నారు చూడు, ఆయన తాలూకు మీసగొండితనాన్ని—

సీతయ్య: మీసగొండితన మేమిట్రోయ్?

నారా: లంచగొండితన మేమిట్రోయ్?

సీతయ్య: అలాంటిదా?

నారా: అవును. ఆయన మీసాల బూచి వేషం చూసి మన కమలగారు భరించలేకుండా వున్నారు. పోనీ ఆ ప్రకాశిగాడో ఎవడో వాణ్ణి పెళ్ళిచేసుకుని మామగారి యింటికి వెడితే ఈ చర తప్పుతుందేమో అనుకుంటే వాడి బాబు వెంకటకృష్ణయ్యకీ అదే జబ్బు! పెనంమీదనించి వాడేకులలోక్కీ, పొయ్యికి వెళ్ళినా స్వర్గమూ. అవీని: తెలిసిందికాదూ?

కమల: సీతయ్యబావా, దీనికేదైనా తరుణోపాయం చెప్పి తప్పిస్తేనేగాని నా జీవితం దుర్భరమైపోతుంది.

నారా: నాకు మాత్రం?

కమల: నాకీ పెళ్ళిగనక తప్పకపోయినట్టయితే నే నింక యావజ్జీవమూ కుళ్ళవలసిందే.

నారా: నేను ఆత్మహత్యచేసుకోడానికి సంసిద్ధుడనై వున్నాను గదా!

సీతయ్య: అలా బెదిరించకురా నాన్నా అవసరం లేదు. నేను మధ్యాహ్నంనించీ ఈ విషయమే తీవ్రంగా ఆలోచిస్తున్నాను.

కమల: ఏమిటి!

నారా: నిజమేట్రా? నాకు తెలుసు. ఎలాగైనా చుట్ట చుట్టే, సిగరెట్టు సిగరెట్టే!

కమల: ఛీ, అదేమిటండీ?

నారా: ఏం, తల్లక్రిందులుగా అన్నా నేమిటి? అలాగ అయితే సిగరెట్టు సిగరెట్టే, చుట్ట చుట్టే!

సీతయ్య: ఉండండి. అలా పోట్లాడుకోకండి. ఆఁ. నేను ఆలోచించగా, ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది.

కమల: ఏమిటి?

నారా: తట్టిందీ?

సీతయ్య: అది ఆచరణలో పెడితే ఫలించవచ్చు.

నారా: ఆచరణలో పెట్టి తీరుతున్నాం.

కమల: అంతకంటె ఏంకావాలి?

సీతయ్య: రామభద్రయ్య మామయ్య రాత్రిళ్లు ఏ గదిలో పడుకుంటూ వుంటాడు?

కమల: ఎండలు ఎక్కువగా వుంటున్నాయి కాదూ? అందుచేత పెద్దనాన్నగారు రాత్రిళ్లు రోజూ ఈ వుయ్యాలమీదే పక్క వేయించుకుని ఆరుబయట నిద్రపోతున్నారు.

సీతయ్య: బాగుంది. ఇవాళ రాత్రి సరిగ్గా ఒంటిగంటకి మన నారాయణ ఇక్కడికి వచ్చి ఒక కత్తెరతో చప్పుడు చెయ్యకుండా రామభద్రయ్య మామయ్య మీసాలు కత్తిరించేస్తాడు.

నారా: నేనా?

సీతయ్య: అవును, నువ్వే

నారా : ఆయన మెలుకువ వచ్చి లేచి చావ తంతా డేమో, ఆలోచించావురా, అబ్బీ!

కమల : (దీనంగా) నారాయణగారూ! నా కోసం.

నారా : సరే మరి. ఇంకతప్పదు-ఆజ్ఞ శిరసా వహించాం. కమల గారి కోసం ఉరి స్తంభం ఎక్క మన్నా సిద్ధం!—అసలు నాకుకూడా ఆ రామ భద్రయ్య మామయ్యగారి మీసపుంజం వెనుక ఏయే వింతజంతువులు దాక్కుని వున్నాయో పరిశోధన చెయ్యాలనే కుతూహలం కొరుక్కు తింటోంది.

సీతయ్య : పూర్తిగా కత్తిరించక్కర్లేదులే; తిర పతి పని చేస్తేచాలు.

నారా : ఇంక మొదలెట్టాక నన్నాపడానికి బ్రహ్మతరంకాదు; చూస్తావుగా?

కమల : ఇలా చెయ్యడం వల్ల వచ్చే ఫలితం?

సీతయ్య : మామయ్య రేపు పొద్దున్నే లేచి తనకి అతి ప్రీతికరమైన, గర్వకారణమైన మీసాల జత అంతర్ధానమైపోయిందని తెలుసుకుంటాడు.

నారా : నిప్పులు తొక్కిన కోతి అయిపోతాడు!

సీతయ్య : తనతో పోటీకి మీసాలు పెంచుతూ వున్న వెంకట కృష్ణయ్యగారు ఓర్వలేక మామయ్య మీసాలు రాత్రి నిద్రపోతూవుంటే దొంగతనంగా కత్తిరించే శాడని తప్పకుండా ఊహించి సదరు వెంకట కృష్ణయ్యగారి మీద మామయ్య ఉగ్రుడై పోయినవాడై బావమరిదికి బుద్ధిచెప్పి, కమలని ఆయన కొడుక్కి యివ్వనని ఖండితంగా చెప్పి ఇంటిలో నుంచి గెంటించివేస్తాడు!

కమల : (చప్పట్లు కొడుతూ) భేష్! భేష్! బాగుంది, బాగుంది! సీతయ్య బావా!

సీతయ్య : దీనివల్ల రెండు ప్రయోజనాలు. కమ లకు ఇష్టంలేని యీ పెళ్ళి (కృతజ్ఞతతో) తప్పి పోతుంది. రామభద్రయ్య మామయ్య భయంకర మైన మీసాలకి స్వస్తి అయి మనకి కన్నులపండగ చేకూరుతుంది.

నారా : ఒక్క దెబ్బతో రెండు పిట్టలు, ఏమిటి?

సీతయ్య : ఒక కత్తెరతో రెండు మీసాల పక్షులు! ఎలావుంది, కమలా?

కమల : అమోఘంగా వుంది, సీతయ్య బావా. నీకు నేను ఆజన్మాంతం కృతజ్ఞురాలిని—ఇంక మన నారాయణగారి చాకచక్యం మీద ఆధారపడివుంది కార్యమంతాను.

నారా : స్త్రీల మానరక్షణ విషయంలో నారాయణ ఇంతవర కెన్నడూ వెనుకంజ వెయ్యలేదు. ఇప్పుడు అసలే వెయ్యడు-మన ఆయుధమంజూష సిద్ధంగా వుంది కాదురా, సీతయ్యా? ఏదీ—క్షమించాలండి— పొడీ కత్తెరా, లంటసం ఇత్యాదులు, పనిముట్లు?

సీతయ్య : ఇవాళ రాత్రి గడియారం సరిగ్గా ఒంటిగంట కొడుతూవుంటే—ఈ తూగుటయ్యాలే రంగస్థలం. తెలిసిందికాదూ?

నారా : O. K. —బౌవౌ! బౌవౌ! చిఙక్, ముఙక్!!

నాలుగవ రంగం

(అరాత్రి : గడియారం ఒంటిగంట కొడుతుంది కీచురాళ్ళధ్వని, దానినిమించి గుర్రుపడుతున్న సవ్వడి —)

నారా : ఆహా! ఈ వెన్నెల తోటలో ఆరు బయట తూగుటుయ్యాలమీద ఎంత సుఖంగా గుర్రుపట్టి నిద్రపోతున్నాడు, కుర్రాడు. ఈయన మీసకోశం ఎక్కడవుందా అని ఇప్పుడు నా మీమాంస!—ఓహో, ఈ మీసాల గుబురులో ఎలు గురు పురుగులు యధేచ్ఛగా తపములాడుకుంటూ దాగుడుమూతలో, "నాకోక్కో", ఏదో ఎలా ఆడు కుంటున్నాయో!-నారాయణా, శస్త్రం ధరించు, ఆల సించకు! హృదయమా. ఒక్కక్షణం దడదడ లాడకు; మంచిదానవు!

(కత్తెరతో కత్తిరించిన చప్పుడు)

(గుడ్లగూబ కూస్తుంది)

నారా : హరి, దీన్ని తగలెయ్య! వెధవ గుడ్ల గూబ ఇప్పుడే కుయ్యాలీ :

(మళ్ళీ వొకసారి కత్తిరించి) ఇంక చాలు!

(ఎండుటాకులమీద నడిచిన చప్పుడు)

(నిద్రపోతున్నవ్యక్తి ఒకసారి గొంతుక సవరించుకుని మళ్ళీ గుర్రు పడతాడు)

ఐదవ రంగం

(మర్నాడు ఉదయం)

సీతయ్య : ఏంరా, నారాయణా, రాత్రి పని సక్రమంగా చేసినట్టేనా?

నారా : ఓ, నిర్ణీతకార్యక్రమం ప్రకారం, నిరంతరాయంగా, తు. చ. తప్పకుండా నెరవేర్చాననుకో. చూస్తావుగా, రామభద్రయ్య మామయ్యగారి ముఖారవిందం. తరువాత జరగబోయే ఫార్సును? తిన బోతూ రుచెందుకు?

సీతయ్య : అయితే, అక్కడికి మనం చెయ్యవలసింది తృప్తికరంగా కొనసాగించామన్నమాట. బాగుంది—ఇలా కూర్చో. కమల లోపల కాఫీ తయారు చేయిస్తోంది. తెస్తుది.

నారా : వెంకట కృష్ణయ్య బావుగారు తెస్తుంది రేరీ?

సీతయ్య : అన్నట్టు, వచ్చేటప్పుడు కాఫీకి పిల్చుకొద్దామని ఆయన గదిలోకి చూశాను. లోపలలేడు. అలా తోటలోకిగాని వెళ్ళలేదుకద, కొంపతీసి?— అదేమిటి?!

నారా , ఏది, ఏమిటి?

సీతయ్య : అదుగో, రామభద్రయ్య మామయ్య, కేవలంనిండు మీసాల బూచిలాగ ఇలాగే వొస్తున్నాడు. అదేమిట్రా, ఆయన మీసాలలో ఒక వెంట్రుకైనా చెక్కు చెదరలేదు!

నారా ; నిజమే! కొంప మునిగిందిరా, సీతయ్యా. ఎలా గిప్పుడు

సీతయ్య ; నువ్వు చేసిన ఘోర పొరపాటు గుర్తించావా?

నారా , నే నేమీ పొరపాటు చెయ్యలేదురా నీ తోడు! పోనీ కలగన్నానేమో అనుకుంటే రాత్రి అంతసేపు పట్టుదలతో ఆ మీసాలు కత్తిరించినందుకు నా చేతి వేళ్లు ఎలా బొబ్బలెక్కి మండు

తున్నాయో ఇంకా చూడు. ఒక పెద్ద పండిన వరి చేను కోసినంత పని జరిగింది!

సీతయ్య : నువ్వు మీసాలు చాకచక్యంతో కత్తిరించిన మాట వాస్తవమే. అయితే అవి రామభద్రయ్యగారివి కావు వెంకటకృష్ణయ్యగారివి! అర్థమౌతోందా?

నారా : ఏమిటి, వియ్యంకులిద్దరూ కలిసి ఆ ఉయ్యాలమీద నిద్ర చేశారంటా వేమిటి?

సీతయ్య , అదే నాకూ బోధపడటంలేదు. ఐనా నువ్వేమీ మాట్లాడకు. ధైర్యంగా అంతా చూస్తూ వుండు. భయం లేదు. ఇదుగో మామయ్య!

రామభద్రయ్య , ఏంరా సీతయ్యా కమల ఇంకా కాఫీ తయారు చేయించలేదూ?

సీతయ్య , చేయిస్తోంది. ఏమిటి మామయ్యా ఇవాళ ఇంత పొద్దున్నే లేచావు? నీకు మామూలుగా కొంచెం ఆలస్యంగా లేవడం అలవాటు కాదూ?

రామ ; ఏమిటోరా, రాత్రి, వేరవది అలవాటు లేనిది ఆ గదిలో పడుకుంటే ఉక్కచేత సరిగ్గా నిద్ర పట్టింది కాదు.

సీతయ్య ; గదిలో ఎందుకు పడుకున్నావుమరి? తోటలో ఉయ్యాలమీద పడుకుంటావని చెప్పింది కమల?

రామ , రోజూ ఆ ఉయ్యాలమీద పడుకోవటమే అసలు అలవాటు. కాని, నిన్న వెంకటకృష్ణయ్య బావగారు వచ్చాడు కాదూ? అందుకు గౌరవంగా వుంటుందనీ, హాయిగా నిద్రపోతాడని నిన్న రాత్రికి ఆయన్ని ఆ వుయ్యాలమీద పడుకోమన్నాను.

నారా: అదీ—

రామ: "అదీ" ఏమిటి?

సీతయ్య: అబ్బే నీ బంధు మర్యాదకి మెచ్చుకుంటున్నాడు మన నారాయణ.

రామ; అవా? గృహస్థు కంతకంటె కావలసిందేముంది చెప్పు? ఆయనకి మాత్రం నా మీసాలని చూస్తే ఎందుకో అకారణ ద్వేషమూ అసూయాను. ఏదీ బావగారు? రాత్రి ఆ వుయ్యాలమీద చల్లగాలికి

హాయిగా నిద్రపట్టిపోయి ఇంకా మెలకువ రాలేదను కుంటాను. నాకు తెలుసు ఆ సుఖం.

సీతయ్య: అదెవరు?

రామ; ఎవరు చెప్మా నాకోసం ఇంత పొద్దున్నే మించిపోయినట్టు వస్తున్నాడు? నన్ను కాఫీ అయినా సరిగ్గా త్రాగ నివ్వరు వెధవ సంత! ఆ(, ఆ(!

సీతయ్య: అదేమిటి వెంకటకృష్ణయ్య బాబుగారే!

రామ: అరే ఏమిటి నా కళ్ళని నేనే నమ్మలే కుండా వున్నాను!

వెంకట కృష్ణయ్య:(కోపంగా) అయితే ఇదన్న మాట మీ కుతంత్రం?

రామ: ఏమిటి బావగారూ మీరేనా? చూసి ఆన వాలు కట్టలేకపోయాను. మీసం తీసేశారే! ఇప్పుడు బాగుంది. మంచి పని చేశారు! అబ్బే నే చెప్ప లేదూ? అదీ వొక మీసమే? మీసం తీసేస్తేనే చాలా బాగుంది మీ మొహం!

వెంకట కృష్ణయ్య: (మండిపడుతూ) చూడు రామభద్రయ్య. నీతో అయిదు విషయాలు చెప్ప దల్చుకున్నాను— మొదటిది, నీ యింటికి వచ్చిన అమాయికుడైన అతిథిని అవమానించడానికి వెను దియ్యని నీచుడవు నువ్వు! రెండోది నా మీసాల ముందు నీ మీసాలు ఎందుకూ పనికిరావనే ఏడు పుతో వోర్చలేని దరిద్రుడవు నువ్వు! మూడోది, అందుకని నా మీసాలు దొంగతనంగా కత్తిరిం చెయ్యడానికి వీలుగా వుండేటట్టు మర్యాద అని వంక పెట్టి నన్ను రాత్రి తోటలో ఉయ్యాలమీద పడుకోమని బలవంతంచేసి మొహమాట పెట్టిన కుత్సితుడవు నువ్వు! నాలుగోది,—

రామ: ఉండండి కొంచెం కాఫీ పుచ్చుకుందురు గాని—

వెంకట కృష్ణయ్య: నాకు నీ కాఫీ అక్కర్లేదు. ఈ కాఫీలతో అంత సులువుగా తేలిపోయే విషయం కాదిది— నాలుగోది, నే నిప్పుడు తిన్నగా ఒక పెద్ద లాయరు దగ్గరకు వెళ్ళి నీమీద "డామేజీ" దావా వేయిస్తున్నాను!

అయిదోది—

రామ: కాని, బావగారూ, ఇదంతా నే నేదో చేయించినట్టు అపోహ పడుతున్నట్టున్నారు. జరిగిన దానికి నేను విచారించటంలే దనుకోండి. అంత వరకు అద్భుతంగా వుంది. మీ దిక్కుమాలిన మీసాలు పోయినందుకు సధ్యాదేశంలో కరవుకాట కాలు తగ్గిపోవచ్చునని నా విశ్వాసం.

వెంకట కృష్ణయ్య: నీ బొర్లి మీసాలూ నువ్వూ సాక్షాత్తు ఎలుగుబంటి అన్నగారిలాగ వున్నావన్న సంగతి జగద్విదితమే!

రామ: ఇప్పుడు మీ ఉక్రోషంలో, ఉద్రేకంలో ఏమైనా అంటారు క్షమిస్తున్నాను. ఎంత అసహ్య మైనవైనా ప్రాణపదంగా పెంచుకునే మీసాలు పోతే ఎంత బాధగా వుంటుందో నేను ఊహించు కోగలను. అయినా మీ మీసాలు పోవడానికి కార ణం నే నెంతమాత్రం కాదు. రాత్రంతా ఆ తూగు టుయ్యాలా మీ కిచ్చి, నేను నా గదిలో నిద్రలేక ఇదయాను—

వెంకట కృష్ణయ్య: ఇంక నే చెప్పదల్చుకున్న అయిదో విషయం.

రామ; కావలిస్తే వీ శ్ళిద్దర్నీ అడగండి.

వెంకట కృష్ణయ్య; నీ పాపిష్టి యింట్లో యిం కొక్క క్షణమైనా వుండటంలేదు నేను. మీ పిల్లని మా అబ్బాయికి ముమ్మాటికీ చేసుకోనని ఇందు మూలంగా స్పష్టంగా చాటుతున్నాను. అంతకంటే వేరే అప్రతిష్ఠ ఇంకొకటి లేదు. ఇంక నా కంఠంలో ప్రాణం వుండగా మీ గడప ఎన్నడూ తొక్కను. దీనితో మీకూ మాకూ తెగతెంపులు.

రామ; నీకూ నీ మీసాలకీలాగ.

వెంకట కృష్ణయ్య; ఠర్! రామభద్రయ్య, నేను చెప్పిన అయిదు విషయాలూ జ్ఞాపకం వుంటాయి కాదూ?

రామ; ఉంటాయిలే, వెంకటకృష్ణయ్యా—ఓపిక పట్టి ఊరుకొంటున్నకొద్దీ ఏమిటి నీ ఆగడం? ముందు నువ్వు తక్షణం నా యిల్లు వదిలిపోతావా

లేదా? నీ ముదనష్టపు కొడుకు క్కావ్వకపోతే మా అమ్మాయి కింక పెళ్ళి కాదు— ఇంకా అలా—

నారా: శాంతించండి, మామగారూ; ఆయన వెళ్ళిపోయారు!

సీతయ్య: ఈ వెంకటకృష్ణయ్యగారికి మీసాలతోపాటు మతికూడా పోయింది!

రామ: పోయాడా, చచ్చుగాడిద! శని విరగడయింది!—వీడి మీసాలు దేశాభ్యుదయం కాంక్షించే మహానుభావులెవరో కత్తిరించి పారేసి వుంటారని నా దృఢవిశ్వాసం. లేకపోతే, తగుదునమ్మా అని ఏవో మూతిమీద గరికపోచలలాంటివి రెండు వెంట్రుకలు పెంచి వాట్లని గొప్పగా కోరమీసమనీ, కుచ్చుమీసమనీ, బుగ్గమీసమనీ, ధనుర్మీసమనీ తనే స్వయంగా పొగడుకుంటూ ఊళ్ళవెంబడి సిగ్గులేకుండా ఊరేగుతూవుంటే, ఎంత జాతీయభావాలులేని మానవుడికైనా వొళ్లు మండుకు రాదూ? మొత్తంమీద వీడి రోగం కుదిర్చారు ఎవరో పుణ్యాత్ములు; పీడ వదలిపోయింది!—మన కమలపెళ్ళి తప్పిపోయింది—

సీతయ్య: దానికోసం విచారించనక్కర్లేదు, మామయ్యా—

రామ: విచారమా? ఇంకా నయమే! కమలకి పెళ్ళికొడుకులకి లోటు ఏమిట్రా, వెర్రాడా? "కో" అంటే కోటిమంది వస్తారు.

సీతయ్య: నారాయణా!

నారా: "కో" అన్నారు కాదూ?—నాదొక మనవి వుందండీ, మామగారూ—

రామ: ఏమిటి, బాబూ, అది?

నారా: సంపెంగనూనో, ఏదో రాసి చక్కగా మెలితిప్పిన మీ మీసాలను చూస్తున్నకొద్దీ నాకు తనివి తీరటంలేదు; అవి నన్నింతగా ఆకర్షిస్తున్నాయి. ఇంత సొగసైన మీసాలు మనదేశం మొత్తంమీద ఎవరికి లేవని నేను ఘంటాపథంగా చెప్పగలను—మీ ప్రతిద్వంది ఎలాగా నిర్జితుడై, పరాభవంపొంది పారిపోయాడు గనక, మీకు "ఆంధ్ర మీసరి" అనే బిరుదు ప్రసాదించాలని నాకు ముచ్చట వేస్తోంది: నా ముద్దు చెల్లించరూ?

సీతయ్య: (నవ్వుతూ) భేష్, భేష్! సెహబాస్!

రామ: నిజమేనయ్యా, నారాయణా—నా మీసాల పస, విలువ నువ్వు చక్కగా గ్రహించావు: నీకేదైనా బహుమానం చెయ్యాలని నాకు ఊరికే బుద్ధి పుడుతోంది: నీ యిష్టం వచ్చింది కోరుకో, చిన్నవాడా!

సీతయ్య: ఆలోచిస్తావేం? అడగవా, నారాయణా!

నారా: మీ కమలని వివాహం చేసుకోడానికి నాకు అనుమతి యిప్పించండి; నాకంతకంటె ఏమీ అక్కర్లేదు—

రామ: క్షేమన్నావు?

నారా: నేను కమలని వివాహం చేసుకుంటాను!

రామ: అందుకు నీ యోగ్యత?

నారా: నేనొక బీద కవి కుమారుణ్ణి!

రామ: బీదా? ఎంత బీద?

నారా: నేను మీ మీసాలని అభినందిస్తూ, "మీస పంచకం" అని స్తోత్ర రత్నమాణిక్యాలు రచించానండి; కాఫీ అయాక చదివి వినిపిస్తాను.

రామ: నిజమే!

సీతయ్య: నిజమే, మామయ్యా! పద్యాలేమిటి, బహు పసందుగా వున్నాయిలే!

రామ: చూడు, అబ్బాయి—

నారా: నారాయణ అండి—

రామ: నారాయణా!

నారా: అయ్యా?

రామ: నువ్వు పేదవాడనని మొహమాటానికి అని వుంటావని నాకు తెలుసు—

నారా: చిత్తం—

రామ: ఒకవేళ నిజంగా అయినా నాకేమీ లక్ష్యంలేదు; నువ్వంటే నాకు అభిమానం అలా కుదిరింది.

నారా : ధన్యుడ నండి—

రామ ; నువ్వు మా కమలని పెళ్ళిచేసుకోడానికి నా అభ్యంతరం ఏమీలేదు—మీకు నా దీవనలూ, ఆశీస్సులూ, అవీని—కమల అభిప్రాయం కూడా—

నారా ; నేను కనుక్కున్నానండి—

రామ ; ఏమిటి!

సీతయ్య : నువ్వుకూడా కనుక్కుందువుగానిలే, మామయ్యా—

రామ ; అలాగా అయితేను—కమల ఇంకా కాఫీ పట్టుకొచ్చింది కాదేం చెప్మా?—అందాకా ఒక చుట్టముట్టిస్తాను మరి—నీ దగ్గర అగ్గిపెట్టి వుందిటయ్యా?

సీతయ్య ; నిన్నేరా, నారాయణ—

నారా ; ఉందండి—ఇదుగో పెట్రోలు సిగర్ లైటర్!

రాము ; ఏదీ—చాలా చక్కగా వుందయ్యా!

నారా ; దీని మీకు బహుమతీ చేస్తానులెండి-ఉండండి, అలాగకాదు; నేను వెలిగించి యిస్తాను-(సిగర్ లైటర్ వెలిగిస్తాడు)

రామ : (చుట్ట అంటించిన చప్పుడుచేస్తూ) భేష్! ఉండు, చుట్టకొసకి అంటించు—

సీతయ్య ; అదుగో, కమల కాఫీ తీసుకొస్తోంది,

నారా; ఆహా! నా కమలా?

రామ; ఆ(, ఆ(....ఆ(, ఆ((మీసాలు అంటుకు మండుతాయి)

కమల ; ఆ(, ఆ(; అయ్యో, అయ్యో! మీసాలు, మీసాలు! (కప్పులూ, సాసర్లూ ఎత్తివేస్తుంది; అవి క్రిందపడి పగిలిపోతాయి)

సీతయ్య ; ఒరే, ఒరే, నారాయణ, కమలకేసి చూస్తూ ఎంతపని చేసేశావో, చూడు!

నారా; ఆ(, ఏమిటి? (పారిపోతాడు)

రామ; పట్టుకో! పట్టుకో! ఆ నారాయణని పట్టుకో, చూస్తావేంరా, సీతయ్యా?

సీతయ్య ; ఏడి?-చూస్తావేంరా, నారాయణ? బల్ల క్రింద దూరు; మామయ్య హత్య చేస్తాడు; తప్పదు.

రామ ; పట్టుకో; వాడి తోళ్లు వొలిచెయ్యి! బుర్ర చితకపొడు; వొస్తున్నా—

సీతయ్య ; మరీ అంత పరధ్యాన్నం ఏమిట్రా, నారాయణ; నీ దిక్కుమాలిన సిగర్ లైటర్ మంట అతని పెదవులకి బొత్తిగా అంతదగ్గరగా పెడతారా? ఒక్క తృటిలో చూస్తోండగా మామయ్య మీసాలు, పాపం, ఏలా చురచుర అంటుకు పోయాయో!—ఏడీ మామయ్య?

కమల ; ఆ(, ఆ(, పెద్దనాన్నగారు! పెద్దనాన్న గారు! (కుక్క మొరుగుతుంది)

నారా ; కప్ప, కప్ప! బోదురుకప్ప!

సీతయ్య ; అ(, విసరకు మామయ్య. చుట్ట బూడిద దులుపుకునే గాజు గిన్నె విసరకు! బ్రహ్మ హత్యాపాతకం

(రామభద్రయ విసిరిన ash-tray గోడకు తిగిలి ముక్కలు ముక్కలై పోతుంది.)

కమల ; అమ్మయ్య! (నిట్టూర్పి) పాపం, నారాయణగారికి తగలలేదు బ్రతికాం.

రామ ; ఏడీ విశ్వాసఘాతకుడు! స్వామిద్రోహి ఏడీ,

సీతయ్య ; ఉరికెయ్యరా, నారాయణా, ఆ కిటికీ లోపించి బయటికి వురికెయ్యి. సందేహించకు!—భయపడకు, కమలా, ఫరవాలేదు.

కమల ; పెద్దనాన్నగారు! ఉండండిఉండండి—ఆ, కాఫీపాట్ విసరకండి, బ్రద్దలై పోతుంది. ఆ(, ఆ(!

(కుక్క మొరుగుతుంది, కాఫీపాట్ గోడకి తగిలి ముక్కలైపోతుంది.)

నారా ; ఇంక శాంతించండి, రామభద్ర మామయ్యగారూ!

రామ ; వాణ్ణి పట్టుకోవేంరా, సీతయ్యా, చూస్తావేం?

నారా ;లాభంలేదు—మీ రొక్క అడుగుముందు వేశారో నే నీమేడ కిటికీలో నుంచి క్రిందికి వురి

తేస్తాను, ఇంత ఎత్తునించి క్రింద పడ్డాక రాళ్ళమీద పడి నా భౌతిక దేహం ash-tray లాగా—

సీతయ్య : కాఫీపాట్ లాగా.

నారా : ఆఁ, కాఫీపాట్ లాగ తుత్తునియలైపోయి నా ఆత్మ పంచభూతాలలో కలసిపోతుంది. పోలీసులు వచ్చి నన్ను హత్యచేశారని తెలుసుకుని మిమ్మల్ని ఉరిస్తంభం ఎక్కిస్తారు! కావలస్తే కమల గారూ, సీతయ్య సాక్ష్యం ఇస్తారు.

రామ ; నిజమేట్రా, సీతయ్యా?

సీతయ్య : వాడి దసలే మొండి సాహసం. మామయ్యా—తల్చుకుంటే ప్రేమ కోసం ఎంత వోహాయిత్యం చెయ్యడానికైనా వాడు వెనుదియ్యడు.

నారా ; నామరణ వాఙ్మూలం వినండి. మీ మీస రాజినేను బుద్ధిపూర్వకంగా ధ్వంసం చెయ్యలేదు. కాఫీతెస్తున్న కమలగారికేసి చూస్తూ తన్మయత్వం చెంది ఆ సిగర్‌లైటర్ మంట మీచుట్టకి బదులు మీసాల చిగుళ్ళకి అంటించి వుంటాను. అది కేవలం ప్రమాదం.

రామ : ప్రమాదమా? ప్రమాదమా? అయితే మాత్రం ఇంత ప్రాణపదంగా పెంచుకుంటున్న నా మీసాలు అంటుకుంటా యేమో అనే బుద్ధి వుండక్కర్లేదూ? అంత బొత్తిగా కళ్ళు మూసుకుపోనా?

నారా ; తప్పుడు మాటలనకండి-కళ్ళుమూసుకుపోవడంకాదది. ప్రేమతన్మయత్వమూ, అదీని-నేను కమలని ప్రేమించినంతగా మీరెవరినైనా ప్రేమించి వుంటే ఆ అనుభవం మీకు తెలుస్తుంది.

రామ ; అదొకటి కూడానా?

కమల ; అవునండీ పెద్దనాన్నగారు!

సీతయ్య ; నిజమే, మామయ్య. ఇప్పుడైనా మనకమలని నారాయణకిస్తే బాగుంటుంది.

రామ ; ఇంతవరకూ వచ్చాక ఇవ్వనూ మరి? సిగ్గు లేకపోతే సరి!

సీతయ్య : ప్రేమా, దురదా సిగ్గు నెరగవంటాడు మానారాయణ. ఏంరా, నారాయణ?

నారా : మీసాలులేకుండా వుంటే మీమొహం ఎలావుటుందో చూడాలని అసలు నాకు కుతూహలం పీక్కుతింటోంది. అది ఇన్నాళ్ళకి తీరింది.

సీతయ్య : అయితే నువ్వు అనుకున్నట్టు వుందిట్రా, ఆయన మొహం, నారాయణా.

కమల : పెద్దనాన్నగారి మొహం ఇప్పుడు చాలా బాగుంది కాదండీ?

నారా : ఎలా వుందో చెప్పమంటారా?

కమల : చెప్పండి, సంశయించకండి—

నారా : నూతిలో నాని ఉబ్బిన పెద్దబోదురు కప్ప లాగవుంది।

రామ : ఛ, నోరుముయ్యి।

కమల ;
సీతయ్య ; } (పకపక నవ్వుతారు)

రామ : ఎందుకలా వెకిలిగా నవ్వుతారు? (కోపంగా) నారాయణా, నిన్నునేను క్షమిస్తే ఆ కిటికీలో నించి వురకడం మానేసి లోపలకి వస్తావా?

నారా : నా మీద ప్రేమచేతకాదు. పోలీసులూ, ఉరిస్తంభం అంటే భయంచేత నన్ను రమ్మంటున్నారు, నాకు తెలుసును. ఆఖరిసారి అడుగుతున్నాను. నాకు కమలనిచ్చి పెళ్ళిచేస్తారా?

రామ : ఓరి, నీ బెదిరిపు మండిపోనూ నీ బెదిరింపులకి లొంగిపోయే ఘటం కాదెరి. ఏమనుకుంటున్నావో। నువ్వు క్రిందపడి ప్రాణాలు తీసుకున్నా నాకేమీ భయంలేదు. కమలని నీకిచ్చి పెళ్ళి చెయ్యాలా ఇంకాను? అక్కడే వుండు, వొస్తున్నా నా స్వహస్తాలతో నీ ప్రేగులు బయటికి తీసి మెడలో హారాలుగా వేసుకోకపోతే నాపేరు రామభద్రయ్య కాదు।

నారా : మీకంత శ్రమ అక్కర్లేదు-సరేమరి ఆటాపీటాచెల్లంగోరీ। నీకూనాకు మాటల్లేవ్। కావ్, కావ్!!—కమలా, సెలవు।—జై, పరమేశ్వరా, (క్రిందకి వురుకుతాడు)

కమల ; అయ్యో, అయ్యో! నారాయణగారూ!—సీతయ్య బావా।

రాము ; నిజంగా పురికేళా దేమిట్రా, సీతయ్యా? చూడు—వీడి వోహాయిత్యం ఇదైపోను।

సీతయ్య : (కిటికిదగ్గరకు వెళ్ళి) విచారించకు, కమలా—లేదు, మామయ్యా ఆ కిటికీ ప్రక్కని, పండగకి గోడలకి వెల్లవెయ్యాలని నిచ్చెన వేసి పెట్టారు-దాని మీదనించి, అదుగో, సురక్షితంగా దిగి విశ్రాంతగా వీధి వెంట నడిచి వెళుతున్నాడు।

రాము : ఏమిటి, పట్టుకో। వాణ్ణి చంపండి, పొడవండి.

సీతయ్య ; ఇంక లాభంలేదు, మామయ్యా—

కమల : (నిట్టూర్చి) పోనీ, సురక్షితంగా వున్నారుకద? భయంతో నాప్రాణాలు చలించిపోయాయి।

సీతయ్య ; కోటు అయినా వలగలేదు, కుర్రాడికి।


రాము ; సీతయ్యా।

సీతయ్య ; ఏం, మామయ్యా?

రాము ; నువ్వు తక్షణం వెళ్ళి. వాణ్ణి సజీవంగా గాని శవంగా గాని పట్టుకు తీసువచ్చినాకు పప్ప చెపుతానని వాగ్దానం చెయ్యి. లేకపోతే నాకు ఆత్మశాంతి వుండదు।

సీతయ్య ; ఇప్పుడే వెడుతున్నాను, మామయ్యా నువ్వు విశ్రాంతగావుండు. కమలా!దిగులుపడకు—వస్తాను!—

రాము ; ఆంధ్ర మీసరిట, ఆంధ్రమీసరి। హుం, ఎంత అప్రతిష్ఠ!!



నావలో

నాగరాజామాత్యుడు

(కోటిపల్లి రేవులో)

నావవాడు : (కేక)- ఒహో ... వోయ్ ! నావరాసీ, నావరాసీ, నావరాసీ ! జనం కూకున్నారు.

(నావ వొడ్డుకి వస్తుంది)

నావవాడు : ఆ మొసవట్టుకో- ఆ మొసవట్టుకో - కాయి-నావ వొడ్డెక్కేసి రాళ్ళకు కొట్టుకుంటది. ఆఁ అద్గదీ- అలాగ-అలా సూత్తావేంరా, గంగా- గెడెయ్యవేం ?

గంగడు : ఆర్దెబ్బ, ఏం వొరదరా ! వొడ్డెని కూడా గడ కందటంలేదు. నీళ్ళల్లో గడవేసినానని వొడ్డెక్కి చేరుస్తన్నాడు.

నావవాడు : ఆ తాడిలా గిరెయ్యి- అదీ- ఈ పాలి రానీ- నావ వొడ్డుని డీకు్కంటుంది- అరరే!—ఆఁ. ఎక్కండి, బాబూ, పంతులుగారు. పాపం, శానసేపు కనిపెట్టుకూ్కకున్నారు. ఎక్కండమ్మా, ఎక్కండి.

పంతులు : కొంచెం పట్టుకోరా అబ్బీ.

గంగ : అయ్య- రాండి.

(నావలో జనం ఎక్కుతారు)

పంతులు: ఇంక పోనియ్యరా, బాబూ, నావ. ఈ గోదావరి దాటి మేమింకా చాలా దూరం పోవాలి.

నావవాడు : ఎందాకా యెల్లాలండి?

పంతులు : అబ్బో అమలాపురం వెళ్ళాలి. కోర్టు తెరిచే వేళకి చేరగలనో లేదో !

నావవాడు : ఇదుగో ఎల్లిపోదారండి. ఏరా, గంగా ?

గంగ : ఎల్లిపోదారండి. ఒక్క చణం. ఇంత లోకి కాకినాడ కారు వొచ్చేస్తది.

పంతులు : సారి, ఇంకా అదో తరవాయుందీ? అయితే ఇవాళ నేను-

(కారు కూస్తుంది)

గంగ : అదుగోనండి, కారు కూడా వొచ్చేసింది. ఎలాగండి, బాబూ, మరి మేం నాలుగు డబ్బులు సంపాదించుకోకపోతే-'

నావవాడు : రండి అబ్బాయిగారు, ఆ పెట్టిలా గందియ్యండి.

పంతులు : అబ్బ, ఈ యేడేం వరద. నీళ్ల కారుస్టాండు దాకా కూడా తోసుకుపోయాయి!

(అబ్బాయి నీళ్ళల్లో నడుస్తూ వచ్చి ఒక్క గంతువేసి నావ ఎక్కుతాడు. నావ ఊగిసలాడుతుంది. ఒడుదుడుకుగా అంతా 'ఆఁ ఆఁ' అంటారు.)

పంతులు : ఏయ్, కళ్లు కనపట్టంలేదూ? నా బట్టలనిండా యీ బురద నీళ్ళన్నీ పోసేశావు?

అబ్బాయి : చూళ్లేదండి, తాతగారు క్షమించాలి. (నీళ్లల్లో కాళ్లు కడుగుతాడు)

పంతులు : మరి ఆ కళ్ళెందుకు? పైగా 'తాతగారూ' అంటావు, తాతగారు. నీ మతానికి నువ్వేం ఇంకా కుర్రగుంట వనుకుంటున్నావేమిటి?

నావవాడు : సిన్నతనమండీ బాబు, ఊరుకోండి. ఏదో అవి పోయింది.

పంతులు : మరీ అంత ఒడుదుడుకా అంట? ఇంతమంది ఆడాళ్లూ, పిల్లలూ వున్నారు; పడవ ములిగిపోతేనో? ఆ మాత్రం జ్ఞానం వుండక్కర్లేదూ? మళ్ళీ చదువుకుంటోన్నట్టున్నావు?

అబ్బాయి : మళ్లీనా, మళ్లీనా—ఏం చదువు లెండి. నాకే విసుగెత్తిపోతోంది.

గంగ : పడవ ములిగిపోటాని కిక్కడ లోతు సాలదు లెండి. అయినా మేమువుండి అంతలోకి ఆలా ములిగిపోనిత్తామండి?

పంతులు : చాల్లే, నేర్చుకుపోయావు. ములిగిపోయాక నువ్వూ నేనూ చేసేదేమి టింక?

అబ్బాయి : చూడండి అయ్యా, మరి మీ నామధేయ మేమిటోను. నే ను మి మ్మ ల్ని క్షమాపణ కోరాను. నే నిన్ని బురదనీళ్లు తీసి మీమీద కావాలని పొయ్యలేదు——

పంతులు : అదోకటి కూడానా.

అబ్బాయి : నెల్లాళ్లనించి ఆ కాకినాడలో హోటేలు మెతుకులు కొరికికొరికి ఎప్పుడింటికి వెళ్ళిపడి మా అమ్మ వండిన శుభ్రమైన చారూ అన్నమూ ఇంత తింటానా అన్న ఆదుర్దా కొద్దీ——

పంతులు : ఆఁ అఁ. నువ్వు హోటేలు మెతుకులు తినకపోతే వుద్ధరించావు మమ్మల్ని.

నావవాడు : మీ 'కేవు'ఇప్పించం డబ్బాయి గారూ, నావిడిసిపెట్టేత్తా నింక.

అబ్బాయి : ఓహో-ఎంత?

నావవాడు : ఎంతేంటండి? మీ కెరగ రేంటి, కొత్తా?

అబ్బాయి : అబ్బ, నే నెరగనులే. చెప్పవోయ్ ఎంతోను?

నావవాడు : మామూలే, రెండణాలండి మనిసికి.

అబ్బాయి : (పర్సులోంచి రెండణాలు తీసి యిచ్చి) హరి-నావలకీ గోదావరికీకూడా వచ్చి పడింది కాబోలు ఈపాడు కరువు.

గంగ : మరి బియ్యపు నూకలకీ, కూరగాయలకీ వచ్చినట్టేనండి.

నావవాడు : ఏరా, ఇంకెవరూ రారంటావా?

పంతులు : ఇంకైనా పోనీరా దేవుడా, ఇంకెవరొస్తారు?

నావవాడు : అయితే, తోసేద్దావంటావా?

అబ్బాయి: తోసేద్దామూ అంటున్నావు, మళ్ళీ యీ ఊబిలో దిగి నన్ను తొయ్యమంటావేమిటి కొంపతీసి - అసలే -

పంతులు : ఇంకా ఎన్ని పాట్లున్నాయో మనకి ముందు.

అబ్బాయి : అలాగే వుందండి. మన ప్రయాణంకూడా నా పరీక్షలాగేవుంది. ఇందాకా బస్సులోనూ అంతే -

పంతులు : బస్సులో చెయ్యవలసిందే పరీక్ష.

అబ్బాయి : అదికాదండి, నేను చెప్పబోయింది. నే నిప్పుడు కాకినాడనించి సెప్టెంబరు పరీక్షలకి వెళ్లి వస్తున్నాను. మొన్న మార్చిలో నేను ఇంటర్ ఫేలయినాను.

పంతులు : మరేం ములిగిపోలేదు.

అబ్బాయి : అదేనండి నా వాద నా ను. ఈ సదభిప్రాయం మా నాన్నకుంటే బాగుండును. మళ్లీ తనూ ఫెయిలయాడుట చిన్నప్పుడు పరీక్షలు. (సిగరెట్టు తీసి) తమ దగ్గిర అగ్గిపెట్టి వుందా ?

పంతులు : మన కింకా అగ్గిపెట్టెలు కూడా ఎందుకు? మా డబ్బాయి, ఇంక అధిక ప్రసంగం చెయ్యక నన్నాట్టే రెచ్చకొట్టకు——లేకపోతే...

అబ్బాయి : ఆదేమిటండి, అలా తప్పట్టుకుంటారు? పోనీ మీ దగ్గరలేకపోతే - ఏదో మర్యాదగా...

పంతులు : నువ్వు చేసిన మర్యాద చాలు.

అబ్బాయి : నన్నింక మీరేం క్షమిస్తారు? అన్నట్టు అగ్గిపెట్టి నా దగ్గరే వుండాలి. (సిగరెట్టు వెలిగిస్తాడు) ఈ హోరుగాలిలో...

నావవాడు : గం గా, ఇంక లాభంలేదురా, యీ తాడట్టుకో (తాడు విసురుతాడు నావ మీదికి). నేను తోసేసి ఎక్కుతాను. (తోస్తాడు) ఊఁ...హు. ఏలేయాల. ఏలేయాల. దీ - గెడింక తీసేసి తెడ్డు మెడ్డించు. (నావ కదలుతుంది. నావవాడు నీళ్ళల్లో కాళ్లు జాడించి ఎక్కుతాడు.)

పంతులు : యీ కోటిపల్లి దగ్గర గోదావరికో వంతెన కట్టించితే ఎంత బాగుండును!

అబ్బాయి: గోదావరి వంతెనంటున్నారు మీరు: మా నాన్నగారు పంచాయతీ బోర్డుతో హోరాహోరీని యుద్ధం చేస్తూ ఇప్పటికి మా యింటిముందున్న మురికి కాలవకి సిమెంటు చేయించలేకపోయారు.

పంతులు: భేష్. గోదావరి వంతెనకీ మీ యింట్లో మురుక్కాలవలకీ ముడెట్టావు నయంకాదూ—

అబ్బాయి: అదికాదండీ తాతగారు—

పంతులు: అదుగో, మళ్ళీ—

అబ్బాయి: అదే, ఇక్కడికి అయిదేళ్లనుంచి ఆలమూరుదగ్గర గోదావరిమీద వంతెనకట్టాలని ప్రభుత్వంవారు యోచిస్తున్నారు— ఇంతవరకు-

పంతులు: అవును సుమా—

నావవాడు: కూంతసే పూరుకోండయ్యా, బాబు, నావ నడి వరదలోకి పోతోంది. ఒరే గంగా, అలాగే మెడ్డించడం? అపట్టంలేదూ నావ వాలుకి లాగేత్తోంది. వోల్లదుగో, అద్దరిని ఆ సెట్టుకేసి పట్టేహేయ్.

అబ్బాయి: ఓహో. ఏం వడి! గంటకి అరవై మైళ్లుంటుం దేమో, ఇది.—వా డెవడో యీ మహాప్రవాహంలో ఎలా యీదుకుపోతున్నాడో!

గంగ: కొట్టుకొచ్చే పుల్లలకోసం యీ అవిదంతా పడాలి, బాబు.

అబ్బాయి: ఇదేం వాసన చెప్మా? ఇలా గుమాయిస్తోంది? నా సిగరెట్టుకి-

పంతులు: ఎన్ని వాసననూనెలు రాసుకుంటే ఏంలాభం?

అబ్బాయి: మీరూ రాసుకున్నారా, వాసననూనెలు?

పంతులు: ఏం నేనెందుకు రాసుకోకూడదు.

అబ్బాయి: ఎందుకు?

పంతులు: నా తలమీద-

అబ్బాయి: తలకి వాసననూనెలు రాసుకుంటే నల్లజుట్టూ, తెలివితేటలు మొలుస్తాయంటారా?

పంతులు: అలాగని పేపర్లలో పబ్లిక్‌గా రాసినవాటిమాటో-

అబ్బాయి: ఏం సత్యకాలం! అవన్నీ నిజమనే.

పంతులు: అయితే పేపర్లలో అబద్ధాలు రాస్తారా?

అబ్బాయి: ప్రత్యేకం అబద్ధాలు కాకపోయినా వాళ్ళ సరుకు నాణ్యం వర్ణించుకోవడం—

పంతులు: ఏమో మరి.

అబ్బాయి: నేను క్రిందటి సెప్టెంబరు పరీక్షకి వెళ్ళినప్పుడు—

పంతులు: ఊఁహుఁ; ప్రవేశకుడవు. క్రిందటి సెప్టెంబరుకి కూడా వెళ్లావూ.

అబ్బాయి: పునాది దిట్టం వుంటుందని—మా నాన్నగారు అది మా కస్తూరివారి ఇంట్లో ఆనుమాయతి అని—

పంతులు. ఏమిటీ?

అబ్బాయి: అవునండి.

పంతులు: నువ్వు మా పరబ్రహ్మం కొడుకువుటా) బాబూ, చెప్పేవుకావు.

అబ్బాయి: అవకాశం లేకపోయిదండి.

పంతులు: ఏమిటీ, నాకీ మందమతి? నిన్నే ఆనమాలు పట్టలేకపోయాను!

అబ్బాయి: మరేనండి.

పంతులు: చూడు, బాబూ చిదంబరం—

అబ్బాయి: కాదు, నేను వెంకటేశ్వర్లునండి.

పంతులు: చూడు, వెంకటేశ్వర్లూ—

వెంక: అయ్యో- నేను సిగరెట్లు-

పంతులు: (నవ్వి) అబ్బే, అలా చెపుతానా? నేనసలు మీ యింటికే సుమా వెడుతూంట.

వెంక: మా యింటిముందు మురుక్కాలవ వుందన్నమాటే గానండి- మా నాన్న చాలా సంతోషిస్తాడండి.

పంతులు: రాశానులే- అయితే ముక్తేశ్వరం ఎంతసేపట్లో చేరతామంటావు?

వెంక: ముప్పావుగంటండి!

(నావ వడిగా పోతుంది.)

పుష్పబాణ విలాసం

శ్రీ బుద్ధవరపు నాగరాజామాత్యుడు

ఒకటవరంగం

[గదిలో ఒక వైపున మంచం, పరుపు వుంటాయి. మరొకవైపున ఒక పెట్టెమీద గుట్టగా పువ్వులు అమర్చబడి వుంటాయి. వాటికి ఒకప్రక్క ఒక చిన్న దీపపు స్తంభంలో దీపం, మరొకప్రక్క అగరొత్తులు వెలుగుతూ వుంటాయి. నారాయణ పెట్టెకి ఎదురుగా కూర్చుని పూజచేస్తూవుంటాడు.]

నారాయణ: ప్రేయసీ! ఈశ్వర సాక్షాత్కారం కోసం భక్తుడు లింగాన్ని పూజించినట్టు, నేను ప్రేమ సాక్షాత్కారంకోసం శ్రద్ధగా నీ ప్రియవస్తువులని సేకరించి పూజిస్తున్నాను. నీ అపార కృపావీక్షణం నాపై ఎన్నటికి ప్రసరిస్తుందో?—హృదయం సమర్పయామి, ఆత్మ సమర్పయామి, నా సర్వస్వంసమర్పయామి.

[గంట వాయిస్తాడు.]

సీతయ్య: (తలుపుకొట్టి) నారాయణా; నారాయణా........! (పిలుస్తాడు.)

నారా: ఆఁ వొస్తున్నానురా, సీతయ్యా. ఆ అతిథిశాల అలంకరించు. సమయానికి వచ్చాడు; ఏదో మునిగిపోయినట్టు, నా ఆరాధనకి అంతరాయం కలిగించడానికి, ఛీ, వీ డెప్పుడూ ఇంతే—పానకంలో పుడకలాగ—వస్తాను. ప్రేయసీ, ఆ సీతయ్యగా డొచ్చాడు—(తలుపుతీసి సీతయ్యని గదిలోకి తీసుకు వస్తాడు.)

సీతయ్య: అదేమిట్రా, ఆ పెట్టి మీద పువ్వులగుట్టలాగ కనిపిస్తోంది. అబ్బా రకరకాల పువ్వులు! ఎక్కడివిరా?

నారా: నాకు వాసనచూడనట్టి ప్రసవాలూ, అవి అంటే ఎంతో ఇష్టం అని నీకు తెలియదుట్రా మరి? (సీతయ్య పువ్వులు కొన్ని తియ్యబోతాడు) ఉండు, వుండు. వాట్ల జోలికి వెళ్లకు, అలా వుండనీ—ముట్టుకోక.

సీత: అదేమిటి! ఏమిట్రా, కురుస్త్రాయన్నట్టు భయపెడుతున్నావు? ఇదేమిటి? ఈ కంచుదీపస్తంభం ఎప్పుడు కొన్నావు? ఇందులో దీపం వెలుగుతోందే. ఇదుగో అగరొత్తులు, హారతీ—ఏమిరోయ్—ఏదైనా పూజ మొదలెట్టా వేమిటి?

నారా: అంటే అదేరా, కొంచెం పూజా అది చేసుకుంటూ, భక్తిగా వుంటోంటే మంచిదని తోచింది; అంతా యీ మధ్యనే, నీతో చెపితే వేళాకోళం చేస్తావని.... ....

సీత: ఇంకా నయమే.

నారా: నాలో యీ పరివర్తనం రావడం నీ కాశ్చర్యంగా వుందికాదూ?

సీత: అదే చూస్తున్నాను.

నారా: పెద్దపెద్ద ప్రవక్తల కందరికీ యిలాగే వాళ్ళ జీవితంలో ఒక శుభముహూర్తంలో, హఠాత్తుగా, అనుకోకుండా, ఇలాంటి అద్భుతమైన మార్పు కలిగిందని మనం చదువుకున్నాం కాదూ?

సీత: ఓహో, అయితే, ఆ పువ్వురాశి క్రింద వేంచేసిన ఆ ఆరాధ్యదేవత ఎవరేమిటి?

నారా: అదంతా వుందిలే. ఇంక అడగకు. నీకూ ఎప్పుడో ఒక పర్వదినం చూసి చెబు తానుగా। అప్పుడు నువ్వు నాకు శిష్యుడవౌదువు గాని.

సీత: అలాగేలే. ఇవాళ పర్వమే. అమావాస్య వెళ్ళిన కొత్త మంగళవారం. (పెట్టెదగ్గరకి వెళ్ళి పరిశీలిస్తాడు.)

నారా: ఉండు. అలా ఆ పూజాపీఠం దగ్గరకి వెళ్లకు. ఏమిట్రా, ఆ మోటతనం, చెప్తోంటేను సీతయ్యా?

సీత: (పువ్వులన్నీ ఇటూ, అటూ తొలగించి) ఏమిట్రా, నారాయణా, ఇదేదో దేవతన్నావు, ఆరాధనన్నావు, నైవేద్యమన్నావు? ఇక్కడేమీ విగ్రహంలేదు.

నారా: విగ్రహారాధనని విజ్ఞులు ఒప్పుకోరు కాదు్ట్రా?

సీత: విగ్రహానికి బదులుగా ఈ కొత్త గుడ్డ ఏమిటి, యీ పువ్వులకింద ఉండు. ఇదేమిటి—ఇది ఎవరిదో జాకెట్టులాగుందే? ఇందులో యీ గాజు ఎవరిది? ఏమిరా మాట్లాడవు.

నారా: సీతయ్యా, నువ్వు అసాధ్యుడవురా? నీతో చెప్పకుండా నేను ఏ శుభకార్యం తలపెట్టినా అది కొనసాగనియ్యవు, ఖర్మం.

సీత: శుభకార్యం సరేలే—అసలేమిటో చెప్పవేం?

నారా: ఎవరితోనూ చెప్పవుకద?

సీత: చెప్పనులే—చెప్పు.

నారా: ఈ గాజు నేను సంపాదించానులే.

సీత: ఎవరిదగ్గరనించి?

నారా: గాజులపెట్టి దగ్గరనించి—

సీత: మరి యీ జాకెట్టు? నీ ఆది ఇచ్చుకుని కుట్టించుకున్నావా?

నారా: నా కెందుకురా జాకెట్టు; వెర్రాడా?

సీత: పూజ చెయ్యడానికి—

నారా: ఒరే నీదగ్గర దాచడమెందుకు? సుశీల నెరుగుదువు కాదూ?

సీత: సుశీలా, నువ్వు ప్రేమిస్తున్నానని చెప్పినవాళ్ళల్లో యీవిడ నూటవొకటో ఆవిడ అనుకుంటాను?

నారా: ఒరేయ్, సీతయ్యా, ఇతర విషయాల్లో నువ్వెంత తెలివైనవాడవైనా, ప్రేమ విషయంలో నువ్వు వట్టి మూర్ఖుడవురా — ఆ లాలిత్యము, ఆ సౌకుమార్యము, ఆ మార్దవమూ—

సీత: దానికేంలే—

నారా: నే నసలు ఈ సుశీలనే కాదు్ట్రా మరి ప్రేమిస్తోంట; పిచ్చినాన్నా!

సీత: అలాగా? ఆ సంగ తెందుకొచ్చిందిప్పుడు?

నారా: వొస్తున్నా—ఇందులో విశేషమేమిటంటే సుశీలకూడా నన్ను ప్రేమిస్తోందిలే: దానికి దృష్టాంతంగా, తార్కాణంగా, అంటే స్మారక చిహ్నంగా యీ జాకెట్టూను, ఒక ప్రణయలేఖను పంపించింది నిన్న నాకు—

సీత: ఎందుకు?

నారా: ఇంతే మరి నీ తెలివి? మేము సాక్షాత్తూ కలుసుకునేదాకా, యీ అపరూప వస్తువుని నాదగ్గర నిక్షేపించి వుంచుకోమని—

సీత: అదా, నిన్న నీ కేదో పార్సిల్ వచ్చిందన్నాడు, స్వామిగాడు? అయితే ఆ

కిన్నెర

జాకెట్టునా నువ్వింత భక్తిశ్రద్ధలతోటి పూజిస్తోంట?

నారా: అది నా ప్రాణంరా సీతయ్యా: నా జీవగఱ్ఱ, నా ప్రేమధనం. ప్రేమయొక్క అమూల్యత, దాని అంతరార్థం నీ కర్థంకావురా, సీతయ్యా. ఆ జాకెట్టు మడతలలో నాకు సుశీల సాక్షాత్తూ రక్తమాంసాలతో గోచరిస్తుంది; తెలుసా? ఇది ఆమె మృదుమధుర శరీరాన్ని సంభావించి వచ్చిన ధన్యజీవి.— కావలిస్తే మన స్వామిగాణ్ణి అడుగు.

స్వామిగాడు: (ప్రవేశించి) పిలిచారండి, బాబు?

సీత: లేదు, కాని—ఏంరా, స్వామిగా, అలా దిగాలుపడి కనబడుతున్నావు, ఈవేళ?

స్వామి: ఏం లేదండి?

సీత: ఊరికేనే?

స్వామి: నాకో కష్టం వొచ్చిపడిం దిప్పుడు, బాబు —

సీత: అయ్యో, ఏం?

స్వామి: మా సూరికండి....

నారా: చూశావా, పాపం మన స్వామిగాడు ఒక ప్రేమపిపాసి. వా డెప్పుడూ ఆ సూరినిగురించే ఇదవుతోంటాడు.

సీత: ఏం, మీ సూరికేం?

స్వామి: ఏమీ లేదండి. దానికి మొన్ననండి, పుట్టిన రోజంటేనండి, అది పనిచేసే ఇంట్లో వుండే అమ్మాయిగారు జాలిపడండి ఒక కొత్త జాకెట్టు కుట్టించిచ్చారండి.

సీత: ఆ అమ్మాయిగారు చాలా మంచి మనస్సు గలదిలావుంది.

స్వామి: చిత్తం. మా సూరి మొన్న రేతిరి నాకోసమని యిక్కడ కొచ్చిందండి. తీరా, యింటికెళ్ళి సూసుకుండేతలికి దాని జాకెట్టు కనబడలేదండి. నిన్న టేలనించీ వెలుక్కుంటున్నామండి ఆ జాకెట్టు. ఈ కరువురోజుల్లో దాని కిప్పు డింకో కొత్త జాకెట్టెక్కణ్ణించి తెచ్చివ్వగలనా అని కింద మీదా పడి ఆలోచిస్తున్నానండి.

సీత: ఒరే, నారాయణా, ప్రేమతత్వం బాగా తెలిసినవాడవు. ప్రేమైక జీవులైన యీ సూరీ స్వాములకి నీదగ్గరున్న ఆ కొత్తజాకెట్టు బహుమానం చెయ్యకూడదూ?

స్వామి: అయ్యగారు తీసి దాచేరేమిటండి, బాబూ, దాని జాకెట్టు?

నారా: ఛీ, నా కెందుకురా? అయినా, నా దగ్గర వొకటి వుంది ప్రస్తుతం, కొత్తదే అనుకుంటాను. అది పట్టుకెళ్ళి మీ సూరికియ్యి. పోనీ సంతోషిస్తుంది.

స్వామి: చిత్తం, ఇంతకన్నా వుందాండి, బాబు—ఏదండి?

సీత: ఇదుగో—ఈ గాజుకూడా పట్టుకెళ్లు. ఏంరా, నారాయణా?

నారా: ఒద్దు ఆ గాజువుండనీ నాకు. (జాకెట్టు తీసి స్వామిగాడికి యిస్తాడు.)

స్వామి: (జాకెట్టు పరీక్షగా చూసి) ఈ జాకెట్టు మీ కెక్కడదండి, బాబు?

నారా: అదేమిటి, అలా అడుగుతున్నావు?

స్వామి: ఏమీ లేదండి. ఇదేనండి బాబు, మా సూరి కొత్త జాకెట్టు.

నారా: ఛీ, అదేమిట్రా?

సీత: ఇది నారాయణబాబుగారి స్నేహితు

తాలు ప్రేమచిహ్నంగా పంపించిందిరా, స్వామిగా!

స్వామి: అయ్య బాబు, మా సూరి జాకెట్టు నా. కానమాలు తెలియదంటారాండి?

నారా: నేను కాదని చెపుతోంటే నీకు కాదుట్రా?

సీత: పోనీలే. ఏదో వొకటి యీ జాకెట్టు నువ్వు పట్టికెళ్ళు.

స్వామి: చిత్తం. బతికించారండి. అన్నట్టు నిన్న తమరిచ్చిన పార్సిల్ పోస్టులో యేశానండి. చెప్పడం మరిచిపోయాను.

సీత: సరేలే.

నారా: ఏం పార్సిల్‌రా, అది సీతయ్యా?

సీత: ఏదో పుస్తకంలే.

స్వామి: అది పోస్టు మేస్టరు గారు చూసండి. "మీ నారాయణగారికి, కాదు సీతయ్యగారికి మతిపోయిందేమిటిరా, ఆయన అడ్రసుకి, ఆయనే పార్శిల్ పంపించుకుంటున్నాడు" అన్నాడు.

నారా: అదేమిట్రా, సీతయ్యా?

సీత: ఇంకెందుకు మరి. ఆ పార్సిల్‌లులోనే కాదుట్రా, నారాయణా, మరి నీకు ఆ సుశీల దగ్గరనించి కొత్తజాకెట్టు వచ్చింది.

నారా: ఏమిటి?

సీత: అదే మరి. ఆ జాకెట్టే సూరి మరిచిపోయింది మన ఇంట్లో, నువ్వు దాని కేవేవో పేర్లుపెట్టి ఆరాధిస్తున్నావు!

నారా: సీతయ్యా.—

సీత: అవునురా, నారాయణ!

రెండవరంగం

[మర్నాడు సాయంత్రం—డాబామీద—పున్నమచంద్రుడు ఉదయిస్తూవుంటాడు. ఒక మంచమూ, దానిమీద ముడతలు లేకుండా వేసిన తెల్లని పక్క. చుట్టూ పిట్టగోడమీద కుండీలలో రకరకాల పువ్వుల మొక్కలుంటాయి. ఇన్ని ఆకులూ, కొమ్మలూ పట్టుకుని నారాయణ "నలదమయంతు లిద్దరు ..." అనే పద్యం చదువుతూ ప్రవేశించి, ఆ రొట్ట అంతా మంచంమీద పరచి, ఒకసారి ఆ హంస తూలికా తల్పంకేసి సాభిప్రాయంగా చూసి మురుస్తాడు.]

నారాయణ: (పక్కమీద పడుకుని దొర్లుతూ మళ్ళీ మొదలెడతాడు పద్యం చదవడం) "నలదమయంతు లిద్దరు మనః ప్రభావనల దహ్యమానులై సలిపిరి....సలిపిరి .. సలిపిరి...."—తరవా తేమిటో? దీని తస్సా గొయ్యా.... అబ్బా. (బాధగా) ఇలాంటప్పుడు ఎక్కడ తగులడతాడో ఆ సీతయ్యగాడు.—అన్నట్టు, సీతయ్య హంసలవుతే;—అబ్బా, ఏమిటి ఈ వేదన అంతకంత కింత మాధుర్యం అయిపోతోంది! తెలివికూడా తప్పిపోతోన్నట్టుందేమిటి. అబ్బా .. బాధ....అయ్యో, అమ్మా.... (మూలుగుతాడు.)

సీతయ్య: (ప్రవేశించి) ఒరేయ్, నారాయణా!

నారా: (మూలుగుతూ వుంటాడు; మాట్లాడడు.)

సీత: నారాయణా, నిన్నేరా—

నారా: అబ్బా, ఎందుకూ, నన్నలా చంపుతావు?

సీత: అదేమిట్రా ఇంత చలిలో ఆరబైట అలా మంచంమీద పడుకుని వూరికే మూలుగుతున్నావు? వెన్నెలకూడా కాస్తోంది. ఈ మంచుకి పడిశం పడుతుంది—

నారాయణ: తండ్రి (ప్రవేశించి) వచ్చావా నాయనా, సీతయ్యా, నీ కోసమే చూస్తున్నా నయ్యా.

సీత: అయ్యో, ఏమిటండీ, మన నారాయణ ఇలాగ—?

నా-తండ్రి: అదే బాబూ, నాకూ భయం వేస్తోంది. సాయంత్రంనించి ఒక్కవరసని ఇలా కోద్దై కూస్తున్నాడనుకో,—

సీత: కోద్దై అఁ?

నా-తండ్రి: అంటే అదే—ఒకటే బాధ పడడం, ఒకటే పలవరించడం, ఒకటా? ఒక్కగాక ఒక్క నలుసు మిగిలాడు నాకు—పోనీ, జ్వరమేమో అంటే, వొళ్లాటే వెచ్చగా వున్నట్టూలేదు.

సీత: ఇదేమిటి, వీడి మంచంనిండా ఈ రొట్ట అంతా ఏమిటండి? ఈ గడ్డీ, యీ ఆకూ, యీ అలం—

నా-తండ్రి: అదేకాదుటోయ్, బాబు మరి, నా కేమీ అర్థం అవటం లేదు. సాయంత్రమంతా తనలో తనే యేదో గొణుక్కుంటూ ఆ ఉద్యాన వనంలో వూరికే విహరించడం మొదలెట్టాడు.

సీత: ఉద్యానవనమాండి? ఏ వుద్యాన వనం?

నా-తండ్రి: అదే నందవనం కాబోలు—

సీత: అదేమిటండీ?

నా-తండ్రి: ఏమో మరి వాడే అన్నాడు—

సీత: ఏమన్నాడు?

నా-తండ్రి: మన పెరడే పెద్ద ఉద్యాన వనమో, నందనవనమో అని.

సీత: మీ రెలా నమ్మేరు?

నా-తండ్రి: నమ్మడమేమిటోయ్, నా కిన్నార

మొహం? ఏం చెయ్యమన్నావు మరి, వా డలా ఇదవుతుంటేను?—అని వూరుకున్నా డా? వసంతం వచ్చిందన్నాడు.

సీత: ఏమిటీ!

నా-తండ్రి: అవును. వసంతమే!—"వసంతం" అంటే మొదట నేను ఎవరో అమ్మాయి పేరనుకున్నాను. కాదు, ఋతువు వొచ్చిందన్నాడు. నే నక్కడికీ శిశిరంలో వసంతం ఏమిట్రా అన్నాను. వాడు వినిపించు కోక యీ ఆకులన్నీ పుణుక్కొచ్చి, శుభ్రంగా ముడతలు లేకుండా వేసిన యీ పక్కనిండా పోసి దానిమీద దొర్లడం మొదలెట్టాడోయ్!

సీత: ఎందుకు?

నా-తండ్రి: "ఎందుకురా" అన్నాను: అంటే, తాపంగా ఉంది; ఇవన్నీ చల్లగా, శీతలంగా వుంటాయి,—బిసబిసాలో, ఏవో అన్నాడోయ్—

సీత: కిసలయాలు అని కాబోలు; అంటే చిగుళ్లు.

నా-తండ్రి: అదే అయివుంటుంది. ఏదో శైత్యాపచారాలు కావలన్నాడు.—

సీత: శైత్యోపచారాలు అని అనుకుంటాను మీ అభిప్రాయం.

నా-తండ్రి: ఏమో, ఆ మాటలకి నాకేం అర్థం తెలిసి చచ్చింది గనక? అంతేకాదోయ్ బాబు, నాభికూడా కావాలన్నాడోయ్.

సీత: నాభా అండి?

నా-తండ్రి: అవును. ఒంటికి పూసుకో డానికిట; తినడానికి కాదుగదా అని కాస్త సంతోషించాను.

సీత: నయమే నాభికూడా తెప్పించి యిచ్చారు కాదు; రక్షించారు.

నా-తండ్రి: నాభి వొంటికి రాసుకుంటే చల్లగా వుంటుందంటావా? గంధమా ఏమిటి అది?

సీత: నాభి కాదండీ, మహాప్రభో! అది. ఈ సారి తెలుస్తోంది. మృగనాభి గంధం అయి వుంటుందండి. పంకం అని కూడా అంటారు; అంటే బురద.

నా-తండ్రి: బురదా? చల్లదనానికి అని కూడా అన్నాడు సుమా. చూడు, సీతయ్యా—

సీత: అయ్యా?

నా-తండ్రి: ఒళ్ళంతా వూరికే అగిడి మంట లెత్తేస్తోందని ఒకటే గోలోయ్!

సీత: మండుతుందండి.

నా-తండ్రి: అయితే నీకు తెలుసా? మీ రిద్దరు హాస్టలులో వున్నప్పుడు వీడి కిదివర కెప్పుడైనా యిలా వస్తూండడం మామూ లుందేమిటి బాబూ?

సీత: ఇదివరకు లేదుగానండి; అంతా అర్థమవుతోందండి.

నా-తండ్రి: తామరతూళ్లు తెప్పించ మన్నాడోయ్. పచ్చకర్పూరం – ఎక్కడా దొరక్కపోతే ఆ ఖరికి మన స్వామిగాణ్ణి పంపించి తులం ౧౫ రూపాయలు పెట్టి ఒక చిన్న మెత్తు తెప్పించాను.

సీత: అయ్యా, నే నొకటి చెపుతాను వినండి వీడు కావాలన్నదల్లా తెప్పించి యిచ్చి ఇలా గారాంచేసి, వీణ్ణి పాడుచేస్తున్నారు మీరు.

నారా: నాన్నగారూ!

నా-తండ్రి: నాయన—

నారా: అలా చూస్తూ వూరుకుంటారేం?

నా-తండ్రి ఏమిటి నాయనా అది?

[గుడ్లగూబ అరుస్తుంది]

నారా: ఆ కోయిల ఊరికే అదేపనిగా కూస్తోంది. దాని గొంతుకలో ఏదైనా ఇంత కుక్కండోయ్, బాబు.

నా-తండ్రి: చూశావుటోయ్, వరస?

సీత: గుడ్లగూబరా, నారాయణా అది, కోకిలకాదు.

[నారాయణ లేచి కూర్చుని, కోటు, చొక్కా అవీ విప్పి దూరంగా పడేస్తాడు. మళ్ళీ పడు కుంటాడు.]

నా-తండ్రి: అదేమిటిరా, నాయనా. అల్లా గుడ్డలన్నీ విప్పేసుకుంటున్నావు? తాపమే మళ్లీ?

సీత: సిగ్గులేదట్రా, నారాయణా, బొత్తిగా దిగంబరస్వాములారిలాగ?

నారా: సీతయ్యా.

సీత: ఏంరా, నారాయణ?

నారా: నువ్వు కాస్సేపు నోరు మూసు కుంటావా?

నా-తండ్రి: తప్పురా, నాయనా, అతన్నలా అనొచ్చా?

నారా: (పలవరింతగా) ఏనాడు నీ దివ్య సుందర విగ్రహాన్ని దర్శించానో, ఏ బస్సు స్టాండు మండపంలో నా మండుతోన్న పంచ కుచ్చెళ్లని నీ శీతల కరస్పర్శంతో నేర్పుగా ఆర్పావో, అనాడే, ఆ బస్సుస్టాండు మండపం లోనే, నా పేదగుండె నీ హస్తగతం చేశాను!

నా-తండ్రి: (ఆశ్చర్యంగా చూస్తూ) దైవ ప్రార్థన చేస్తున్నా డేమిటోయ్, సీతయ్యా? ఏదో అగ్ని ప్రమాదం అంటున్నాడేమిటి?

సీత: ప్రార్థనాకాదు, మన్నూకాదు; ఇంకా వినండి.

నారా: మన పునస్సంధానం కోసం, కాసి కాసి కృశించి....

నా-తండ్రి: అదేమిటోయ్?

సీత: అదేనండి మరి—

నారా: ఆహా! సుశీలా. ఇది నీ పరిహాసలీలా? ఇంకనూ దయరాదేలా?

సీత: ఓరి బేలా! నీ కవిత్వం కాలా.

నా-తండ్రి: అదేమిటోయ్, సీతయ్యా. అసలే ఇదవుతోంటే, వాణ్ణి పాపం అలా అంటావు?

సీత: లేకపోతే ఏమిటండి మరి?

నా-తండ్రి: సీతయ్యా.

సీత: అయ్యా.

నా-తండ్రి: వీడి చేష్టలు చూస్తోన్న కొద్దీ వీడికి కొంచెం మతి స్థిమితం తగ్గుతోన్నట్టు కనబడుతోందోయ్, ఎందుకోను.

సీత: నయమేనండి—వాడు విక్షేపంలాగున్నాడు, మనస్సు స్థిమితం తగ్గుతోంట మీకూ, నాకూను.

నా తండ్రి: అలా అంట వేమిటోయ్? తీరి కూర్చుని ఇలా బాధపడడం సరదా అంటావా వాడికి మాత్రం?

నారా: అబ్బా .. తాపం....దాహం.... చలి, చలి! (మళ్లీ చొక్కా, కోటు తీసి తొడుక్కుంటాడు.)

సీత: ఒరేయ్, వరూధినీ, గిరికా!

నా-తండ్రి: ఏమిటి అన్నావు?

సీత: "వరూధినీ, గిరికా"—అన్నాను. ఆ పాడు ప్రబంధాలన్నీ చదవకురా అని ఎన్నిసార్లు పోరినా విన్నాడు కాదు. దీన్ని విరహతాపమనీ, మదనజ్వరం అనీ, వలపు తెగులనీ ఇత్యాది పేర్లతో పిలుస్తారండి; అనుభవిస్తున్నాడు.

నా-తండ్రి: ఏమిటి నిజమే?....అయితే.

సీత: ఎరక్కపోయి ఆ దిక్కుమాలిన మంటపల్లి అగ్రహారం ఎందుకు వెళ్లేమో....

నా-తండ్రి: ఆ అమ్మాయి ఎవరో రమ్మండని వెళ్లి వాళ్ళ కొంపకి —

సీత: లోగిలి కండి—

నా-తండ్రి: అదే—లోగిలికి నిప్పుపెట్టి వచ్చాడూ—?

సీత: ఇంకేమిటండి, మరి?

నారా: [పద్యాలు చదువుతాడు]

"నాడు స్టేషనులో మాటలాడునపుడు
సారెకును తాకు నీ కటాక్షముల కట్టె
త్రుళ్లి దడదడ మనుచు మోకాళ్లదాక
ఈ వలపు గుండె జారిపోయినదె, చెలియ!
మండు రేయెండ రేగిన మామకీన
విరహ సుప్తాగ్ని సప్తజిహ్వకల కెడళ
అట్టె పరశురామ ప్రీతినందు పెద్ద
నాలుగిళ్ల భవంతి చందమున తోచు!"

సీత: చిత్తగిస్తున్నారాండి?

నారా: అయ్యో, ఇన్ని సిగరెట్లు నేను కాలుస్తున్నాను. నన్ను ఒక్క సిగరెట్టూ కాల్చదు.

నా-తండ్రి: ఏమిటి, మావాడు సిగరెట్లు కాలుస్తాడుటోయ్. నువ్వు దగ్గరుండి చూస్తూ వూరుకుంటున్నావా?

సీత: చుట్టలు తాగకూడదుట్రా, అబ్బీ, అని ఎన్నిసార్లు చెప్పానో అడగండి, వాడికి తెలివి వచ్చాకాను?

నా-తండ్రి: తాగడమే?

సీత: లేదు, పీల్చడమండి.

నా-తండ్రి: ఏమిటి నస్యం కూడానా?

నారా: (పాడతాడు) "ఈ వియోగ జలధి గడచి బ్రదికినగదా నేను ముదముగనుట!

ఆహా, సఖీ, భరింపగలనసె ఈ వియోగ జలధి...."

సీత: అయ్యో, ఇంక ముదిరిపోతోంది....

నా-తండ్రి: అబ్బ. అలాంటి అవాచ్యం మాట లనకోయ్ నేను వినలేను.

సీత: ఒరేయ్, నారాయణా, ఈ చల్లగాలిలో నువ్వా మంచంమీదనించి లేచి, ముందు లోప లికి పద. (కుదిపి లేపుతాడు).

నారా: మీరు నన్ను చంపినా ఇప్పుడిక్కడ నించి కదలలేనోయ్, బాబూ.

నా-తండ్రి: నారాయణా, నా మాటవిని, లేవవు, నాయనా?

సీత: పాపం. మీ నాన్నగా రలా ఇదవు తోంటే లేవవేమిరా, నారాయణా?

[నారాయణ కళ్లుమూసి, పళ్లు బిగించి మంచంమీద రూళ్ళ కర్రలాగ పడుకుంటాడు]

నా-తండ్రి: లే, నాయనా....అయ్యో, అయ్యో, ఇంకేముంది, సీతయ్యా. వీడు పళ్లు గిట్ట కరిచేశాడు.

సీత: అలా అంత దగ్గరగా పెళ్ళకండి వాడికి. మిమ్మల్ని కూడా కరుస్తాడు.

నా-తండ్రి: నురుగులు కూడా వస్తున్నాయి నోట్లోనుంచి। ఇంక నేనేం చెయ్యను?

సీత: ఫరవాలేదండి, అదంతా పిత్త ప్రకోపం.

నా-తండ్రి: ఇప్పుడు నేనేం చేశాను వీణ్ణి పిచ్చకోపానికి? అబ్బే. లేదోయ్ వీడు మూర్ఛ పోయాడు కాబోలునోయ్, తండ్రీ.

సీత: మన పురాణ పురుషులంతా మూర్ఛలు పోయినవాళ్లే కాదండీ? ఫరవాలేదు. మరేం గాభరా పడకండి. ముందు వీణ్ణి మనం వెంటనే లోపలకి తీసుకువెళ్లి పడుకోపెట్టాలి.

నా-తండ్రి: ఎలాగోయ్ సీతయ్యా, నాకు కాళ్లు వొణుకుతున్నాయి. వెనక వీళ్ల అమ్మ.

సీత: అలాంటివన్నీ జ్ఞాపకం చేసుకోకం డిప్పుడు. భయంలేదు. మీరా తలాపు దిక్కున పట్టుకోండి. నేను కాళ్ళకాడ దిక్కున పడతాను. మంచం సాయంపట్టి పడుకోపెడదాం.—పట్టండి మరి, అలా విచారిస్తూ కూర్చుంటే లాభంలేదు. (నారాయణ తండ్రి మంచం సాయం పడతాడు)అదీ....అలాగ....

నా-తండ్రి: అయ్యో, నారాయణా, నారాయణా।

[మంచం సాయంపట్టి గదితలుపు తోసి లోపల పెడతారు. తిరిగి యిద్దరూ డాబామీదికి వస్తారు. మంచంమీద నారాయణ డాబామీదకి కనబడుతూ వుంటాడు.]

నా-తండ్రి: ఉన్న ఒక్క నలుసునీ ఎంతో ఇదిగా పెంచుకొస్తున్నాను. ఇదేమిటోయ్ సీతయ్యా, ఆఖరి కిలా అయింది?

సీత: అబ్బే, అలా దుఃఖించకండి మరి: తగ్గిపోతుంది.

నా-తండ్రి: మీరా మందపల్లి నించి వచ్చిన పదిరోజులనించీ....

సీత: మంటపిల్లి అండి.

నా-తండ్రి: అదే వల్లకాదు పిల్లి!— అప్పటినించీ, చూస్తోండగానే వీడు ఎలా చిక్కిపోవడం మొదలెట్టా డనుకున్నావు? రాత్రిళ్లు నిద్రపోడు, ఏ పనీ చెయ్యడు, సరీగ్గా తిండికూడా తినటంలేదు. ఏమిటో మట్టితిన్న పాములాగ ఒకటే ఆలోచన, దిక్కుమాలిన ఆలోచన. ఆ ప్రమీల—

సీత: సుశీల—

నా-తండ్రి: ఆఁ. సుశీలే కాబోలు, వీడి కేదో మచ్చుమందు పెట్టివుంటుందోయ్, బాబు,

[నారాయణ అమాంతంగా లేచి బల్లమీద గాజు గ్లాసులో వున్న షర్బత్తు గడగడ త్రాగేసి మళ్ళీ పడుకుంటాడు.]

సీత: ఆ(. ఆ(!

నా-తండ్రి: అదేమిటి?

సీత: అదేమిట్రా, నారాయణా. ఆ గ్లాసు లోది ఏమిటి అలా గడగడ తాగేసి పడుకున్నావు?

నా-తండ్రి: అయ్యో, అయ్యో. (కంగారుగా) వీడి ఓహోయిత్యం ఇదయిపోను. సీతయ్యా, వీడేదో కలుపుకు తాగేసి విరుచుకు పడిపోయాడోయ్. ఇప్పుడేమిటి సాధనం? కొయ్యైపోయాడు.

సీత: (గ్లాసు తీసి పరీక్షించి) ఈ గ్లాసు లోది ఏదో చిక్కగా, జిడ్డుజిడ్డుగా వుందండి.

నా-తండ్రి: ఆ(?

సీత: (నారాయణని కుదిపి) ఒరేయ్, నారాయణా, నీకు పుణ్యం వుంటుంది. ఏమిట్రా బాబూ, నువ్విప్పుడు తాగినది? చెప్పు, ఇంకా మించిపోలేదు.

నా-తండ్రి: చెప్పవు నాయనా, మీ నాన్న గారితో చెప్పవు. తండ్రీ? నీకేం లోటు చేశానురా నన్నిలా ఏడిపిస్తున్నావు? నీకు ఏది కావలిస్తే అది తెప్పించి యిచ్చుకుంటాను. చెప్పవూ?

సీత: అదుగో, కళ్లు తెరిచాడు. చెప్పరా. మీ జనకులు అలా దుఃఖిస్తూంటే జాలి లేదుట్రా నీకు, నారాయణా?

నారా: సాహసే లక్ష్మీః. ఈ వికృత వసంతమూ, యీ వెకిలి పువ్వులూ, తుమ్మెదలూ, యీ కాల్చేసే చందమామా మందపవనమూ, నన్నింకేమీ చెయ్యలేవు. ఆఖరికి నేనే గెల్చాను మృత్యువుని ఆహ్వానించి జయించాను. ఆహా! మృత్యుంజయుణ్ణి!

నా-తండ్రి: ఆ(. అయ్యో. ఏమిటి అంటాడు, సీతయ్యా?

సీత: ఏమిట్రా నీ మాటలకి అర్థం?

నారా: ఒరేయ్, సీతయ్యా.

నా-తండ్రి: పలకవేమోయ్ సీతయ్యా, వాడలా పిలుస్తోంటేను?

నారా: నాన్నగారూ!

నా-తండ్రి: నాయన?

నారా: నా కిప్పుడొక కుక్కనై మొరగాలని వుందండీ. (వికటంగా "బొంయి బొంయి" మని నవ్వుతాడు.)

సీత: ఏం కుక్కరా అది, నారాయణా?

నారా: కుక్కలలో పెక్కురకములు గలవు (లేచి కూర్చుని చదువుతాడు) "పులియడు, బూచిగా డసుర పోతుల రాజను మంతిగాడు, చెంగలువ, సివంగి, భైరవుడు, సంపంగి సాళ్వుడు, వాయువేగి ......వాయువేగి........ వాయువేగి—" తరవాత ఏమిట్రా, సీతయ్యా?

నా-తండ్రి: సీతయ్యా, వీడు తిన్నది నాభి కాదోయ్. సీతయ్యా, గన్నేరు పప్పేమోనోయ్!

సీత: రెండూ కాదండి, తినలేదు. ఏదో త్రాగాడు—ఒరేయ్, నారాయణా అమ్మవు కాదూ. ఏమిటి నువ్వు తాగింది, చెప్పవుట్రా?

నారా: ఆమ్లమురా, సీతయ్యా. ఒకానొక ఆమ్ల విశేషము!

నా-తండ్రి: ఏమిటది?

నారా: ఆమ్లము. జంబీరామ్లము!

నా-తండ్రి: ఏమిటోయ్. అది? ఏదైనా టానిక్కా? ఆమ్లా ఆయిల్ ఏదో అంటారు, అదేమిటి?

సీత: ఆమ్లమంటే యాసిడ్ అండీ బాబూ,

ఏమి యాసిడ్‌రా అది. నారాయణా? జంబీరామ్లమేమిటి? అదేదో ఇంగ్లీషులో అఘోరించరాదూ?

నారా: అబ్బా. మంటలు, మంటలు వొళ్ళంతా కాలి అట్టుడికి పోతోంది!

నా-తండ్రి: అలాటిదేదైనా తాగితే పేగుల్లో మండుతుంది గాని ఒళ్ళంతా ఉడుకుతుంది టోయ్ కుమ్ములో పెట్టిన దుంపలాగ సీతయ్యా?

సీత: కొన్ని ఆమ్ల విశేషా లంతేనండీ. బాబూ—ఉండండి.

నారా: ప్రాణాలు పోతున్నాయండోయ్, నాన్నగారూ. (మళ్ళీ పడుకుంటాడు.)

నా-తండ్రి: అయ్యో. అయ్యో మళ్ళీ పడిపోయాడోయ్, కుర్రవాడు. ఏం దిక్కింకనాకు? అయ్యో భగవంతుడా! (నారాయణ మీద పడి దుఃఖిస్తాడు-)

సీత: ఉండండి అలా వాడిమీద పడకండి. ఉన్న కాస్త వూపిరి సలపదు.

నా-తండ్రి: (కంగారుగా) నీళ్లు, నీళ్లు!

సీత: (నారాయణ దగ్గరకి వెళ్ళి) సోడా, సోడా!

నా-తండ్రి: గసగసాలు, కటకరోహిణి!

సీత: దుంపరాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం!

స్వామిగాడు: (చీపురుకట్టతో ప్రవేశించి) అయ్యా వారికి కొంచెం గాలి వొదులుతారా?

సీత: అవును అన్నట్టు. విసనకర్ర, చీపురుకట్ట!

స్వామి: ఇదిగోనండి, చీపురుకట్ట! (అందించబోతాడు).

సీత: ఏమిటది? చీపురుకట్ట ఎందుకురా, చెవిటి పీనుగా?

స్వామి: మీ రిప్పు డడిగారు కారండి? మంతిరిస్తా రనుకున్నాను.

నా-తండ్రి: (గద్గదంగా) స్వామిగా, ఒరేయ్ స్వామిగా!

స్వామి: పిలిచారండి, అయ్యగారూ?

సీత: అవును పిలిచారు—నువ్విప్పు డర్జంటుగా పరిగెత్తుకెళ్ళి ఒక డాక్టర్ని తీసుకురావాలి.

స్వామి: ఏ డాక్టరుగారి నండి, బాబు?

సీత: ఓరి నీ యక్ష ప్రశ్నలు మండ. ఏ డాక్టరేమిట్రా? ఏ డాక్టరైనా సరే....

స్వామి: మనింటికి మామూలుగా దయచేసే డాక్టరుగారు ఊళ్ళో లేరండి. అందుకు చెప్పాను.

సీత: చూడు, ఇంక అట్టే వెధవ కబుర్లు చెప్పక వెళ్ళి ఎవరో ఒక డాక్టర్ని ఉన్న పళంగా తీసుకు చక్కా రా ఇక్కడున్నట్టు. తెలిసిందా?

స్వామి: ఇంగ్లీషు డాక్టరేనాండి?

నా-తండ్రి: ఒరేయ్ స్వామిగా-(వారిస్తాడు)

స్వామి: లేకపోతే మరి, ఉమాపతీ అనీ, నాటు వైద్దెమనీ ఇంకా వున్నాయి కాదండీ.

సీత: ఉమాపతీ వొద్దు, ఉద్ధరిపతీ వొద్దు-వెళ్ళి ఇంగ్లీషు డాక్టర్నే తీసుకురా. ఇలాంటి కేసులకి వాళ్ళే వుండాలి.

స్వామి: చిత్తం. అందుకోసమే నండి మరి, ఇప్పు డెళ్ళి రమ్మంటారా అండి?

సీత: మరి రేపు వెడదామనుకుంటున్నావట్రా? ఇంకా ఇక్కడే వున్నావేం? అయ్యగారికి ప్రాణం మీదికి వచ్చిందని తెలియదూ?

స్వామి: (నారాయణ తండ్రికేసి వొకసారి చూసి) ఏ అయ్యగారికండి, బాబు?

నా-తండ్రి: త్వరగా వెళ్లిరారా, స్వామిగా (దీర్ఘంగా)

స్వామి: అందుకోసమేనండి మరి-ఇక్కడున్నట్టు రానండీ? (నిష్క్రమిస్తాడు)

సీత: (నుదురుమీద చమట తుడుచుకుంటూ నిట్టూర్చి) అమ్మయ్య!

నా-తండ్రి: మరేం ఇది లేదంటావా, సీతయ్యా?

సీత: ఏమో చెప్పలేమండి. డాక్టరుగారొచ్చి చూసిందాకా. ఏదీసీ—ఊపిరి బాగానే తీసుకుంటున్నాడు. వీడు పుచ్చుకున్న వస్తువునుబట్టి వుంటుందండి అంతాను. అయ్య—అయినా, ఇప్పుడు మనం చెయ్యగలిగిన దేమీ లేదు. వాణ్ణి కదపకండి.

నా—తండ్రి: నువ్వు వీణ్ణి కాస్త చూస్తూ వుంటావా? లేచేటప్పటికి బలంగా వుంటుంది కొంచెం కాఫీ తయారు చేయిస్తాను.

సీత: అయ్యో. మరేం భయం లేదు. అలాగే చేయించండి. రెండు మూడు కప్పులు చేయింపించండి. (నారాయణ తండ్రి లోపలికెళ్ళి కొంచెంసేపుండి మళ్ళీ వస్తాడు-సీతయ్య ఆవులిస్తూ పచారు చేస్తుంటాడు.)

నా-తండ్రి: సీతయ్యా!

సీత: అయ్య.

నా-తండ్రి: ఈ స్వామిగాడు వెళ్ళి చాలా సేపయింది. పోనీ నేనుకూడా వోసారి వెళ్ళి రానేమిటి?

సీత: అబ్బే! ఎందుకండి. దీనికి మళ్ళీ మీరు వెళ్ళాలా? నేనుండి ఏం చేస్తాను? నేను వెళ్ళిరాలేనూ? అక్కర్లేదండి. యీపాటికి వస్తూంటారు.

నా-తండ్రి: నారాయణ లేచాడా?

సీత: ఇంకా లేదండీ. అలాగే పడుకుని వున్నాడు. ఇలా ఒత్తిగిల్లనైనా లేదు.

నా-తండ్రి: (జాలిగా) ఎలాగోయ్.

సీత: అలాగేనండి మరి. కాఫీ అయిందాండి?

నా-తండ్రి: అయిపోయినట్టే దగ్గర కూర్చుని స్ట్రాంగ్‌గా తయారు చేయిస్తున్నాను. వస్తాను మరి. జాగ్రత్తగా చూస్తోంటావు కాదు, బాబూ?

సీత: అయ్యో, నా కిన్నిసార్లు చెప్పాలా అండి?

నా-తండ్రి: తండ్రిపేగు చూడు మరి? నా ఆదుర్దా అలాగుంటుంది.

సీత: కాదండీ—

నా-తండ్రి: నేను రానా మరి? [నిష్క్రమిస్తాడు]

సీత: అయ్య—(తనలో) వీడింకా అలాగే పడుకుని వున్నాడు, రూళ్ళకర్రలాగ. ఇక్కడ పడకకుర్చీ వుందేమిటి? నేనింకా చూడనే లేదు. (ఆవులించి) అబ్బ కళ్లు మూరుకొస్తున్నాయి. ఈ వరండాలో కాస్త విశ్రమిస్తాను. మెళకువ వచ్చినప్పు డోసారి ఆ గదిలో తొంగిచూస్తూ వుంటే చాలు.... [పడకకుర్చీలో పడుకుని నిద్రపోతాడు.]

డాక్టర్ నిర్మల: (విసురుగా వచ్చి) మెడిసిన్ ఛెస్ట్ బల్లమీద పెట్టి) అయ్యో. ఇతని దగ్గర ఎవరూ లేరే! ఇలా వొక్కణ్ణీ వొది లేశారేం? (సీతయ్య జబ్బ పట్టుకు గుంజుతుంది)

సీత: ఆఁ. ఆఁ. (కంగారుగా లేవబోతూ) ఉండండి,అలా నా జబ్బ పట్టుకుని గుంజకండి.

డా-నిర్మల; ఒళ్ళు మత్తెక్కిపోయి మైకం కమ్ముకు పోతోంటే ఎలాగో ప్రయత్నించి ఇటూ, అటూ పచారు చెయ్యాలి గాని, అలా పడకకుర్చీలో జోగుతోంటే ఇంకా ఎక్కువై ముంచుకురామా?

సీత: ఆహా! మీరెవరో స్వర్గలోకంలోంచి దిగివచ్చిన దేవకన్యకలాగ వున్నారు!

డా—నిర్మల: నే నెలా వుంటేనేం? ముందు మీకు తెలివి వచ్చింది, సంతోషం. ఈసారి మీ రోగం కుదురుస్తాను. ఇలా నన్నానుకొని పది అడుగులు వెయ్యండి, ముందు.

సీత: (ఆశ్చర్యంతో) పదా, ఏడా?— అబ్బ. మీ చెయ్యి ఎంత మృదువుగా వుంది. లేత తమలపాకులాగ!

డా-నిర్మల: నా కాళ్లుకూడా మృదువుగానే వుంటాయి. ఇంకా చూడండి.

సీత: అబ్బే. అక్కర్లేదండి. మృదువుగానే వుండివుంటాయి. సందేహ మేమిటి? మీ మాటలో·నాకు నమ్మకమే.

డా-నిర్మల: ముందు లేవండి ఆ కుర్చీలోంచి—

సీత: ఎందుకు? ఎక్కడికి?

డా-నిర్మల: ఇప్పుడు చెప్పేను కాదూ?

సీత: ఏమిటి, ఎవరు మీరు?

డా-నిర్మల: నే నెవర్నో తెలియకుండానే నన్ను పిలిపించారనుకుంటాను అయితే, ఏం?

సీత: నేను మిమ్మల్ని పిలిపించలేదే—మా నారాయణ ఏమిటి చెప్తా? అయినా మీ రిప్పుడిక్కడికి వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. అయితేనూ—నన్నెందుకు అమాంతంగా గిల్లి కుదిపారు?

డా-నిర్మల: తెలివి రావడానికి.

సీత: వచ్చిందిగా—ఇంక కూర్చోరూ అలాగ?

డా-నిర్మల: నే నిక్కడ కూర్చోడానికి రాలేదు.

సీత: నేను ఎన్నాళ్ళనించో వెతుకుతున్నాను—అంటే, నా స్వప్న సీమలలో—

డా-నిర్మల: నేను వెళ్ళిపోతున్నాను.

సీత: అమ్మమ్మ!—ఇలా ఒక అవ్యాజ కటాక్షం నావైపు పారేసి మీ రలా నిష్క్రమించడం—

డా-నిర్మల: మీ కింకా సరిగ్గా మెళకువ రాలేదనుకుంటాను. ఏమిటి మీ కిప్పుడు బాధ?

సీత: అది మీరు తీర్చగలరా?

డా-నిర్మల: ప్రయత్నిస్తాను, అది నా వృత్తి.

సీత: నిజమే.

డా-నిర్మల: అందుకోసమేగా మరి నే నిక్కడికి వస్తి?

సీత: ఏమిటి? నే ననుకుంటూనే వున్నాను.

డా-నిర్మల: ఏమిటది?

సీత: నా బాధ తీర్చగల నారీశిరోమణి మీరే అని.

డా-నిర్మల: అయితే నాకు చేతకాదంటారా?

సీత: ఎంతమాట! నా కిప్పుడు తలలో ఏవో చెట్లు గబగబా చిగురుపోస్తున్నట్టువుంది.

డా-నిర్మల: నా తలలోవేనా? అవేచెట్లవో నాకూ తెలియదు, కదంబం అంటారు.

సీత: నా బుర్ర ఏమిటో పాము పడగలాగ వికసించిపోతోంది!

డా-నిర్మల: అదా—అవన్నీ అవే తగ్గిపోతాయి.

సీత: చూడండి, మీ పేరెవరు అన్నారు?

డా. నిర్మల: నే నిప్పు డేమీ అనలేదు, కాని, నిర్మల నా పేరు.

కిన్నెర

సీత: నిర్మల! అహా, మీకు మల్లేనే మీపేరు కూడా ఎంత మనోహరంగా ఉంది!

డా-నిర్మల: మీ ధోరణి మార్చడానికి వీలౌతుందా?

సీత: ఎలాగ మార్చడం? భోజరాజు మొహంకేసి చూస్తే కవిత్వం పుట్టుకొచ్చినట్టు మీ సుందర వదనారవిందం చూస్తోంటే నాకు వూరికే లలిత నిర్మల భావాలు పుట్టుకొస్తున్నాయి.

డా-నిర్మల: ఓహోహో. ముదిరిపోతోంది.

సీత: మీకు ఇంకా వివాహం కాలేదని నా విశ్వాసం.

డా-నిర్మల: ఆ అప్రస్తుత ప్రశంస ఎందుకిప్పుడు?

సీత: అబ్బే. ఊరికే అడిగాను.

డా-నిర్మల: నా వైవాహిక విషయం మీ కంత కుతూహలంగావుంటే ...ఇంకా కాలేదు.

సీత: ఆః!

డా-నిర్మల: ఆః. అన్నారేం?

సీత: నేను చెప్పాను కాదూ? నా విశ్వాసం చాలా దృఢమైనది లెండి.

డా-నిర్మల: అలాగా? నాముందు ఎవరైనా నుంచుని "ఆః" అని నోరుచాపితే వారి నాలుక పరీక్షచెయ్యమని అర్థం.

సీత: అయితే నన్ను మీ ముందు నుంచుని "ఆః—" అనమంటారా? నాకు ఒక్కటే నాలుక!

డా-నిర్మల: ఇక్కడింక నే నుండవలసిన అవసరం వున్నట్టు తోచదు. నేను వెడుతున్నాను. (మెడిసిన్ ఛెస్ట్ తీసుకుంటుంది)

సీత: అదేమిటి. ఆ పెట్టె పట్టుకుపోతున్నారు?

డా-నిర్మల: ఏం, ఇది నాది.

కి న్నె ర

సీత: మీదా! ఆ పెట్టె?

డా-నిర్మల: అవును నాదే. నా మందుల పెట్టె—

సీత: మందులపెట్టా! మీదా? అయితే—

డా-నిర్మల: అవును—

సీత: అయితే మీరు డాక్టరా?

డా-నిర్మల: నేను డాక్టర్నెందుకు కాకూడదు?

సీత: అవును. ఎందుకు కాకూడదు? అన్నట్టు ఆడ డాక్టర్లు కూడా వుంటోంటారు కాదూ?

డా-నిర్మల: మీ కుర్రాడు వచ్చి నన్ను పిలిచిన గాభరా చూస్తే ఇక్కడెవరికో పురుడో, ఏదో రాక బాధపడిపోతున్నారు కాబోలు ననుకుని పరుగెత్తుకొచ్చాను.

సీత: నాకు పురుడొస్తుం దనుకునే నా అయితే అలా గిల్లి గుంజా రిందాకాను?

డా-నిర్మల: లేదు. ఇక్కడెవరో ఏదో త్రాగి మూర్ఛ పడిపోయారు. త్వరగా వచ్చి రక్షించాలన్నాడు మీవాడు. అదంతా వట్టి నాటకం అన్నమాట? ఈ అర్ధరాత్రివేళ—

సీత: ఉండండి అలా తొందరపడకండి. స్పృహతప్పి పడిపోయిన ఆసామీ వున్నాడు, లోపల.

డా-నిర్మల: ఏమిటి? అయితే మీకుకాదూ జబ్బు చేస్త? (నారాయణ తండ్రి కప్పు సాసర్లలో కాఫీ తెస్తూ గడప తగిలి బోర్లా పడతాడు. కప్పు, సాసరూ బ్రద్దలౌతాయి.)

సీత: అయ్యయ్యో. అలా పడిపోయారేమిటి? (పరిగెడతాడు)

డా-నిర్మల: మీ రుండండి—ఈయ న్నిలా సాయం లేకుండా ఒక్కడినీ ఎందుకు తిరగ

నిస్తున్నారు. అయితే? (వెళ్ళి ఆయన జబ్బ పట్టుకుని లేవదీస్తుంది)

నా-తండ్రి: (కోపంగా) ఏం. నే నెందుకు ఒక్కణ్ణీ తిరగకూడదు? నాకు సాయం ఎందుకు? మధ్యని నువ్వెవరవు?

సీత: అయ్యో ఉండండి. ఈమే డాక్టరు గారు. డాక్టరు—

డా-నిర్మల: నిర్మల.

సీత: ఆఁ! డాక్టరు నిర్మలగారు.

నా-తండ్రి: ఏమిటి. ఈవిడ డాక్టరా?

డా-నిర్మల: అవును, నేను డాక్టర్నే— ఈ ఇంట్లో అందరికీ ఏమిటీ పిచ్చి సందేహం?

సీత: అయితేనూ, మీకేమీ దెబ్బ తగల లేదుగద?

నా-తండ్రి: అబ్బే. వెధవ గడప. కాలికి పంచ తగులుకుని—

డా-నిర్మల: ఈయన బాగానే వున్నారే— ఏదీ నాలుగడుగులు వెయ్యండి.

నా-తండ్రి: ఇక్కణ్ణించి నేను ఒక్క అడుగైనా ఇంక ముందుకు వెయ్యలేను. (మళ్ళీ చతికిలబడతాడు. నిర్మల లేపదీస్తుంది)

సీత: ఏం?

డా-నిర్మల: ఫరవాలేదు నన్ను పట్టుకుని నాలుగడుగులు వెయ్యండి.

నా-తండ్రి: అబ్బే, లాభంలేదు. నిలబడ మంటే నిలబడతాను, అంతే.

డా-నిర్మల: ఏం ఇంకా మైకంగా ఉందా?

నా-తండ్రి: మైకమా? మీ ఉద్దేశం నేనేం తాగుబోతు ననుకున్నారా? అలాంటిది మా యింటా వంటా లేదు. (రెండు చేతులు నిర్మల భుజంమీద, సీతయ్య భుజంమీదా వేసి నుంచుని కళ్ళు ఎర్రజేస్తాడు)

సీత: అయితే. ఆవిడ ఎందుకు చెప్పారో, పోనీ రెండడుగులైనా వెయ్యండి బావుందదు—

నా-తండ్రి: ఓయి పిచ్చిసీతయ్యా, నా కాలు బెణికింది కాదుటోయ్ మరి?

డా-నిర్మల: (ఆయన్ని ఒక కుర్చీలో కూర్చోబెట్టి) అసలు మీరెందుకు లేచారు?

నా-తండ్రి. ఎంత సేపని ఆ వంటింట్లో కూర్చోను మరి?

డా-నిర్మల: నేను వచ్చేలోగా ఎందుకా తొందర?

నా-తండ్రి: అదొకటి కూడానా?

డా-నిర్మల: ఆ కాలు జాడించండి.— ఓసారి.

నా-తండ్రి: అమ్మయ్యో నావల్ల కాదు.

డా-నిర్మల: పోనీ అలా కదలకుండా కూర్చోండి. మీ కడుపులో ఇప్పుడు మరేమీ—

సీత: ఓహోహ. చూడండి డాక్టరు నిర్మలగారూ, ఈయనకు కాలు సుస్తీగావుంట.

నా-తండ్రి. నాకే జబ్బుగా వుందనుకుంటోందేమిటోయ్ ఈవిడ అయితేను? ఓహోయి త్యం!

డా-నిర్మల: ఈ ఇంట్లో మనుషులంతా ఏమిటి చిత్రంగా కనుపిస్తున్నారు. అయితే ఎవరికి ఇక్కడ జబ్బుగా వుంట? ఈ పిచ్చి ఆసుపత్రిలో నాకు కూడా మతిపోయీలాగుంది.

సీత: అసలు పిచ్చివాడు అగదిలో వున్నాడండి.

డా-నిర్మల: ఆయనకి నిజంగా ఉన్మాద మేనా?

సీత: ఓవిధంగా అలాంటిదే—

నా-తండ్రి: అదేమిటోయ్ సీతయ్యా?— చూడండి డాక్టరమ్మగారూ, మావాడు అదేదో ఆమంట తాగి నురుగులు కక్కుకుంటూ

మూర్ఛపోయాను. మీరు వా ణ్ణిలాగైనా రక్షిం చాలి. మీ రుణం తీర్చుకోలేము.

డా-నిర్మల: అమ్లమా? అమ్లమంటే?

సీత: జంబీరామ్ల మన్నాడండి, మా నారా యణ. ఇంగ్లీషులో యాసిడ్ అంటారండి.

డా-నిర్మల: యాసిడ్డే. అయ్యో ఇంతసేపు వూరుకున్నారేం? పదండి ముందు; రోగి ఎక్కడ?

నా-తండ్రి: ఆలస్యం అయిపోయిందం టారా అండి?

సీత: ఇలారండి ఈ గదిలోను. (తలుపు బార్లా తీస్తాడు. నిర్మల లోపల ప్రవేశిస్తుంది.)

స్వామి: (ప్రవేశించి) డాక్టరమ్మగా రొచ్చా రాండి, అయ్యగారూ?—(చూసి) ఇరుగో—

సీత: ఈవిణ్ణి పంపించి ఇంత సేపూ నువ్వెక్కడ పుణికింతా లాడుతున్నావురా, స్వామిగా?

స్వామి: యీరికి మన అడ్రేసు చెప్పి ముందెళ్ళమనంది ....

సీత: ఊఁ. ముందెళ్ళమనీ, నువ్వేం రాచ కార్యం వెలగబెడుతున్నావు?

స్వామి: ఏంటోనండి. దారిలో మా మేన కోడలు కనబడితేనండి—

సీత: సూరా?

స్వామి: సిత్తం.

నా-తండ్రి: ఏంరా, స్వామిగా, ఈలాం టప్పుడు ట్రా మీ మేనగోడలుతో నీ సరాగాలు?

స్వామి: అయ్య బాబు. అది నా క్కాన పడ్డ మే బ్రహ్మాండమండి. అందుకనండి మరి—

సీత: ఇందరా స్వామిగా—(ఒక రూపాయ నోటు జేబులోంచి తీసి యిస్తాడు)

స్వామి: ఏంటండది?

కి న్నె ర

సీత: ఇది పుచ్చుకుని దాచుకో. మంచి డాక్టరుగారిని తీసుకొచ్చావు!

డా-నిర్మల: (గది లోపలనించి) ఇదుగో.

సీత: అదేమిటి అలా వింతగా పలకరిస్తు న్నారు?

నా-తండ్రి: ఏమండమ్మా. ఎలా వుంది మావాడికి?

డా-నిర్మల: ఇంకా ఊపిరి బాగానే తీసు కుంటున్నాడు మీ కుర్రవాడు — అంత భయ పడవలసిన అవసరం లేదనుకుంటాను—

నా-తండ్రి: పోనీ చెప్పకండి; మీ కడుపు చల్లగా—

సీత: ఇంకా మావాడికి స్పృహ రాలే దెందుచేతండి?

డా-నిర్మల: వస్తుంది. మరి-ఏదో యాసిడ్ త్రాగేనంటున్నారా—చూడండి—

సీత: సీతయ్య అండి.

డా-నిర్మల: సీతయ్యగారూ—

సీత. ఏమండి?

డా-నిర్మల: మీ ఇంట్లో నవాసాగరం వుందా, కొంచెం?

సీత: అదేమిటండి—సప్తసాగరాలంటారు గాని నవాసాగరం ఏమిటండి? అది ఇళ్ళల్లో వుండడానికి వీలైనదే అంటారా?

నా-తండ్రి. నవాసాగరం అంటే మందోయ్ వెర్రివాడా? లేదండి, అమ్మా.

డా-నిర్మల: అయ్యో నా మతి మండ. నా ఛెస్టులోనే వుంది. చూడండి నా ఛెస్టు—

సీత. ఏమన్నారు?

డా. నిర్మల: నా ఛెస్టు, మందుల పెట్టి. ఎదురుగుండా కనబడటంలేదూ?

సీత: కనబడకేమండి? తెస్తున్నానండి.

డా-నిర్మల: అతని కనురెప్పలు కదుల్తు

న్నాయి—మీ రెవరైనా కొంచెం పలకరించండి.

సీత: మీరు పిలవండి, ఫరవాలేదు—ఇదుగోనండి మీ చెస్టు. (మంచం ప్రక్కవున్న బల్లమీద పెడతాడు.)

[డాక్టర్ నిర్మల పెట్టి మూతతీసి-స్మెల్లింగ్ సాల్ట్ నారాయణ ముక్కు దగ్గర పెడుతుంది. నారాయణ ఫెడీలుమని రెండు, మూడు తుమ్ములు తుమ్ముతాడు.]

నా-తండ్రి: అద్గదీ, అమ్మయ్యా. ఒరేయ్ నారాయణా, ఇలా చూడు నాయనా ఒకసారి—

డా-నిర్మల: ఈయన పేరు నారాయణా?

సీత: మరేనండి—ఒరే నారాయణా, కళ్లు బాగా విప్పి ఓసారి ఇలా చూడు. ఈ వచ్చిన వా రెవరు?

నారా: (ఆవులిస్తూ పక్కమీద సగం లేచి కూర్చుని) ఏమిటీ, నే నిప్పు డెక్కడున్నాను?

నా-తండ్రి: మన ఇంట్లోనేరా, నాయనా—

సీత: వీరిని గుర్తుపట్టేవా?

నారా: ఏమిటో, నా కళ్ళని నేను నమ్మలేకుండా వున్నాను. ఈమె ఎప్పుడు వచ్చింది? ఆహా, నా భాగ్య దేవతా!

నా-తండ్రి: మన అందరికీసురా, నాయనా.

డా-నిర్మల: ఓహో ఇదా. ఈయన పలవరిస్తున్నాడా?

నా-తండ్రి: రోజూ తెగవాగుతాడండి నిద్దరలో—

డా-నిర్మల: (నారాయణ నాడి పరీక్షించి) అబ్బ నాడి తీవ్రంగా కొట్టుకుంటోంది. "ఆ" అనండి. (నారాయణ ఆశ్చర్యంతో "ఆ" అంటాడు; నిర్మల ధర్మామీటరు అతని నోట్లో పెడుతుంది. అతను కంగారుగా అది కొరకబోతాడు)—అది అలా కొరికెయ్యకండి. (ధర్మామీటరు నోట్లోంచి తీసి చూసి) మళ్లీ టెంపరేచరు లేదు. ఇతను తాగిన గ్లాసేదీ? (సీతయ్య అందిస్తాడు: పుచ్చుకుని) ఆc.

సీత: అదేనండి అసలు మావాడి జబ్బు.

డా-నిర్మల: ఎన్నాళ్ళనుంచి ఇలా వుంటోంది?

నా-తండ్రి: పదిరోజులనించండి.

డా-నిర్మల: ఇంకేం? సైకోన్యురోసిస్!

నా-తండ్రి: అదేం జబ్బోయ్, సీతయ్యా?

సీత: దీన్నే ప్రేమ అనీ, ప్రణయమనీ అంటారులెండి.

డా-నిర్మల: ఇతన్ని లేవదీసి కూర్చోపెట్టండి ముందు.

సీత: పట్టండి—పట్టవేంరా స్వామిగా, అలా గుడ్లప్పచెప్పి చూస్తూ నుంచుంటావేం? ఐసా-అదీ—(ఇద్దరూ కలిసి నారాయణని లేవదీసి కూర్చోబెడతారు)

నారా: ఏమిటీ గందరగోళ మంతాను. (జార్లపడి కూర్చుని) ఈవి దెవరు?

డా-నిర్మల: మీ కిప్పు డేమిటి బాధ?

నారా: మీ రలా నా కెదురుగా నుంచుని యీ హంగామా అంతా చెయ్యడమే ...

డా-నిర్మల: మీరు త్రాగిన దేమిటి?

నారా: ఆ విషయం మీ కెందుకు? అది నా ఆంతరంగిక విషయం.

నా-తండ్రి: తప్పురా, నాయనా. ఆమె ఎవరనుకుంటున్నావు? డాక్టరుగారు.

నారా: ఏమిటి? ఏమిరా సీతయ్యా?

సీత: నిజమేరా, నారాయణా.

నారా: అయితే నాకేం ప్రాణంమీద కొచ్చిందనుకున్నా రేమిటండి, నాన్నగారు డాక్టర్ని పిలిపించారు?

సీత: మరి నువ్వేదో త్రాగి మూర్ఛిల్లావు కాదుట్రా?

డా-నిర్మల: ఇతని కింకా తెలివి బాగా రాలేదు—ఏదీ ఒకసారి లేచి నిలబడండి..

నారా: ఏమిటిది నేను నిలబడను.

నా-తండ్రి: నారాయణా (వారిస్తాడు)

నారా: ఏమిటండి మరి, అసలే నా హృదయం—

డా-నిర్మల: అదే పరీక్షిస్తాను—బట్టలు విప్పండి—

నారా: ఏమిటీ! ఏమి టన్నారు?

డా-నిర్మల: సీతయ్యగారూ—

సీత: వస్తున్నానండి. (నారాయణ కోటు లాగేస్తాడు)

డా-నిర్మల: ఆ చొక్కా కూడాను.

నారా: (సీతయ్య తన చొక్కా-కూడా విప్పడానికి ముందుకి రావడం చూసి) ఉండు, వుండు.

నారా: ఏమిట్రా సీతయ్యా జంతువులాగా?

డా-నిర్మల: త్వరగా.

నా-తండ్రి: చొక్కా విప్పెయ్యరా, నాయనా, డాక్టరుగారు చెపుతోన్నప్పుడు—

నారా: నే ననేదీ, ఎలాగ?

సీత: ఎలాగేమిట్రా?

నారా: అది అంత అవసరమంటారా?

డా-నిర్మల: ముఖ్యంగా—

నారా: కాని—

డా-నిర్మల: ఏం, సిగ్గుపడతారేం?

నారా: ఏం చెయ్యమన్నారు? లేకపోతే సంతోషించమన్నారా? మీ ఎదురుగుండా మర్యాదగా ఉండదేమో అని—

డా-నిర్మల: జబ్బు నయమవడం ముందు, మర్యాదలు తరువాత—

నారా: నా కిప్పుడేం జబ్బులేదు. నేను సంపూర్ణారోగ్యంతో తులతూగుతున్నాను; సరా?

డా-నిర్మల: ఆ సంగతి నేను నిర్ణయించాలి.

నారా: అయితే—

డా-నిర్మల: ఊఁ.

నారా: లోపల బనియను లేదు మరి, చెప్పేస్తున్నాను.

డా-నిర్మల: ఫరవాలేదు,

నారా: (చొక్కా తీసి) సరే కానియ్యండి- (ముడుచుకుని కూర్చుంటాడు)

డా-నిర్మల: (స్టెతస్కోప్‌తో గుండెలు పరీక్షిస్తూ) ఊపిరి గట్టిగా తీసి వదలండి....చలి వేస్తోందా?

నారా: గుడ్డలన్నీ విప్పించేశారు ఈ నడి శీతాకాలంలో అర్ధరాత్రి వేళ చలెయ్యదూ? అదొక జబ్బా?

డా-నిర్మల: ఎక్కువగా మాట్లాడకండి... ఊఁ. మీ రిది వర కెంతమందిని ప్రేమించారు.

నారా: ఏమన్నారు?

డా-నిర్మల: మీ రిదివరకు ఎంతమంది అమ్మాయిలకి మీ నీరసమైన హృదయం అర్పించారు అని—

నా-తండ్రి: ఏమండమ్మా, అంత నీరసంగా వుందా మావాడి గుండె?

సీత: ఇది ముక్కస్య ముక్క హృదయం కాదండి,—ప్రేమ స్థావరం, వలపు పట్టూ అదీని—

డా-నిర్మల: మాట్లాడరేం?

నారా: అలాంటి విషయాలు మీ దగ్గర ఎలాగ చెప్పడం?

డా-నిర్మల: ఫరవాలేదు. డాక్టర్ల దగ్గర ఏమీ దాచకూడదు—ఇంతకీ నేను మిమ్మల్ని ప్రేమించడం లేదుగా?

సీత: బాగా సెలవిచ్చారు.

నారా: నన్నుగురించి ఆ యువతీమణుల అభిప్రాయ మేమిటో పూచీ యివ్వలేను గాని, నేను ప్రేమించిన అమ్మాయిలు—

డా-నిర్మల: "నైన్టీనైన్" అనండి—

నారా: అమ్మయ్యో! అబ్బే. అందులో సగ మైనా వుండరు. తొంభై తొమ్మండుగురే! అమ్మ నాయనో,—

డా-నిర్మల: "నైన్టీనైన్" అని అనండి, దయచేసి—

నారా: ఓహో, 'నేనూ....అంటే ఇంకా నాకూ....అయితే "నైన్టీనైన్."

డా-నిర్మల: (స్టెతస్కోపు మడిచి భుజం మీద వేసుకుని) థేంక్ యూ. మీ ఊపిరి తిత్తులు బాగానే వున్నాయి....(సీతయ్యతో) మీ ఇంట్లో కొత్త సున్నం వుందా.

స్వామి: తమలపాకుల్లో వేసుకునేదేనాండి, అమ్మగారూ?

డా-నిర్మల: అవును.

నా.తండ్రి: ఓ, బోలె డుందండి. నా కాలికి పట్టు వేస్తారా?

డా-నిర్మల: కాదు తెప్పించండి వెంటనే.

స్వామి: ఒక కుండెడు తెప్పించమని సెలవాండి, అమ్మా?

డా-నిర్మల: తొందరగా—

సీత: సున్నం ఎందుకు?

డా-నిర్మల: ఇతను యాసిడ్ త్రాగేడు అంటున్నారు కదూ? దానికి విరుగుడు సున్నం! మీ నారాయణచేత అది తినిపించాలి ముందు!

నారా: ఏమిటి?

సీత: అవునురా. అన్నట్టు నారాయణా, కెమిస్ట్రీలో చదువుకున్నాం కాదూ?

నారా: ఒరే. సీతయ్యా?

సీత: భయం లేదురా. నారాయణ.

నారా: నువ్వు వట్టి బుద్ధిహీనుడవురా!

సీత: ఎందుచేత? ఏం?

నారా: ఇంతేనా నీ తెలివితేటలు? మళ్ళీ ఏదో పెద్ద చదివేనంటావు? ఆమ్లం అంటే పుల్లగా వుండేదేనా? (చొక్కా తొడుక్కుంటూ)

సీత: కాదని ఎవరన్నారు?

నారా: అయితే నిమ్మకాయకి ఇంకో పేరేమిటి?

సీత: జంబీరం—జంబీరమా? హర నీ....

నారా: అంతే....

నా-తండ్రి: కాస్సేపు ఆ సున్నం వచ్చే దాకా ఆ ధోరణి తగ్గించి నిమ్మళంగా వుండరా నాయనా.

నారా: నేను జంబీరామ్లం పుచ్చుకున్నానూ అంటే పంచదార వేసిన నిమ్మపళ్ళరసం సేవించాను అన్నమాట. అది తాగేసరికి నాకు చల్లగా నిద్రపట్టిపోయి పూరుకుంది. దీనికోసం పెద్ద యాసిడ్ అని పేరెట్టి నాచేత కొత్త సున్నం బొక్కించడానికా యీ డాక్టర్ని తీసుకొచ్చి ఇంత హడావిడి చేస్తున్నారు?

నా-తండ్రి: ఏమిటి!—నువ్వు ఆరోగ్యం గానే వున్నావురా, అబ్బీ. ఇంతసేపూను? నీ కోసం ఎంత హడలిపోయి బెంగెట్టుకు పోయా మురా, నిజంగాను?

సీత: సున్నం తినవలసివస్తుందని పీ డిప్పు డిదంతా చెప్పేడు గాని లేకపోతేనాండి—

డా-నిర్మల: చూడండి. ఇంక నేను వచ్చిన పని అయిపోయింది.మీ నారాయణకి ఒక ప్రిస్క్రిప్షన్ ఇస్తాను.

నా-తండ్రి: అయ్యో, ఇంతకంటేనాండి? ఇవ్వండమ్మా. మళ్ళీ ఇలాటి దెప్పుడూ రాకుండాను.

డా-నిర్మల: ఇతని కొక చక్కని సుశీల నెక్కడైనా చూసి పెందరాళే పెళ్ళి చేయించండి.

నా-తండ్రి: ఒక చక్కని ఎవరనీ అన్నారు?

డా-నిర్మల: సుశీలని—

నారా: చూశారా, నాన్నగారూ?

నా-తండ్రి: ఏమోయ్ సీతయ్యా?

సీత: అబ్బే లాభంలేదండి. ఆవిడ మూలానే కాదండి మన కిప్పు డింతేసి పనులు పుట్టాయి?

డా-నిర్మల: అదేమిటి?

సీత: మావాడు సుశీలని ప్రేమించాడు లెండి.

నారా: గాఢంగా అని చెప్పరా, సీతయ్యా, దాచకూడదు.

సీత: గాఢంగానండి, మా నారాయణ ప్రేమ జలధిలో గజ ఈతగాడు లెండి! కాని, ఆమె వీణ్ణి తోసిరాజంది.

డా-నిర్మల: అదా? సుశీల అంటే ఆ సుశీలే కాదు. ఎవరైనా చక్కనిపిల్ల అని నా వుద్దేశం.

నా-తండ్రి: చూశావ్రా, నారాయణా, ఆమె ఏమంటున్నారోను? నే నప్పుడు విశ్వనాధం బావగారి పిల్లని కుదిర్చి చేసుకోరా అని ముద్దుగా చెపితే, అర్థ ఆ తాసిల్దారుగారి అమ్మాయిని ప్రేమిస్తున్నాను అని భీష్మించావు. ఆ తరువాత ఇంకో ప్రమీల అనీ, యీ సుశీల అనీ ఇలా ఇదవుతున్నావు.

నారా: ఏమిటో నాకీ గొడవేమో అర్థం కావడం లేదండి, నాన్నగారూ. మీ రలా అంటే నా మనస్సుకు కష్టంగా వుంటుంది.

డా-నిర్మల: నే నింక వెడతాను మరి, చాలా కాలాతీతం అయిపోయింది.

సీత: ఆచేత్తో నాకు కూడా ఒక మంచి ప్రిస్క్రిప్షన్ ఇచ్చి వెళ్ళరూ.

డా-నిర్మల: మీ కింకా అవసరం లేదు.

సీత: అబ్బే! ఉందండి బాబూ, మీ రింకా గ్రహించలేదు. మీ ఆసుపత్రికి రమ్మన్నారా?

డా-నిర్మల: అవసరం లేదు. తరువాత నేను చెబుతానుగా—

సీత: ఏమిటి? నిజమే.

డా-నిర్మల: అన్నట్టు మీ అడ్రసు ఏమిటి?

సీత: నేనెంత ధన్యుణ్ణి. (జేబులోంచి తీసి) ఇదిగో నా లెటర్ హెడ్డు. నా కప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తోంటారు అనుకుంటాను?

డా-నిర్మల; నా కదే పని. నా బిల్లు ఎక్కడికి పంపించాలో తెలియక అడిగాను, థేంక్స్. నే వస్తానండి.

సీత: అంతే అంటారా?

డా-నిర్మల: అంతే. ఏయ్ అబ్బాయ్, నాతో బండిదాకా రా.

స్వామి: (మెడిసిన్ ఛెస్ట్ తీస్తూ)—చిత్తమండి.

సీత: ఒరేయ్, స్వామిగా అదలా వుంచు. —పోనీ ఛెస్టు అయినా బండిదాకా నన్ను పట్టుకు రానియ్యండి.

డా-నిర్మల: మీ కెందుకులెండి శ్రమ? వీడు తీసుకొస్తాడు.

(డా-నిర్మల, స్వామి నిష్క్రమిస్తారు. —నారాయణ అతని తండ్రి లేచినుంచుంటారు.)

సీత: అసలు ఈవిడకి హృదయం లేదనుకుంటాను.

నా-తండ్రి: నారాయణా, సీతయ్యా. నాయనలారా, మనం ఇవాళ చాలా అదృష్టవంతుల మనుకోండి నిజంగాను!

సీత: ఇదేమిటివేళ? నాకుగూడా నిగ్రహం తప్పిపోయి ఆమెతో ఏదో పిచ్చిపిచ్చిగా మాట్లాడేను. నాకే సిగ్గేస్తోం దిప్పుడు తల్చుకుంటేను. ఇదంతా మన నారాయణ ప్రభావమో, పుష్పబాణ విలాసమో మరి.

నారా: (పకపక నవ్వుతాడు.)

—: ● :—

ప్రార్థనము

భావంబు భయబంధ బాధ్యంబుగాక స్వే
        చ్ఛావిహారము సేయజాలు నెచట;
సాటివారలలోన మేటిగా గరువాన
        తలయెత్తి మసల సాధ్యపడు నెచట;
జ్ఞానధనార్జనా సక్తచిత్తులకు యె
        థేచ్ఛవాంఛితము సిద్ధించు నెచట;
స్వార్థసంకుచితకుడ్యము లుంచి లోకంబు
        భిన్న భిన్నములు గావింప రెచట;
తావకోద్బోధనమున సంతతము విమల
భావనాసత్క్రియావ్యాప్తి బరగు నెచట;
భవ్యపరిపూర్ణతా ఫలప్రాప్తికొరకు
శ్రమ మెరుంగని కృషి కయిసాచు నెచట;
స్వచ్ఛ సధ సద్వివేచనాఝరి విమూఢ
కృతక సంప్రదాయోషర క్షేత్ర మంటి
యిట్టె సుడివడి యిఱ్ఱింకులింక దెచట;
భాషణము లెట సత్యార్థ భూషణములు—
అచట నట్టి సురుచిరానంద స్వాతంత్ర్య
సీమమందు స్వర్గధామమందు
మహితప్రేమ నాదు మాతృధాత్రిని మేలు
కొనగజేసి యేలుకొనవె, తండ్రి!

... రవీంద్రుని కృతికి అవహాత్యుని అనుకృతి.

యాత్రికత్రయము

—షెల్లీ—

వెలుగు రెక్కల తొందర వెడలెదీవ-
హానలంపుయాత్రను నా కొకంత తార-
కా, వచింపవె- యే నిశాకందరమున
నలసి ముడిగెడు నీదు పక్షాంచలములు?

ఇమ్మహాకాశ మాశ్రయహీనమైన
తెరువు తిరిగెడి యాత్రికవరుడ, తుహిన-
కరుడ, చెప్పు మేరేయి పగళులలోతు-
అందు విశ్రాంతికై వెదకాడె దిపుడు?

పవనుడా, డస్సిపోతివి పథఃపథాన
దిరిగి లోక బహిష్కృతాతిథి విధాన;
ఒదవునే రహస్య కులాయ; మొకడు నీకు
గ్రమతరువుల జిరుతరంగముల నెచటో?

—అవ గాత్యుని అనువాదం

డొంక కదిలింది...

జూలై 24, 2011 ఆదివారం కుతుకులూరు వెళ్లి, గ్రామంలోని ఉమాసహిత కుక్కుటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నాను. ఊళ్లో పెద్దల్ని కలిశాను. సత్యవాడకు వెళ్లేదారిలో రామచంద్రాపురంలో ఆగి ప్రముఖ న్యాయవాది బుద్ధవరపు సుబ్బారావుగారి ఇంటికి వెళ్లాను. పొలమూరు బుద్ధవరపువారైన సబ్బారావుగారు ఇంతకుముందు ఎన్నో విషయాలు నాతోపంచుకున్నారు. ఎంతో శ్రద్ధతో పూర్వీకుల వివరాలు సేకరిస్తున్న నన్ను అభినందించేవారు. పొలమూరు–రామవరం బుద్ధవరపువారికీ, కుతుకులూరు–పిడపర్తి బుద్ధవరపువారికి, వారికి పురుడు పుణ్యాలు లేవని చెప్పారు. అయినా వారూ బుద్ధవరపువారే అన్న అభిమానం ఇద్దరిదీ, ఆయనను మళ్లీ వారింటికి వెళ్లిమరీ కలుసుకోవడానికి ఇదే కారణం.

కుతుకులూరు

మాది కుతకులూరు, మా తాత కరణంబు -
అదియు నిరువదవ శతాబ్ది కాది -
పేరు నాగరాజుగారు, నా పేరదే -
వంశమెన్న బుద్ధవరపువారు!

ప్రక్కనున్న రామవరమును, పిడపర్తి
గ్రామముల కొకప్పుడు కరణమతడె!
మకుటమొకటె లేని మహరాజుగా ప్రజా
గౌరవాదరముల జూరగొనియె!

సప్త ఋషుల ప్రవర సహిత కాశ్యపగోత్ర
వరనియోగిశాఖ బ్రాహ్మణులము:
కవనమనిన, రాజ కార్యంబులన, స్నేహ
ధర్మమనిన మాకు తగని ప్రీతి!

అరయ సుబ్బరాయడప్పలరాజును,
నాగరాజు నాయన తనయుండు
సుకృతి మజ్జనకుడు సుబ్బరావును వంశ
పూర్వ పురుషుల తుల పుణ్యమతులు!

(నాగరాజామాత్యుడు)

ఒక రకంగా నేను ఎప్పుడూ వస్తానా అని ఆయన ఎదురు చూస్తున్నారు. ఓ పెద్ద చార్ట్‌పై రాసిన బుద్ధవరపువారి వంశవృక్షం వారు బయటకు తీశారు. ఇది, మా పొలమూరు బుద్ధవరపువారిది కాదు, మీ పూర్వీకుల పేర్లు ఉన్నాయా చూడండి అంటూ నా ముందుంచారు. ఓ క్షణం... ఆశ్చర్యం... ఆనందం... నా కళ్లముందు మా తాతగారు, ముత్తాతగారు, వారి తండ్రిగారు, వారి తండ్రిగారి పేర్లు... ఎగిరి గంతేసినంతపని చేశాను. ఆ వంశవృక్షం ఎన్నిసార్లు చూశానో... తాతగారి పేరునుంచి పైకి, పైపైకి... వేదిరాజుగారి పేరువరకు చూసుకున్నాను. మా అబ్బాయి రాహుల్ తరంతో కలిపి మొత్తం 12 తరాల పేర్లు కళ్లముందు కదిలాయి. ఆ వంశవృక్షంలో మాతాతగారి (9వ తరం) తరం వరకుపేర్లు ఉన్నాయి. 10వ, 11వ, 12వ తరం పేర్లు నా దగ్గర ఉన్నాయి. యురేకా... బుద్ధవరపువారి (కుతుకులూరు) వంశవృక్షం కనుక్కున్నాను. కొలంబస్ అమెరికాను కనుక్కున్నపుడు కూడా నా అంత ఆనందం పొందాడో లేదో, నేను మాత్రం ఆనందంతో ఉప్పొంగిపోయాను. ఫొటోల సేకరణలో భాగంగా చేసిన ప్రయత్నాల్లో మా తాతగారి తమ్ముడు శ్రీ మదనగోపాలరావుగారు స్వదస్తూరితో రాసిన ఒక పుస్తకం నా కంటపడింది. మదనగోపాలరావుగారి నాల్గవ సంతానం సూర్య సీతారామచంద్రరావుగారి ఇంట్లో ఈ పుస్తకం తారసపడింది. సూర్యసీతారామచంద్రరావుగారి భార్య శ్రీమతి బుద్ధవరపు వినయలతారావుగారు నోటుబుక్కు చూపించారు. మదనగోపాలరావుగారు రాసి ఉంచిన సమాచారంలో వారి తండ్రి నాగరాజుగారు, తల్లి కనకమ్మ, నాగరాజుగారి తండ్రి అప్పలరాజుగారు, తల్లి శేషమ్మ, అప్పలరాజుగారి తండ్రి చలమయ్య, తల్లి సింగమ్మగారి పేర్లు తెలిశాయి. (ఈ నోటుబుక్కులో వారి స్వదస్తూరితో ఉన్న వివరాలు పక్కపేజీ (10)లో)

ఆ వంశవృక్షం ఉన్న చార్ట్‌ను ఒక్కోసారి చూసినపుడు ఒక్కో ముడి విడిపోయింది. మా ముత్తాత నాగరాజు (నాగేశ్వరశర్మ)గారి అన్నదమ్ముల గురించి, వారి తండ్రి అప్పలరాజు (అప్పల నృసింహేశ్వరశర్మ)గారి అన్నదమ్ములు, వారి తండ్రి చలమయ్య

నాగరాజుగారి 'నవకవి'

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

ఆధునికాంధ్రసారస్వతంలోకి, హాలాహలంలాగు క్రొత్తగా అడుగుపెట్టింది 'నవకవి' అనే ఏకాంక నాటిక.*

దీన్ని నేటిసారస్వతులలో కొందరు వెరగుపాటుతోనూ, కొందరు తిరుగుబాటుతోనూ చూస్తున్నారు.

కవయిత బుద్ధవరపు నాగరాజు బి. ఏ. గారు ఇంతవరకూ ఆంధ్రలోకానికి అంతగా పరిచితులు కారు.

నేడు ఎట్టిసాహిత్యసత్తా సంపాదించకుండా బయలుదేరి పైకి వచ్చే కొందరు యువకులవలె గాక ఎన్నో సారస్వతమర్మములను పరిశీలించియున్నా ఇంకా ఏదో జిజ్ఞాసతో తల పైకెత్తడానికి సందేహించే తరగతివాడీ నాటికారచయిత.

ఈయన ఆంగ్లాంధ్రవాఙ్మయాల విజ్ఞానపుమేరలలో అడుగుపెట్టి తరచి చూచిన యువకుడు. ప్రాచీన అర్వాచీన భేదాల పెనుగులాటల్లో దిగక ఉపాదేయమును ఆదరబుద్ధితో గ్రహించే పక్వహృదయుడు.

శ్రీనాథ రామకృష్ణాది ప్రాచీనాంధ్రకవులకు సుపరిచితుడు. ప్రసిద్ధనవకవులలో కొందరికి పరమస్నిగ్ధుడు.

ఏవంగుణ విశేషుణ విశిష్టుని చేతి నుండి వచ్చింది నాటిక. దీనిని ఒకసారి తిరగవేసినవారు సులభంగా స్థూలదృష్టితో శుక్లపక్షాదిగణం†లో చేర్చివేస్తారు. వెంటనే నవ్యసాహిత్యప్రతిపక్షులు దీన్ని ఆదరించనూ చూస్తారు. కాని—

వివేచనతోగూడిన సూక్ష్మబుద్ధి ఉపయోగిస్తే దీని పరమప్రయోజనం బోధపడుతుంది.

సుమారు పాదశతాబ్దికి పూర్వం పుట్టి వంగ, ఆంగ్లేయాది సుప్రసిద్ధసారస్వతాల సహకారంతో సర్వతోముఖవికాసానికి అర్రులుచాచే నవ్యాంధ్రసాహిత్యంపట్ల ఎవరో వికృతబుద్ధులు తప్ప సహృదయ సారస్వతులెవ్వరూ విముఖులుగా వుండరు. అట్టి సాహిత్యనిర్మాతల ప్రతిభను శంకించే సంశయాత్ములున్నా తరచు లేరు. కాని కొందరు యువకులు భాషాశక్తిగాని భావనాశక్తిగాని లేకుండా కొన్ని చిల్లరలక్షణాలవల్ల నవకవి వేషాలువేసి సత్యనవ్యకవుల విచిత్రాదర్శాల లోతులు తెలియక వాటిని గుడ్డిగా అనుకరించి నవ్యసాహిత్యపీఠానికి తీరనికళంకం ఆపాదిస్తున్నారు. తెలియనివారు వీరిని చూచి వీరి దోషాల నన్నిటినీ యావన్నవ్యసాహి

* నాటిక అనేమాటను ఔపచారికంగా ఇక్కడ నేను వాడుకున్నాను. అసలు నాటికాలక్షణం వేరుగావుంది.

† ౧. 'శుక్లపక్షం', ౨. 'నేటికాలపు కవిత్వం', ౩. 'వైతాళికులు', ౪. 'సాహిత్యకళ'—ఇది నూర్పృతిగ(౧౯౨౧).

త్యానికిన్నీ [illegible] నవ్యసాహిత్య [illegible] "అంగ్ర [illegible] ఖండించి [illegible]" రెండోరకం సనకవులను (ఇప్పటివారిలో వీరి సంఖ్య ఎక్కువ) [illegible] ముందటివారి ఉన్నస్థితికి [illegible] వుంది.

నాగరాజుగారి ప్రయత్నం ఇటువంటిది. ఈయన నాటికలోంది నిర్భాగ్య విశ్వతిలోని మాట లివి :

"ఇతనికి (రామానికి) వారి (నవకవుల) అలవాట్లూ హావభావాలు మాత్రమే పట్టుబడి, వారలవరచుకొన్న అనుభూతి నిత్యం లోపించింది. కవితావనంలో కొన్ని ఉగ్రవ్యాఘ్రాలు ఉంటాయి. కొన్ని [illegible] జంబుకాలు కూడా వుంటాయి, వాని పెట్టుకోడానికి. ఒకదానిది గంభీరారావము. ఒకదానిది వెర్రికూత."

కనుక ఈ రచనకు హేతువు నవకవుల మీంది అసూయకాక ఒక న్యాయ్యమైన లక్ష్యం కారణం అని నమ్మితే దీనిని శంకిస్తూ చూడవలసిన అవసరంపోతుంది.

ఈ లక్ష్యసాధనకు ఇతను తీసుకున్నది ఒక అవకాశవాదవకవి అవివేకప్రేమవ్యవసాయం వస్తువు.

కథానాయకుడు రామం అనే నేటికాలపు యువకుడు కొందరు నవకవులను — వారిపుస్తకాలను చూసి భ్రమసి, తన కున్న మిడిమిడిజ్ఞానాన్ని పురస్కరించుకొని కొత్తరకపు వలపుకవిత్వంలో పడ్డాడు. నరే- అందరిలాగనూ తనుకూడా ఒక ఆదర్శప్రేయ సని [illegible] ఎన్నిలుకున్నాడు. [illegible] — ఇంక [illegible] మొదలు పెట్టాడు.

[illegible] పెట్టుకో [illegible] ఇతనికి [illegible] వాడుకొని — [illegible] వంటి శాపుగా చేస్తున్నది.

రామం హాస్యాస్పదంగా [illegible] వాలి [illegible] ప్రణయాత్మకసాహిత్యం [illegible] చేసి [illegible] పురాటాడు.

ఇంతట్లో [illegible] పరిశోధ [illegible] ప్రవేశిస్తాడు. రామం [illegible] జపాను రాముడు. [illegible] టికి ఆగలేక తప్పటడుగులువేసి తిప్పనట్లు తిరిగి పెద్దలుచూచి [illegible] కథ అర్ధంగా తిరిగిపోతుంది.

ఈకథలో విశ్వనాథ సత్యనారాయణ గారి 'తల్లిలేనిపిల్ల'లోని విచ్ఛిత్తివిశేషం వుంది. విమర్శించదగ్గ కొన్ని సమస్యలను కావ్యవస్తువుగా తీసుకొన్నప్పుడు — వాటిని చక్కగా ఎత్తి చూపడంకోసం కొంచెం అతిశయోక్తి అవసరంగా వుంటుంది. తాత్కాలికంగా అట్టికల్పన అసహజంగా తోచినా

కావ్యకళాదృష్ట్యా అది చమత్కారపర్యవసాయియే అవుతుంది.

కనుక సత్యనారాయణగారి 'తల్లిలేని పిల్ల'లోని కల్యాణీనాయుడూ — వసుంధరాదులూ 'నవకవి'లోని రామం — మణీ — పరశూ కొంచెం అస్వాభావికస్వభావాలతో కనిపిస్తున్నా — కొందరు మనుష్యుల వివిధ మనఃప్రవృత్తులను — అనేకసమస్యలనూ తమలోనే చూపి ఒకవిశేషవ్యక్తిత్వాన్ని నిరూపిస్తున్నారు.

పెద్దనాటకంకంటె ఏకాంకనాటకంలో ఒకవిమర్శనాప్రదసన్నివేశాన్ని తీసుకుని బాగా నిర్వహించడం చాలా కష్టం. నాగరాజుగారు ఇట్టి క్లిష్టమైన పనికి పూనుకుని సాధ్యమైనంతవరకూ నేర్పుగా నిర్వహించినారని చెప్పవచ్చు.

ఈ రూపికలోని పాత్రలు ఒకరిని మించినవారొకరు.

రామం సరియైన ఆంధ్రసారస్వతహృదయం తెలియకుండా తెనుగుకవిత్వంలోకి చొరబడ్డాడు. చెప్పదగ్గభావాలు తనకు లేకపోగా ఇంగ్లీషుకవుల భావములను మెలికలు తిప్పి తెనుగులో పెట్టి అన్నీ తనవే అంటాడు. తరచు అతని తెనుగు వాక్యాలు తెనుగులో కొమ్ములుతిరిగినవారికైనా అర్థంకావు. ఇక తన ప్రేయసి తనను నిజంగా ప్రేమిస్తోందో లేదో తెలియనివాడు. పోనీ ఆధ్యాత్మికప్రేమకు ఉండామన్నా సమయమైతే మనిషినే కోరే కక్కుర్తిమనిషి. పుస్తకాల్లో చదివిన ప్రేమకథలు నిత్యజీవితంలో ప్రవేశపెడితే అభిమంగాలు ఎదురుపడతాయనుకోని జనుము.

మణీ రామంకన్న మిన్న. తన బతుకు తెరువు బాగా ఎరిగినది. ఇట్లాంటి ఆశ్రితులను ఆటవస్తువులుగా ఉపయోగించి తుదకు "గీతమాలిక అంకితమిస్తే హృదయం మిస్తానా" అన్నట్లు ఈసడించి జాగ్రత్తపడగలది. తన అందానికీ — తెలివికీ ముగ్ధులైన వారిని బహాయిగా యిష్టంవచ్చినట్లు తిప్పగల మదవతి.

పరశు ఇద్దరినీ మించినవాడు. మంచి హుషారైనవాడు. భార్యను దేవతగా గాని, దాసిగా గాని చూడక స్నేహితురాలుగా చూడగలిగిన సంస్కారి. రామంవంటి విశారాదర్శకులను సునిశితతర్కంలోకి దించి "శతాస్త్రి" అనిపించగల చేవగలవాడు.

ఇట్టి క్రమక్రమ వికసితపాత్రలతో నాగరాజుగారి పాత్రపోషణమెంతయు ఒక మంచి మేరకు వెళ్ళి చక్కని నిర్వహణమును సాధించింది.

మహాకావ్యమునకు ఖండకావ్యం, నవలకు కథానిక ఉన్నట్లే విపులచిత్రసన్నివేశాలతో రచింపబడే మహారూపకాలకంటె ఏకాంకనాటకం స్వల్పరసప్రచన.

చమత్కారమైన ఒకసంఘటనను వస్తువుగా తీసుకొని చిన్ననాట్యరసాలలో ఒకటి పోషితం చేసి — ఒకేరంగంలో — ఒకటి రెండు గంటల్లో ముగిసేటట్లు నిర్వహించడం ఏకాంకికకు విశిష్టలక్షణంగా చెప్పవచ్చు. పైగా నాటకసామాన్యమైన ఘాతప్రతిఘాతములూ — ఉక్తిచాతుర్యం ముఖ్యంగా వుండాలి.

ఇట్టివి ఆడడంకంటె చదవడానికి ఎక్కువ బాగుంటాయి. సమస్యలు మాత్రమే ఆడగలవు.

'నవకవి' చక్రపాణి ఏకాంకనాటకం. కథంతా ఒక్క గంటలో — ఒక్క గదిలో — ముగ్గురు పాత్రలతో హాస్యరసప్రధానంగా నడచింది.

రామం ప్రవేశం ఒకఆశతో ప్రారంభమై మణి తెలివైన తిరుగుబాటుతో ఒక మలుపునకు తిరిగిపోయింది. పరశు గొడ్డలిపెట్టుతో అతని స్వభావమే హఠాత్తుగా మారి సంసారిపక్షం అయిపోవడం నాటకత్వానికి ఎంతో తోడ్పడింది.

రామం మణీ, జరుపుతూన్న వాదోపవాద తుఫానులో, అసలు పరశు ప్రవేశమే కన్నులు జిగేలుమనే ఒకమెరుపు. ఇక్కడ నుంచి కథకు ఒకచురుకూ, — సంభాషణకు ఒక అపూర్వరుచీ,— రసాని కొక నవీనత్వం సిద్ధించాయి.

ఇందులో ముఖ్యంగా చెప్పదగ్గది కవి ఉక్తిచాతుర్యం. పట్టి సంభాషణను చమత్కారవచనముఖరితం చెయ్యడంలో ఈయన సిద్ధహస్తుడు.

రామం — ప్రపంచాని కసలు మూలం అహం కదా.

మణి — కాదు — అహం — నాకేదు money "ధనమూల మిదం జగత్" అన్నారు కదూ.

... ...

రామం — ఏం నాకేసి ఇంకా అలా బెదురుగా కేటుదొంగకేసి చూసినట్టు చూస్తున్నావు?

మణి — (చిరునవ్వుతో) ఏమీ లేదు. వాళ్ల కళ్లల్లో వుండే చురుకుతనం నీకళ్లల్లో ఉందని—

... ...

పరశు — ఏమంటావ్! మై మని —

మణి — ఏం మై పర్సా — అయిందా —

... ...

రామం — మతమంటే ఈశ్వరునియందు దృఢవిశ్వాసముండీ —

పరశు — ఓవర్ లోటంకి! ఈకాలంలో విశ్వాసం ఎవరికుంది — కుక్కలకే లేదు— —

ఇట్లా మాటలమీద మాటలను ఆడించడం ఇతనికి బాగా పట్టుబడింది.

ఇతడు కవిత్వం-ప్రేమ-వివాహబంధం-ఘోషాపద్ధతి - ఏకపత్నీవ్రతం - దేవుళ్ళు - గుళ్ళు - మతం — వీటినిగురించి నాటికలో చేసిన చమత్కారతర్కం ముచ్చటగా వుండి పాఠకుడి కౌతుకాన్ని పువ్వులాగు వికసింపజేస్తున్నది.

ఇందులోని 'షా'గారి పేరడాక్సు — ఉత్తరరామచరిత్ర పద్యోదాహరణాలూ — రామకృష్ణకవిమీది అభిమానం రచయిత వివిధసంస్కారసత్తను చెప్పుతూన్నవి.

ఈ నాటికను ప్రదర్శించడానికికూడా కవి తగిన జాగ్రత్త తీసుకుని అద్యంతాలలో రెండుపాటలూ, మధ్య రామానివిగా ౫ పద్యాలును ఉంచినాడు.

ఈ పద్యాలూ — మొదటిపాటా రామానివి. పైకి చదవడానికి హాయిగానే ఉన్నాయి. కాని అర్థవివేచన చేస్తే, ఎన్నో అపశబ్దాలూ — అపక్రమాలూ — విజాతీయభావాలూ — వుండి తాత్పర్యం మనక మనకగా నీడలా తేలిపోతూ కనిపిస్తుంది. ఇందులో కొన్ని సుప్రసిద్ధ ఆంగ్లకవి షెల్లీ (Shelly) పద్యాలకు పేరుచెప్పని తెనిగింపులు. చూడండి—

We look before and after
And pine for what is not
Our sincerest laughter
With some pain is fraught
Our sweetest songs are those
That tell of saddest thought
—'To A Skylark'

సీనికి నవకవితెనుగు (రతి లేక)—

"ఉందుకొలుకు లరసి కొంపక్కొ కెరె ఐదం
నాపశీయమ మిక్కుటైనవాని
కమలలోచనులు కళ్యాపూరితములు నీర
ములు నిలువభావపూరితములు.

"..... ....Oh wind!
If winter comes can spring
be far behind?
—"Ode to the West Wird'

"ప్రాప్తకాలంతరాభావసాప్తి లేక
కాంతకే రాక సంధ్యలంతాగమము"

ఇంకా ఈపద్యాలలో "నార్ధదగ్ధము" వంటి విచిత్రపదప్రయోగాలు ఉన్నాయి. మొదటిపాటలో ఏమీ అందుబాటులోని భావం కనిపించదు. కవి చెప్పితేనే తెలియాలి.

ఇందులో నవకవిపాత్రానుగుణముగా ఇట్టిపద్యములు వ్రాసి అతని చాతుర్యవైశిష్ట్యమును ధ్వనింపజేసి ఔచిత్యవంతమైన మెలకువను రచయిత చూపినాడు.

నాటికలో రామం ప్రవేశం వర్షంతో ప్రారంభించడం, అతని నిర్గమనం వర్షం వెలిసిపోవడంతో జరగడం చూడగా ఇందులో నాటకీయమైన చక్కని వస్తుధ్వని వున్నది.

ఇట్లా నాటికను పూర్తిచేసి [illegible] నాటకీయమైన విపులసమాలోచన [illegible] హృదయాన్ని ప్రత్యక్షంగా చూపినాడు. ఇందువల్ల వారకు [illegible] కర్యం ఏర్పడింది.

తొలియత్నమైనా నాగరాజుగారు ఆది నుంచి అంతందాకా కుతూహలమును కల్పిస్తూ నాటికను మధురంగా నిర్వహించినారని చెప్పవచ్చు.

కాని —


మణి — రామారావు సంభాషణ ఎంత చమత్కారంగా వున్నా నాట్యానికనుగుణంగా లేదు.

వారి వాదాలలో కొన్నిసమాసాలు క్లిష్టముగా వుండక విమర్శనీయములుగా కన్పిస్తున్నాయి. అసలు నాటకసంభాషణలో అంత పారిభాషికచర్చ పెడితే కళ నిలవడం కష్టం. మణి ప్రవేశంలో ఆవేదనగా ఆలోచించడం — తీక్షణంగా గవాక్షంలోంచి చూడడం లేకపోతేనే బాగుంటుం దని నాఅభిప్రాయం.

ఇట్లా చిన్నచిన్నలోపాలు కన్పించినా మొత్తంమీద గుణప్రాచుర్యమూ — సుందరకావ్యత్వమూ ఇందులో వున్నవి.

పుస్తకపుకూర్పూ — అచ్చూకూడ మిక్కిలి ఆకర్షణీయములుగా వున్నాయి.

ఇకముందు శ్రీనాగరాజుగారు ఈనాటికలో నాటిన ప్రతిభాబీజములను పెంపొందించి ఎన్నో ఉత్తమనాటకాలు వ్రాసి ఆంధ్రనాటకరచయితృశ్రేణిలో ఉత్తమస్థానాన్ని ఆక్రమించగలరని నమ్ముతున్నాను.



నాగరాజామాత్యుడు

శ్రీ బుద్ధవరపు నాగరాజుగారు మే 28న 1913లో శ్రీ బుద్ధవరపు వెంకట సుబ్బారావుగారు, శ్రీమతి మహాలక్ష్మి దంపతులకు జన్మించారు. వీరి స్కూల్ మొదట్లో ఆలమూరులోనే అయినా తరువాత హైస్కూల్ చదువు పిఠాపురంలో జరిగింది. ఇంటర్, బి.ఏ. గుంటూరు ఏ.సి. కాలేజీలో చదివారు. అక్కడే ప్రముఖ రచయితలు శ్రీ త్రిపురనేని గోపీచంద్, శ్రీ జి.వి. కృష్ణారావు వీరికి సహాధ్యాయులు, ఆప్తమిత్రులు. తరువాత వీరు బి.ఇడి. రాజమండ్రి ట్రైనింగ్ కాలేజీలో చేశారు. 1934-40లో పిఠాపురం మహారాజుగారి వద్ద పర్సనల్ సెక్రటరీగా పనిచేశారు. 1939లో జంటకవులైన వెంకటపార్వతీశ కవులలో ఒకరైన శ్రీ బాలాంత్రపు వెంకటరావుగారి కుమార్తె అనూరాధగారితో వీరి వివాహం అయ్యింది. ఆయన వీరికి మేనమామ కూడా. రెండవ ప్రపంచ యుద్ధసమయంలో ఢిల్లీనుంచి ఆల్ ఇండియా రేడియో ఎక్స్‌టర్నల్ సర్వీసెస్ ద్వారా ప్రసారమైన తెలుగు కార్యక్రమములకు ఎనౌన్సర్‌గా పనిచేశారు. ఆ సమయంలో అనూరాధగారు కూడా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అప్పుడు శ్రీ కపిల కాశీపతి, శ్రీ పన్యాల రంగనాధరావు, శ్రీవాత్సవ (శ్రీ వై. సత్యనారాయణ), శ్రీ కాలపాటపు రాంగోపాల్ వీరితోపాటు పనిచేశారు. పి.జి. ఉడ్‌హౌస్ (P.G. Woodhouse) ప్రేరణతో నాగరాజుగారు రాసిన అనేక హాస్యనాటికలలో అనూరాధగారు కూడా పాల్గొన్నారు. నాగరాజామాత్యుని నాటికలుగా ప్రచురించబడ్డ నాటికలు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఆయన హాస్యప్రియత్వానికి అవి ప్రతీకలు. విప్లవాత్మకమైన ఆలోచనలతో వీరు 'నవకవి' అనే నాటిక రాశారు. సుప్రసిద్ధ రచయిత శ్రీ బుచ్చిబాబుగారి ప్రేరణతో మద్రాసు రేడియో కేంద్రమునుండి 'పిచ్చివాళ్ల పంచాయితి' ప్రసారమయింది. ఇది వివాదాస్పదమయి రచయితగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి శిష్యరికంలో కొన్నాళ్లు భావకవిత్వం రాశారు. మిత్రుడు టెంపోరావు ప్రోద్బలంతో 'చెల్లని చెక్కు' అనే డిటెక్టివ్ నవల కూడా రాసి ప్రచురించారు. 'సంక్రాంతి' అనే సినిమా స్క్రిప్టు ప్రచురణకు నోచుకోని వీరి మంచి రచనలలో ఒకటి. 'సావిత్రమ్మగారి సంధ్యారాగం' వీరికి పేరు తెచ్చిపెట్టిన మరొక రచన.

1946లో నార్ల వేంకటేశ్వరరావుగారి సంపాదకత్వంలో మదరాసు నుండి వెలువడిన ఆంధ్రప్రభ దినపత్రిక సహాయ సంపాదకుడిగా చేరారు. 1958 మదరాసులో మూతబడిన ఆ పత్రిక శ్రీ నీలంరాజు వెంకట శేషయ్యగారి సంపాదకత్వంలో మళ్లీ ప్రారంభించబడినప్పుడు అక్కడ అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరారు. 1966 నుండి 1977లో రిటైర్ అయ్యేదాకా బెంగళూరులో ఎడిషన్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. 40, 50 దశకాలలో చక్రపాణిగారి సంపాదకత్వంలో వెలువడిన ఆంధ్రజ్యోతిలో, ఆనందవాణిలో అనూరాధగారి కథలు ప్రచురించబడ్డాయి.

(నాగరాజామాత్యుడి గురించిన ఈ అమూల్య సమాచారాన్ని అందజేసిన బాలాంత్రపు హేమచంద్ర (బాబు)కి కృతజ్ఞతలు.)